

శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశంలో పాల్గొన్న ఎపి డిజిపి హరీష్ కుమార్ గుప్తా

# నక్సల్ రహిత రాష్ట్రం తెలంగాణ

>>కమిటీ సమావేశంలో సిఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షి ణాది రాష్ట్రాల పోలీసు బలగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని, రాష్ట్రాల సరిహద్దులతో సంబంధం లేకుండా పోలీసులు పరస్పరం సహకరించుకుని నేరాలను రూపుమాపాలని కోరారు. హైదరాబాద్ మహా న గరం భవిష్యత్‌ను దృష్టిలో వుంచుకుని నాలుగు కమిషనరేట్లుగా మార్చి పోలీసు విభాగాలను ఆధునీకరించామని, ఆయా ప్రాంతాలలో శాంతి భద్రతలతో పాటు నేరాల నివారణకు కమిషనర్లకు సొంతంగా విజన్ వుండేలా చూశామని సిఎం తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలతో పాటు పలు విభాగాల్లో నేరాలను పూర్తిగా రూపుమాపేందుకు ఈగల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టిజి సేఫ్ విభాగాలను, కబ్జాలను అడ్డుకునేందుకు హైడ్రాను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ నాలుగు విభాగాలు నేడు రాష్ట్రంలో అత్యంత కీలకంగా మారాయని ఆయన అన్నారు. నేరా ల స్వరూపం మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాల్లోనూ నిరంతర సంస్కరణలు అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసులకు కేటా యించే నిధులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, ప్రజల భద్రతకు చేసే పెట్టుబడిగా చూడాలని ఆయన చెప్పారు. ప్రజలు స మర్థంగా పనిచేసే, నైతిక విలువలను పాటించే, పక్షపాతం లేకుండా వ్యవహరించే పోలీసు వ్యవస్థను ఆశిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్ర స్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, కల్తీ ఆహారం, నకిలీ మందులు, ట్రాఫిక్ సమస్యలు కీలక సవాళ్లుగా మారాయని సిఎం తెలిపారు. వీటిని ఎదుర్కొనేందుకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సిబ్బందికి శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు.

సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని సిఎం తెలిపారు. తెలంగాణను నక్సల్ రహిత రాష్ట్రంగా మార్చడంలో పోలీసుల కృషిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారని సిఎం చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగ ల్ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా మార్కులు ఇచ్చిందని సిఎం తెలిపారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన డబ్బును తి రిగి ఇప్పించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని ఆయన పేర్కొన్నారు.

ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణ కోసం అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా టిజిసేఫ్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణలో హైడ్రా కీలకంగా పనిచేస్తోందని సిఎం తెలిపారు. డిజిపి ఆనంద్ మాట్లాడుతూ నేరాల కట్టడికి దక్షి ణాది రాష్ట్రాల ఉమ్మడి కార్యాచరణతో పాటు ఉమ్మడి సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేసి, నోడల్ అధికారులను నియమించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాదాన్ని సమర్థంగా అరికట్టేందుకు రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సమన్వయాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా తెలంగాణ పోలీసు శాఖ ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి, సిబ్బంది నైపుణ్యాలను సమర్థంగా వినియోగిస్తోందని ఆనంద్ తెలిపారు. నేరాలను అరికట్టేందుకు పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞా నాన్ని, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిజిపి తెలిపారు. ఈ సమా వేశంలో తమిళనాడు డిజిపి మహేష్ అగర్వాల్, కేరళ డిజిపి అజిత బేగం, పుదుచ్చేరి డిజిపి శాలిని సింగ్, లక్షద్వీప్ అదనపు డిజి శంకర్ జైస్వాల్, ఎపి ఈగల్ ఐజి రవి కృష్ణతో పాటు రాష్ట్ర పోలీసు విభాగం నుంచి ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా, టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్, శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్ మహేష్ భగవత్, సిటీ కొత్వాల్ సజ్జన్నర్ తదితరులు పాల్గొన్నారు.

# చింతలపూడి పనులు నవంబరు నుంచి పునఃప్రారంభం

>> ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రాజెక్టులో ఇప్పటివరకు 90.2 శాతం సివిల్ పనులు పూర్తి అయినట్టు అధికారులు సీఎంకు వివరించారు. ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌లో గ్యాప్ 1, గ్యాప్2 పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. నిపుణుల కమిటీ పలుమార్లు ప్రాజెక్టును సందర్శించి నిర్మాణ పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాలువల ద్వారా గరిష్ఠ స్థాయిలో నీటిని తరలించేలా వాటి సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ప్రాజెక్టు వద్ద నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జిని పూర్తి చేసి రాకపోకలతోపాటు పర్యాటక అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని సూచించారు. గోదావరి-పెన్నా అనుసంధానంపై కార్యాచరణ ప్రారంభించాలని, గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తరలించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రకాశం బ్యారేజికి ఎగువన, దిగువన వైకుంఠపురం, చోడవరం వద్ద ఆనకట్టల నిర్మాణం ద్వారా 14 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలన్నీ క్రియా శీలంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు, భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా విశాఖపట్నం వరకు అంతర్గత జల రవాణాకు అవసరమైన నావిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

జలధార-జలహారతి రెండో దశ పనులను మార్చి 31 వరకు కొనసాగిస్తూ, 150 రోజుల కార్యక్రమంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం వీబీజీ రామ్ జీతో అనుసంధానం చేసి పనులు చేపట్టాలన్నారు. 2027 ఏప్రిల్ 1 నుంచి మూడో దశ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. భూగర్భ జలమట్టాలను మూడు మీటర్లకు పైగా పెంచే లక్ష్యంతో చర్యలు చేపట్టాలన్నారు. జలధార-జల హారతిని నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తూ వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను పెంచాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నా ప్రకృతి వ్యవసాయం ద్వారా స్థూల వ్యవసాయ ఉత్పత్తి తగ్గకుండా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే 36 ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాలువలపై సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి అన్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టి కాలువల నిర్వహణను మెరుగుపరచాలని, పూడిక తొలగించి చిట్ట చివరి ఎకరాకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లాకులు, షట్టర్లు, గేట్ల నిర్వహణను పటిష్ఠం చేయాలని సూచించారు.బంగాళాఖాతంలో ఏర్పడే తుపాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ రిజర్వాయర్లు, చెరువులను నింపాలని సూచించారు.

ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, చీఫ్ ఇంజనీర్లు హాజరయ్యారు.

# గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు కేంద్రం అండ

>> రాష్ట్ర ట్రాన్స్‌కో నెట్‌వర్క్ ద్వారా సుమారు 18,000ల మెగావాట్ల కరెంట్ సరఫరా చేసే సామర్థం ఉంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర విద్యుత్ సంస్థ అంచనా వేస్తోంది. 2036 నాటికి ఏపీకి 36,000ల మెగావాట్ల విద్యుత్ సరఫరా నెట్‌వర్క్ అవసరమవుతుందని సీఈఏ అంచనా వేసింది. అయితే 400 కేవీ సబ్‌స్టేషన్ల ద్వారా భారీ మొత్తంలో కరెంట్ సరఫరా చేస్తే నష్టాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని సబ్‌స్టేషన్లను 765 కేవీ సామర్థ్యానికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.

**జాతీయ స్థాయిలో గ్రీన్ ఎనర్జీ కారిడార్:**జాతీయ స్థాయిలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ప్రాజెక్టుల కోసం కేంద్రం మొత్తం 1.86 లక్షల కోట్లు కేటాయించింది. వివిధ రాష్ట్రాల్లో సుమారు 135 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను తరలించేందుకు అవసరమైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ఈ పథకం లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు కూడా నెట్‌వర్క్ విస్తరణకు అవకాశం కల్పించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ (జీఈసీ) పథకాన్ని ఛాలెంజింగ్ మోడ్‌లో అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీని ప్రకారం విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అవసరమైన ప్రైవేట్ భూముల రైట్ ఆఫ్ వే అనుమతులు, అటవీ శాఖ అనుమతులు ముందుగా ఎవరైతే పూర్తి చేస్తారో ఆయా రాష్ట్రాలకు తొలి ప్రాధాన్యం కింద మంజూరు చేస్తారు. అటవీ భూములకు సంబంధించిన అనుమతుల కోసం ఏపీ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. ఆర్‌ఓడబ్ల్యూ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి రెవెన్యూ శాఖలో రిటైర్డ్ ఉద్యోగుల సేవలు వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో నిర్ణయం తీసుకుంది. టారిఫ్ బేస్డ్ కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో గుత్తేదారు సంస్థలను కేంద్రం ఎంపిక చేయనుంది. బిడ్డింగ్ ప్రక్రియ సమన్వయం కోసం ఆర్‌ఈసీ లేదా పీఎఫ్‌సీ సంస్థల్లో ఒకదాన్ని రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఎంచుకోవచ్చు. భూసేకరణ, అనుమతులు, టెండర్ల ప్రక్రియ సకాలంలో పూర్తయితే ప్రాజెక్టు అమలుకు వేగం పుంజుకోనుంది.

# ఎన్నికల చిత్రాలు!

>>జడ్‌పిటిసి స్థానాలు, 9,829 ఎంపిటిసి స్థానాల్లో నామినేషన్ల దాఖలుకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గడువు ముగిసింది. దీంతో ఈనెల 25న ఎంపిటిసి, జడ్‌పిటిసి నామినేషన్ల పరిశీలన, తుది జాబితా ప్రకటన ఉంటుంది. రాష్ట్రంలో ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. నేడు చివరిరోజు ప్రధాన పార్టీల అభ్యర్థులు కోలాహలంగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం చివరిరోజున పోలీసులు కేంద్రాల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నామినేషన్ల చివరి రోజు బాపట్ల జిల్లా చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో సందడి వాతావరణం నెలకొంది. చీరాలలో టిడిపి, వైఎస్సార్సీపి అభ్యర్థులు ర్యాలీగా వచ్చి ఎంపిటిసి స్థానాలకు నామినేషన్లు వేశారు. నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి నామినేషన్ కేంద్రం వద్దకు వచారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో 7 మండలాల్లో ఎంపిటిసి నామినేషన్లు పర్వం ప్రశాంతంగా సాగింది. కౌతాళంలో నామినేషన్ల దాఖలు కేంద్రాల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు మండలం నుంచి కూటమి జడ్‌పిటిసి అభ్యర్థిగా పరిటాల శ్రీరామ్ నామినేషన్ దాఖలు చేశారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే, జిల్లా టిడిపి అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు శ్రీరామ్‌తో కలిసి నామినేషన్‌కు వెళ్లారు.

సుప్రీంకోర్టు ఆదేశాలతో పురపాలక సంఘ ఎన్నికల నామినేషన్ దాఖలు సమయం పొడిగించడంతో కడప జిల్లా మైదుకూరులో వైఎస్సార్సీపి అభ్యర్థులు నామినేషన్ వేశారు. పోలీస్ రక్షణ మధ్య ప్రత్యేక వాహనాల్లో నామినేషన్ కేంద్రం వద్దకు వచ్చి నామపత్రాలు సమర్పించారు. కడప జిల్లా వేంపల్లిలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్సీపి శ్రేణులను విడాలమిట్ట కాలేజీ రోడ్డు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వైఎస్సార్సీపి శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెంలో నామినేషన్ వేసేందుకు వెళ్లనీయడం లేదంటూ పెద్ద సంఖ్యలో వైఎస్సార్సీపి శ్రేణులు ఆందోళన చేపట్టారు. రహదారిపై బైటాయించారు. నామినేషన్ కేంద్రం వద్ద గుంపులు గుంపులుగా వెళ్లడం నిషేధమని అభ్యర్థి తనతో పాటు మరో ఇద్దరినీ అనుమతిస్తామని పోలీసులు సర్దిచెప్పారు. నామపత్రాలు సమర్పించే అభ్యర్థులను క్యూ లైన్ ద్వారా ఒక్కొక్కరిని లోపలికి పంపించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంచంగిపుట్లు మండలంలో నామినేషన్లు కోలాహలంగా సాగింది. అనకాపల్లి జిల్లా రోలుగుంట, రావికమతం, మాకవరపాలెం, గొలుగొండ ప్రాంతాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు.

# రె'బెల్స్' ఉండొద్దు

>>సమతుల్యం చేస్తూ వివాదాలకు పరిష్కారం చూపడంపైనే తాజా చర్చల దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా అసంతృప్తులను బుజ్జగించి, రెబల్ అభ్యర్థుల పోటీని తగ్గించగలిగితేనే క్షేత్రస్థాయిలో కూటమి ఐక్యతకు మరింత బలం లభిస్తుందని సిఎం, డి.సిఎం అభిప్రాయపడినట్లు సమాచారం. పార్టీ శ్రేణుల ఆకాంక్షలు, స్థానిక రాజకీయ సమీకరణాలు, మిత్రపక్షాల మధ్య సమతుల్యత ఈ మూడింటినీ సమన్వయం చేయడంపైనే సీట్ల పంపకాల సక్సెస్ ఆధారపడి ఉందనే అంశంపై 40 నిమిషాల పాటు సాగిన భేటీలో ఇరువురు చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో 123 స్థానాలకు గాను జనసేనకు 24, బిజెపికి 9 స్థానాలు కేటాయించారు. ఎంపిటిసి, జడ్‌పిటిసిల్లోనూ జనసేనకు దాదాపు 30శాతం మేర సీట్లు కేటాయించాలని డి.సిఎం ఈ బేటీలో ప్రస్తావించినట్లు సమాచారం. అయితే మున్సిపాలిటీల్లో అనుసరించిన ఫార్ములానే ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లోనూ అనుసరిద్దామని సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్‌కు కల్యాణ్‌కు నచ్చచెప్పినట్లు సమాచారం. అవసరాన్ని బట్టి స్థానిక పరిస్థితులు, పార్టీల బలాబలాలను అనుసరించి సీట్ల పంపకాల్లో మార్పులు చేసే అంశం ఇద్దరి మధ్య ప్రస్తావనకు వచ్చిందంటున్నారు. పుర ఎన్నికల్లో జనసేనకు 20శాతం సీట్లు కేటాయించారు. అయితే జడ్‌పిటిసి, ఎంపిటిసిల్లో అదే రేషియోలో గాని, 25శాతం గాని కేటాయించే అవకాశంపై కీలక ప్రస్తావన జరిగిందంటున్నారు. కూటమి పక్షాల ఐక్యతకు దెబ్బ తగులకుండా ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేద్దామని సిఎం, డి.సిఎంలు నిర్ణయాని వచ్చినట్లు సమాచారం.

# అరాచకాలకు అడ్డుపడలేదు

>> నాయకులను హౌస్ అరెస్టులు చేస్తున్నారు. నామినేషన్ కేంద్రాలను స్వాధీనం చేసుకుని మా అభ్యర్థులను అడ్డుకున్నారు. చంద్రబాబుకు పోలీసు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. వాళ్లను బాధ్యతల నుంచి తప్పించకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎలా జరుగుతాయి?. పరిస్థితుల్లో మార్పులు ఎలా వస్తాయి? అంటూ వైఎస్ జగన్ నిలదీశారు. "పోలింగ్ కేంద్రాల రిగ్గింగ్ నుంచి నామినేషన్ కేంద్రాల రిగ్గింగ్‌కు దిగజారారు. చంద్రబాబు అండ్ గ్యాంగ్ ఆర్గనైజ్డ్ క్రైమ్‌కు తెరతీశారు. పోలీసుల సమక్షంలోనే నామినేషన్ పత్రాలను చించేశారు. అధికారులు దాడులు చేస్తున్నా అడ్డుకోలేదు. బాధిత అభ్యర్థులనే నామినేషన్ సెంటర్ నుంచి బయటకు పంపారు. టిడిపి మూకలు మాత్రం వందలమంది గుమిగూడుతున్నారు. దాడికి గురైన వైఎస్సార్‌సిపి నాయకులపైనే కేసులు పెట్టారు. ఇంటికే పరిమితం చేశారు.. లేదా జైళ్లకు పంపారు. వ్యవస్థలపై ప్రజలకు అసహ్యం పుట్టేలా చేస్తున్నారు. స్క్రూటినీ సమయంలో అభ్యర్థులను అడ్డుకున్నారు. అభ్యర్థి లేకుండానే సంతకం ఫోర్జరీ చేసి నామినేషన్లు విత్ డ్రా చేశారు.

నంద్యాల 51వ వార్డులో అభ్యర్థి నాగమణి సంతకం ఫోర్జరీ చేశారు. స్థానిక ఎన్నికల్లో తీవ్రమైన దాడులకు గురైంది మహిళలే. మహిళలు నామినేషన్లు వేయడానికి వస్తే జుట్టు పట్టుకున్నారు. మహిళల చీరలు లాగేసి. దాడులకు తెగబడ్డారు. చంద్రబాబు మనిషేనా?. చంద్రబాబు అండ్ గ్యాంగ్ ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించారు. గోరంట్లలో మంత్రి సవిత అనుచరులు ఎన్నికల అధికారుల గదిలోకి చొరబడ్డారు. అధికారు చేతుల్లో నామినేషన్ పత్రాలు లాక్కొని చించివేశారు. చిత్తూరు జిల్లాలో మాజీ డిప్యూటీ సిఎంపై దాడి చేశారు. నారాయణస్వామి కారును టిడిపి గూండాలు ధ్వంసం చేశారు. ధర్మవరంలో బోయ వాల్మీకి వర్గానికి మహిళపై దాడి చేశారు, వైఎస్సార్‌సిపి అభ్యర్థి నరేంద్ర చౌదరిపై ఆర్వో సమక్షంలో దాడి చేశారు. కడపలో ఎంపి అవినాష్‌రెడ్డిని అక్రమ అరెస్ట్ చేశారు. తీవ్రవాదిని అరెస్ట్ చేసినట్లు పోలీసుల అరెస్ట్ చేశారు.

రైల్వే కోడూరులో మహిళపై ఎమ్మెల్యే శ్రీధర్ అనుచరులు దాడి చేశారు. ఆడవాళ్లంటే కనీస గౌరవం లేదు.. మనుషులా రాక్షసులా?. అనుపల్లిలో వైఎస్సార్‌సిపి అభ్యర్థి సీఐ కాళ్లు పట్టి మరీ వేడుకుంది. మా హయాంలో ఒక్కటైనా ఇలాంటి ఘటన జరిగిందా? అని జగన్ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా ఎలాంటి మార్పులేదు అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపిని రావణ కాష్ఠంగా మార్చేలా అష్టకుట్రలు పన్నారంటూ చంద్రబాబు సర్కార్‌పై వైఎస్సార్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు.

# సిబిఐ ఎంట్రీ

>> కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఫైల్స్ సిబిఐకి సిట్ స్వాధీనం చేసింది. అవన్ని పరిశీలించిన తరువాత ఎఫ్ఐఆర్‌ను సిబిఐ నమోదు చేసింది. సాయికృష్ణ కేసు వివరాలను సిట్ అధికారులు సిబిఐకి సమర్పించారు. ఇకపై ఈ కేసులో సిబిఐ రంగంలోకి దిగనుంది. కేసు దర్యాప్తు మళ్లీ మొదటి నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు కేసుకు సంబంధించి సిట్ సేకరించిన ఆధారాలు, సాక్షుల స్టేట్‌మెంట్లు, రికార్డులు, నిందితుల రిమాండ్ రిపోర్టులను సిబిఐ అధికారులకు అందజేశారు. నేరం జరిగినట్లుగా తేల్చిన కృష్ణలంక పోలీస్‌స్టేషన్, పాత ఎన్‌హెచ్ ఏఐ భవనం, స్మశాన వాటిక ప్రాంతాలకు వెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయనున్నారు. ఈ కేసులో మొత్తం ఏడుగురిని సిట్ నిందితులుగా తేల్చి అరెస్ట్ చేసింది. వీరిలో కృష్ణలంక స్టేషన్ హోంగార్డు కోనేటి వెంకటరాజు బెయిల్‌పై విడుదలయ్యారు. మిగిలిన ఆరుగురు ప్రస్తుతం జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. వీరు కాకుండా కృష్ణలంక స్టేషన్‌కు చెందిన మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్లు సిట్ గుర్తించింది. వీరిని కూడా సిబిఐ నిందితులుగా చేర్చనున్నట్లు తెలిసింది. కృష్ణలంక స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా తిరిగి తాజాగా సిబిఐ కేసు కట్టనుంది.విచారణ బాధ్యత రెండో ఎజెఎం ఎఫ్‌సి కోర్టు నుంచి విజయవాడలోని సిబిఐ న్యాయస్థానానికిమారనుంది. నిందితులను కస్టడీకి తీసుకుని తిరిగి విచారించనున్నారు. మృతదేహం ఆనవాళ్లు ఇప్పటి వరకూ లభించలేదు. సిట్ స్వాధీనం చేసుకున్న ఎముకులు, లాఠీపై ఉన్న రక్తపు మరకలు సాయికృష్ణవేనా అనే కోణంలో సిబిఐ విచారణ చేపట్టింది.

# ఆత్మనిర్భరత దిశగా పౌరులు కదలాలి

>> చేయాలి. మన పౌరులలో ఆత్మనిర్భరత పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తిని నింపాలి. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరినీ అనుసంధానించాలి. ఈ లక్ష్యాల కోసం మనం మరింత చురుకుగా వ్యవహరించాల్లి అని ఆయన అన్నారు. యువశక్తిని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే బలమైన భారత్‌ను నిర్మించవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. భారతదేశం భారత సంస్కృతికి జన్మస్థలమని, దేశ ఉనికికి పునాది అని ప్రధాన మంత్రి అన్నారు. భారత ప్రాచీన నాగరికత వారసత్వం, శాశ్వత విలువలు దేశ అభివృద్ధి ప్రయాణానికి నిరంతరం స్ఫూర్తినివ్వాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభిప్రాయపడ్డారు. "చిన్మయ మిషన్ కృషి ఫలితంగా, నేడు లక్షలాది మంది యువత భారతదేశ సాంస్కృతిక బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేస్తున్నారు. ఈ యువత భారతీయ విలువలను కొత్త తరానికి అందిస్తున్నార్లు అని ఆయన అన్నారు.

**చిన్మయానంద ఆశీస్సులతోనే ప్రజాసేవ**

స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలను గుర్తుచేసుకున్న ప్రధానమంత్రి, ఆ సందర్భంగా దేశ నాగరికత స్ఫూర్తిని, మానవత్వం పట్ల మనకున్న చిరకాల ఆలోచన లను సజీవం చేయడంతో పాటు, 'వికసిత భారతం' (అభివృద్ధి చెందిన భారతం) అనే లక్ష్యానికి స్ఫూర్తినివ్వాలని తాను ఆకాంక్షించానని మోడీ చెప్పారు. 1993లో వడో దరలో స్వామి చిన్మయానందతో జరిగిన తన భేటీని కూడా మోడీ గుర్తుచేసుకున్నారు. ఆ ఆధ్యా త్మిక గురువుకు సంబంధించిన హోలో గ్రాఫిక్ ప్రొజెక్షన్‌ను చూసి, దానితో సంభా షించడం ద్వారా, గతంలో వారితో జరిపిన చర్చ లు, గురువుగారి ఆప్యాయత, ఆయన ఆశీస్సులు మళ్లీ గుర్తుకు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. "ఆధునిక సాంకేతికత ద్వారా అటువంటి అనుభూతిని తిరిగి సృష్టించినందుకు చిన్మయ మిషన్‌కు ధన్యవాదాలు. స్వామి చిన్మయానం దతో నా సంభాషణ ప్రధానంగా యువతలోని సామర్థ్యాన్ని వెలికితీసి, బలమైన, సమర్థవం తమైన భారతావనిని నిర్మించడంపైనే కేంద్రీకృ తమై ఉండేద్లి అని ఆయన చెప్పారు. "ఆయ నను కలిసిన కొన్నేళ్లకే, ప్రజలు నాకు గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారు. అప్పటినుండి గత 25యేళ్లుగా, ప్రభుత్వ అధినేతగా నా శక్తి మేరకు దేశానికి నిరంతరం సేవ చేస్తున్నాను. ఈ ప్రయాణంలో గురుదేవుల ఆశీస్సులు నాకు తోడుగా ఉన్నాయ్లి అని ఆయన తెలిపారు. ఈ సదస్సు ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతి అని పేర్కొన్న మోడీ, సాధుసంతుల ఆశీస్సు లకు కృతజ్ఞతలు తెలిపారు. "ఇదొక భిన్నమైన ఆధ్యాత్మిక అనుభవం. ఇది మన సాధుసంతుల నుండి నాకు లభించిన ఆశీర్వాదం. చిన్మయ మిషన్ అనేది కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు,

ఇది 'చిన్మయ విచార్ల (చిన్మయ ఆలోచనా విధానం)కు ప్రతిరూపమ్లి అని ఆయన అన్నారు.మూడురోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్ర మంలో దేశ, విదేశాల నుంచి 9,000 మందికి పైగా పాల్గొంటున్నారు. వేదాంత, భగవద్గీత జ్ఞానాన్ని అందరికీ అందు బాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో 1951లో స్వామి చిన్మయానంద స్థాపించిన ప్రపంచ ఆధ్యాత్మిక ఉద్యమం అయిన చిన్మయ మిషన్ 75 యేళ్లుపూర్తి చేసుకున్న సందర్భంగా ఏడాది పొడవునా జరిగిన వేడుకలకు ఈ కార్యక్రమ



శుక్రవారం కొయ్యూరులో జడ్‌పిటిసి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న గొడ్డేటి మాధవి

# రేపటి నుంచి ఓటర్ల గుర్తింపు

>> ఎస్టీ, బిసి, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం వార్డులవారీగా ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన ఓటర్ల వివరాలను సేకరించనున్నారు. ఈ వివరాల ఆధారంగా ముసాయిదా జాబితాలను రూపొందించి, అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది జాబితాలను ప్రకటించనున్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 25, 26 తేదీల్లో వార్డులవారీగా ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళా ఓటర్లను గుర్తించి అవసరమైన వివరాలను నమోదు చేస్తారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల వివరాలను సేకరించనున్నారు. రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన సమాచారాన్ని నిర్ణీత గడువులో సేకరించడం ఈ ప్రక్రియలో కీలకం కానుంది. సర్వే ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురిస్తారు. ఈ జాబితాల్లో నమోదైన వివరాలను పరిశీలించేందుకు ప్రజలకు అవకాశం కల్పించనున్నారు. ఓటర్ల గుర్తింపులో ఏవైనా పొరపాట్లు ఉన్నా, అర్హులైన వారి వివరాలు నమోదు కాకపోయినా సంబంధిత అభ్యంతరాలను తెలియజేయవచ్చు. అక్టోబరు 28న ఓటర్ల గుర్తింపునకు సంబంధించి క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తారు. ముసాయిదా జాబితాల్లోని వివరాలపై అభ్యంతరాలు ఉన్నవారు నిర్ణీత విధానంలో తమ అభ్యర్థనలు సమర్పించవచ్చు. అందిన అభ్యంతరాలను అధికారులు పరిశీలించి తదుపరి చర్యలు చేపడతారు. ఈ షెడ్యూల్ శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి-తాడేపల్లి, ఆమదాలవలస, రాజాం, భీమవరం, తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, చింతలపూడి, తాడిగడప, గుడివాడ, పొన్నూరు, బాపట్ల, నరసరావుపేట, కందుకూరు, పొదిలి, అల్లూరు, గూడూరు (నెల్లూరు), కావలి, శ్రీకాళహస్తి, బి. కొత్తకోట పట్టణ స్థానిక సంస్థలకు వర్తించనుంది.

# నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త** ప్రతినిధి: రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఢిల్లీలో పర్యటించనున్నారు. దేశ రాజధానిలోని జన్‌పథ్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన షెడ్యూల్‌కు సంబంధించి సిఎంఒ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఇప్పటికైనా మోడీ నిజాలు వెల్లడించాలి

## అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా సైన్యంతో ఘర్షణలపై ప్రధాని మౌనం ఎందుకు: ఖర్గే

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** అరుణాచల్ ప్రదేశ్లో చైనా సైన్యంతో కొనసాగుతున్న ఘర్షణలపై ప్రధాని మోడీ, కేంద్రం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ముఖ్యంగా భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్లు ఇచ్చేశారని, ఇకనైనా ప్రధానమంత్రి మోడీ దేశం ముందుకు వచ్చి అసలు వాస్తవాలు ఏంటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని మోడీకి ప్రశ్నలు సంధించారు. అరుణాచల్లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఐటిబిపి డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ చేసిన వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. కనీసం 23 సార్లు మోదీ జిన్‌పింగ్ మధ్య సమావేశాలు, సంభాషణలు జరిగాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబల్ 25 ప్రత్యేక ప్రతినిధుల పర్యటనలు చేశారు.

# గీత దాటితే ఉపేక్షించం

>> సైకిళ్లు సహా నాలుగు వాహనాలకు నిప్పు పెట్టారు. రాళ్లు, కర్రలతో దాడులు, ఒకచోట జెసిబితో ఇంటిని కూల్చివేయడం, గాల్లోకి కాల్పులు జరపడం వంటి ఘటనలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఓ అభ్యర్థిని తరలిస్తున్న పోలీసు వాహనంపై జరిగిన రాళ్లదాడిలో కానిస్టేబుల్‌కు తలకు తీవ్రగాయమైంది. ఒక అభ్యర్థితో సహా మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేసి, 54 మంది నిందితులను గుర్తించినట్లు డిజిపి తెలిపారు. నిందితులు టిడిపి, వైసిపి, సిపిఎం, స్వతంత్రులుగా ఉన్నారని, పార్టీలతో సంబంధం లేకుండా అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను వెంటనే నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని, సున్నితమైన కేంద్రాల్లో అదనపు బలగాలను మోహరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఎలాంటి బెదిరింపులు లేదా హింసకు గురైనా వెంటనే డయల్ 100 లేదా 112కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

# ఎపికి తుఫాను ముప్పు

>> వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. శని, ఆదివారాలలో రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. తీరం వెంబడి వాతావరణం అల్లకల్లోలంగా మారనుంది. గంటకు 60నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తమైంది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నందున సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని తెలిపింది. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. వాతావరణం కుదుట పడే వరకు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు.

## వారం - వర్జ్యం

24-10-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, స్వాతి కార్తె
తి. త్రయోదశి మ.1.32
న. ఉత్తరాషాఢ రా.8.27
వ.ఉ.6.21-ఉ.7.55
దు. ఉ.6.02-ఉ.7.37
రాహు ఉ.9.00-ఉ.10.30
శుభ ఉ.9.00-ఉ.10.00

## వార్తాఫలం

**మేషం :** దీర్ఘకాలిక సమస్యలు ఎదురై చిరాకు పెడతాయి. వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులు ఉంటాయి.

**వృషభం :** సన్నిహితుల సహకారంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సమస్యల నుండి బయట పడతారు.

**మిథునం :** సంగీతం, సాహిత్యం, కళారంగాలలోని వారికి అన్ని విధాల అనుకూలం. బాధ్యతలు, బరువులు అధికమవుతాయి.

**కర్కాటకం :** ఆత్మస్థైర్యంతో సమస్యలతో సమరం సాగిస్తారు. ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఏమీ ఉండవు.

**సింహం :** ఆరోగ్య సమస్యలు ఎదురై చిరాకు పెడతాయి. కోర్ట్ వ్యవహారాలలో జాప్యం జరుగుతుంది. స్థాన చలనం ఉంటుంది.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురవడం మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తుంది. పుణ్యక్షేత్రాల సందర్శన.

**తుల :** కీలకమైన ఆర్థిక విషయాలను వాయిదా వేస్తారు. జీవితభాగస్వామితో వివాదాలు తలనొప్పిగా మారతాయి.

**వృశ్చికం :** ఫలితాన్ని ఆశించకుండ కృషి చేసి మంచి ఫలితాలు సాధిస్తారు. చేపట్టిన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.

**ధనుస్సు :** పథకాలలో వైఫల్యం చెందుతారు. ధర్మ మార్గంలో పయనిస్తారనే ఖ్యాతి పొందుతారు. సోదరుల నుండి ధన లాభం.

**మకరం :** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పూర్వ మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**కుంభం :** సోదరుల నుండి సహాయసహకారాలు అందుతాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

**మీనం :** సంతాన విద్యావిషయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగాల పరంగా సాధారణంగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

వార్త

మంచి మాటయే గొప్ప అలంకారం. ఆభరణాలన్నీ నశిస్తాయి కాని, వాక్కు అనే ఆభరణం ఎన్నటికీ నశించదు.

న- భర్తృహరి

# దాతృత్వానికి అగ్రతాంబూలం!

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తోంది. దానివలన కలిగే కష్టనష్టాలను గురించి ఎన్నో హెచ్చరికలూ ఉన్నాయి. కృత్రిమ మేధ చాట్‌బాట్‌లు తన సొంతానికి ఆలోచించుకోవడం మొదలెడితే భూగోళం అధోగతి పాలవుతుందని అందరూ ఎఐ భవిష్యత్‌ను అంచనా వేస్తూనే ఉన్నారు. భారతీయ సంప్రదాయమంటేనే ఆడవాళ్లను గౌరవించేదిగా ప్రతీక. అలాంటి అతివలనుసైతం కృత్రిమ మేధతో రూపొందించిన రోబోలు టీజ్ చేస్తున్నాయనే సమాచారం ఆందోళన పరుస్తోంది. రేపెప్పుడో ఎవరేనా పురిగొల్పితే 'హత్యలు' చేసే స్థాయికి రోబోలు తెగించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎఐ ఈ భూమ్మీద బతికి బట్టకట్టిన తొలినాళ్లలోనే జెమిని చాట్‌బాట్ వింత సమాధానమివ్వడాన్ని బట్టి జనం వామ్మో! అనుకున్నారు. ఆ సమాధాన సారాంశాన్ని గమనిస్తే 'మీరు సమాజానికి భారం చనిపోండి' అంటూ దిమ్మతిరిగే సమాధానమిచ్చింది. 'సమయం, వనరులను వృధా చేస్తున్న మీరు ఉంటే నేం.. పోతేనేం' అనే ధోరణిలో ఓ విద్యార్థి హోమ్ వర్క్‌కు సంబంధించిన ప్రశ్నకు జవాబుగా అందించినస్పందన ఇది. ఇది ఆరంభంలో... మరి ఇప్పుడు చాట్‌బాట్ ప్రక్రియ ముదిరిపోయింది. మానవ సంబంధిత ఫీడింగ్‌ఉన్నా లేకున్నా మొహం మీదనే కుండబద్దలు కొట్టినట్లు వచ్చే సమాధానాలను మానవుల్లో ఆందోళన కలిగించవచ్చు. ఈ నేపథ్యంలోనే 'కృత్రిమ మేధ' పట్ల ఆందోళన మొదలైంది. ఈ సందర్భంగా వాటికి 'రూపకర్తలైన' ఆంత్రోపిక్, స్పేస్‌ఎక్స్' వేదికలు రాబోయేతరానికి 'కృత్రిమమేధ' వలన వచ్చే కష్టనష్టాలను ఎదుర్కొనేందుకు కొంతమేరకు నిధులు సమకూర్చడం సరైన నిర్ణయమే. ఎలాన్ మస్క్ తన ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా వచ్చే ఏడాది అమెరికాలోని ప్రతి చిన్నారికి ఎక్స్ కంపెనీకి చెందిన ఒక్కో షేరును బహుమతిగా ఇస్తానని చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. ఒక్కో షేరు విలువ సుమారు 146 డాలర్లు ఉండగా, అమెరికాలో ఉన్న దాదాపు 7.3 కోట్ల మంది పిల్లలకు వీటినిపంపిణీ చేయాలంటే దీని మొత్తం విలువ 10.8 బిలియన్‌డాలర్ల పైమాటే (సుమారు రూ. 87 వేల కోట్లు). ఇది చాలా సృజనాత్మకమైన, ప్రోత్సాహకరమైన ఆలోచన. తొలుత ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలెజెన్స్ సంస్థ ఆంత్రోపిక్ తమ షేర్లలో/ఈక్విటీలో 5శాతం పబ్లిక్ బెనిఫిట్ ఫండ్‌కు కేటాయించనున్నట్లు ప్రకటించింది. ఇది నేరుగా వచ్చే లాభాల డిస్ట్రిబ్యూషన్ కాకుండా, కంపెనీ షేర్లను పబ్లిక్ ఫండ్‌కు కేటాయించడం ద్వారా అందించే సహాయం. కృత్రిమ మేధ వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ , సమాజంపై గణనీయమైన ప్రభావం పడుతుంది. ఈ సాంకేతిక మార్పుల వల్ల ప్రభావితమయ్యే ప్రజలకు లేదా వర్గాలకు మద్దతుగా నిలవడానికి ఈ ఫండ్‌ను ఉపయోగిస్తారు. కంపెనీ ఎదుగుదలతో పాటు ప్రజాప్రయోజనాలు పెరగడం, సాధారణంగా ఇచ్చే విరాళాల కంటే, కంపెనీ ఈక్విటీని షేర్లను కేటాయించడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. వాల్యుయేషన్ పెరిగే కొద్దీ సహాయం పెరుగుతుంది. ఆంత్రోపిక్ విలువ పెరిగేకొద్దీ, ఈ 5శాతం షేర్లవిలువ కూడా పెరుగుతుంది. భవిష్యత్తులో కంపెనీ విలువపెరిగే ప్రతిసారీ బోర్డు నిర్ణయంతో మరిన్ని షేర్లు ఈ ఫండ్‌కు చేరే అవకాశం ఉంది. లాభాపేక్ష లేని సంస్థలకు పెద్ద ఎత్తున విరాళాలు ఇవ్వడంతో పాటు, అవసరమైన నిర్దిష్ట వర్గాల ప్రజానీకానికి నేరుగా ఆర్థిక సహాయం అందించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఎలాన్ మస్క్ ప్రకటించే దానధర్మాలు, విరాళాల వెనుక ప్రజాక్షేమంతో పాటు తీవ్రమైన రాజకీయ, వ్యాపార ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయి. ఎలాన్ మస్క్ ఇటీవల రిపబ్లికన్ పార్టీ, ట్రంప్ రాజకియ ప్రచార సమూహాలకు ,రాబోయే ఎన్నికలకు వందల మిలియన్ డాలర్ల నిధులను అందించారు. మస్క్ వ్యాపారాలైన టెస్లా, స్పేస్ ఎక్స్, శ్రీ ట్విట్టర్, కృత్రిమ మేధ వంటివి ప్రభుత్వ నిబంధనలపై ఆధారపడి ఉంటాయి. ట్రంప్‌కు అనుకూలంగా నిలవడం వల్ల, కృత్రిమ మేధ పరిశ్రమపై ఉండే ప్రభుత్వ నియంత్రణలను తగ్గించడం, తన కంపెనీలకు ఉపయోగపడే విధానాలను పొందడం ఆయన ప్రధాన లక్ష్యం. మస్క్ ఇచ్చేవిరాళాలు చారిటీ ఫౌండేషన్ల ద్వారా వెళ్లడంవల్ల పన్ను మినహా యింపులు లభిస్తాయి, దీని ద్వారా తన పన్ను భారాన్ని తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది. కృత్రిమ మేధ వల్ల మానవాళికి వచ్చే ప్రమాదాలను తగ్గించడం, కృత్రిమ మేధ సేఫ్టీ రీసెర్చ్ ద్వారా సామాన్య ప్రజలకు రక్షణ కల్పించడం వీరి లక్ష్యం. ప్రస్తుతం కనిపిస్తున్న ఈ దాన ధర్మాల ప్రకటనలు కేవలం 'సామాజిక సేవ' మాత్రమే కావు. ఎలాన్ మస్క్ విషయానికి వస్తే ఇది స్పష్టంగా ట్రంప్, రిపబ్లికన్ పార్టీ రాజకీయ ప్రయోజనాలకు, వ్యాపా ర శ్రేయస్సుకు అనుకూలమైన వ్యూహం. యాంత్రోపిక్ విషయంలో ఇది సాంకేతికతను సురక్షితం చేయడం, ప్రభుత్వం ద్వారా రాబోయే కృత్రిమమేధ నిబంధన లలో తమ ఉనికిని కాపాడుకోవడం కోసం వేసినఅడుగు. కృత్రిమ మేధ వల్ల సమాజంపై పడే ప్రతికూల ప్రభావా లను తగ్గించి, ద్వారా వచ్చే సంపదను ప్రజా సంక్షేమా నికి ఉపయోగించడం. యాంత్రోపిక్ ఫౌండర్లు తమ వాటాలో 80శాతం దానం చేస్తామని ఇప్పటికే ప్రకటిం చగా, కొత్త నిధితో కలిపి కంపెనీలో దాదాపు 20 శాతం వాటా ప్రజా ప్రయోజనాలకే దక్కినట్లవుతుంది. వీరి దాతృత్వ ప్రకటనలు సాంకేతిక విప్లవం వల్ల ప్రజా సమస్యలు రాకుండా చూడాలనే ఉద్దేశంతో పాటు, వ్యాపార రీత్యా ప్రజల్లో సానుకూల దృష్టిని ఏర్పరచుకోవడానికి కూడా దోహదపడతాయి. అయితే అంతిమ



మాటలతో నీ శక్తిని వ్యర్థం చేయక, కార్యరూపంలో సాధించి చూపెట్టు.

స్వామి వివేకానంద



మనకు నచ్చిన రీతిలో మనం జీవించవచ్చు. కానీ విధిగా మరణించవలసిందే.

షేక్స్పియర్

## ప్రజావాక్కు



### సాంకేతిక నియంత్రణే పరిష్కారం కాదు

పిల్లల జీవితంలో ఇంటర్నెట్ ఇప్పుడు చదువు, విజ్ఞానం, వినోదంలో కీలక భాగమైంది. అయితే దాని వినియోగం నియంత్రణ లేకుండాసాగితే వారిచదువు, నిద్ర, ఏకాగ్రత, రోజువారీ అలవాట్లపై ప్రభావం పడే అవకాశం ఉంది. అందుకే పిల్లల ఇంటర్నెట్ వినియోగాన్ని కేవలం నిషేధించడం కాకుండా సాంకేతిక నియంత్రణ, తల్లిదండ్రుల పర్యవేక్షణ, డిజిటల్ అవగాహన అనే మూడు మార్గాల్లో నిర్వహించాలి. పేరెంటల్ కంట్రోల్స్, చైల్డ్‌లాక్ వంటి సదుపాయాలతో పిల్లల వయసు, పరిపక్వతకు అనుగుణంగా డిజిటల్‌హద్దులు నిర్ణయించవచ్చు. రోజువారీస్క్రీన్ టైమ్‌కు పరిమితులు విధించడం, చదువుకునే సమయంలో లేదా నిద్రవేళలో పరికరాల వినియోగాన్ని తగ్గించడం మంచి అలవాట్లకు పునాది వేస్తుంది. సాంకేతిక నియంత్రణలే సం పూర్ణ పరిష్కారం కావు. పిల్లల చేతిలో ఫోన్ పెట్టడం సులభం. ఆ ఫోన్‌ను బాధ్యతగా ఉపయోగించే వివేకాన్ని వారి మనసులో నాటడమే అసలైన సవాలు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### దోషులు ఎన్నికల్లో పోటీ చేయరాదు

బిజెపి సానుభూతి పరునిగా గుర్తింపు పొందిన బబ్లూ రాయ్ అనే వ్యక్తిని ఓ హత్య కేసులో దోషిగా నిర్ధారిస్తూ వారణాసి కోర్టు 2025లో జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆయన అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు కల్పిస్తూ దోషికి పడ్డ శిక్షను హైకోర్టు నిలిపివేసింది. ఇది న్యాయ సూత్రాల ప్రకారం ఆమోదయోగ్యమా? హైకోర్టుతదుపరి విచారణజరిపి నిర్దోషిఅనినిరూపణ అయితే పోటీకి అప్పుడు అర్హత కలుగజేయాలి. ఆయనకు ప్రస్తుతం శిక్షపడింది. అందుచేత పోటీకి దూరంగా ఉండాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### హామీలు నెరవేర్చని ప్రభుత్వాలు

ఎన్నికలలో గాని, తరువాత పరిపాలనా సమయంలోగాని రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు అవసరార్థంకొన్ని హామీలు చేసి పబ్బం గడచిన తరువాత వాటిని విస్మరించడమో, మరచిపోవడమో లేకఫలానా అడ్డంకులు ఇబ్బందులు దాపురించాయనిహామీలను దాటవేస్తుంటారు. ఉదహరణకు విదేశీ బ్యాంకుల్లో ఉన్న అవినీతి ధనాన్ని ప్రజలందరికు 15 లక్షలు చొప్పున పంచుతామన్నారు. పేరుకే ప్రజలది రాజ్యం, కాని పెత్తందారులుదే భోజ్యం.

- డా. ఎన్. ఎస్. ఆర్ మూర్తి, సికింద్రాబాద్

### ఇంటి భద్రత - మన బాధ్యత

విదేశాల్లో నివసిస్తున్న పిల్లలు, స్వదేశంలో ఉంటున్న తమ తల్లిదండ్రులకు ఇంటి పనుల్లో సహాయంగా ఉంటారని పనివాళ్లనునియమిస్తున్నారు. అయితేఇటీవల కొందరు పనివాళ్లుగా ఇంట్లోకి వచ్చి, నమ్మకంగా ఉంటూ సమయం చూసి నగలు, డబ్బుతో ఉడాయిస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంట్లో పెద్దవాళ్లు మాత్రమే ఉన్నప్పుడు ఇలాంటి ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పనివాళ్లను నియమించుకునే ముందు వారి పూర్తి వివరాలు, గుర్తింపు కార్డు, చిరునామా తెలుసుకోవాలి. వీలైతే గతంలో ఎక్కడ పనిచేశారో విచారించాలి. ఇంట్లోని నగలు, డబ్బు, విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలి. ఇంటి ప్రధాన ద్వారం, అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, అవి సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో గమనించాలి. విదేశాల్లో ఉన్న పిల్లలు కూడా తమ తల్లిదండ్రులతో తరచుగా మాట్లాడుతూ వారి క్షేమాన్నితెలుసుకుంటూ ఉండాలి. తల్లిదండ్రులకు ఇంటి పనుల్లోసహాయంగా పనివాళ్లను ఏర్పాటుచేయడం మంచిదే.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### అనుమతి లేని కళాశాలలు

తెలంగాణలో ప్రైవేట్ జూనియర్ కళాశాలల యజమాన్యాల ఆగడాలు రోజురోజుకుమితిమీరిపోతున్నాయి. ఇంటర్మీడియట్ విద్య బోర్డు నిబంధనలను తుంగలో తొక్కి, విద్యార్థుల తల్లి దండ్రులను మోసగించేందుకు కొద్ది కాలంగా కొత్త దారులు తొక్కుతున్నాయి. ఒకపేరుతో అనుమతి తీసుకుని, క్షేత్రస్థాయిలో మరో పేరుతో బోర్డును, విద్యార్థులను బోల్తా కొట్టిస్తున్నా ఇంటర్ విద్యాశాఖ అధికారుల నుంచి మాత్రం కఠిన చర్యలు కరువయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అనేక ప్రైవేట్ జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. బోర్డు అనుమతి ఒకరి పేరుపై, బోర్డుపై మరో పేరు పేరుతో నడుస్తున్నాయి. వాటిపై తగువిధంగా చర్యలు తీసుకోవాలి.

- పొద్దుటూరి జగదీశ్వర్, హైదరాబాద్

### హక్కులను ఉపయోగించుకోవాలి

మానవ జీవితంలో మనకు ఉన్న రాజ్యాంగ కల్పించిన హక్కులను అన్ని ఉపయోగించుకోవాలి. ఎవరిని కూడా హక్కుల కొరకు బ్రతిమిలాడడం, బానిస చేయడం అవసరం లేదు. నీ హక్కులను నువ్వు నిరంతరం పొందే అవకాశంఉంది. నీ హక్కుల కొరకు ఇతరులు పోరాటం చేయరు. నీకు రావాల్సిన ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అవినీతి నియంత్రణ మాటల్లోనేనా?

**కొందరు రాజకీయ నాయకులు, మరికొందరు అవినీతి అధికారులకు రక్షకులుగా నిలబడుతున్నారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతి రాకపోవడం, వచ్చినా ఏళ్లతరబడి జాప్యం జరగడం, విచారణపై కూడా ప్రభావం చూపుతున్నది. అసలు ఎన్ని కేసుల్లో శిక్షలుపడుతున్నాయి? అనుమతులు రాకపోవడం వెనుక ఉన్నకారణాలు పరిశీలిస్తే విస్తుపోయే విషయాలు వెలుగుచూస్తాయి. ఎసిబి కేసుల నుంచి బయటపడ డమేకాదు కొందరు దర్జాగా ప్రమోషన్లు పొందుతున్నారు. ఈ దాడులు కానీ, చట్టాలు కానీ ఏమీ చేయలేవని అవినీతి అధికారుల్లో విశ్వాసం పెరుగుతున్నది. ఇదే అవినీతి విస్తరించడానికి ప్రధాన కారణమవుతున్నది. దీనికి రాజకీయ అవినీతి తోడవుతున్నది. ఉన్నతస్థాయిలో అవినీతిని నియంత్రించకుండా కిందిస్థాయిలో దాడులు చేయడంవల్ల పెద్దప్రయోజనాలు కన్పించడం లేదు.**

దామెర్ల సాయిబాబ

'పసరంబు పంజైన పసులకాపరి తప్పు, ప్రజలు దుర్జనులైన ప్రభువుల తప్పు, భార్య గయ్యాలి అయిన ప్రాణనాధుని తప్పు, తనయుడు దుష్టుడైన తండ్రి తప్పు, కూతురు చెడిన మాత తప్పు, సైన్యంబు చెదిరిన సైన్యనాధుని తప్పు.. అంటూ ఎవరి తప్పుకు ఎవరు బాధ్యులో ఏనాడో ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి శతకంలోశేషప్ప కవి వివరించారు. దేశంలో అవినీతి, అక్రమాలు, ఆశ్రితపక్షపాతాలు పెరిగిపోతున్నాయని, అందరూ ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉంటారు. ఈ వ్యవస్థలు ఇలా దిగజారిపోవడానికి ఎవరు బాధ్యులో తెలియనివారు లేరు. పాలకులు అభివృద్ధి పేరుతో ఎన్ని లక్షల కోట్లు అప్పు తెస్తున్నారో అదేస్థాయిలో అవినీతి విజృంభిస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఒకటేమిటి ఎక్కడ అప్పుదొరుకుతుందో దుర్భిణి పెట్టి వెతికి అక్కడికివెళ్లి రకరకాల విన్యాసాలు చేసి వారిని ఒప్పించి, మెప్పించి అప్పులు తెచ్చుకుంటున్నారు. అప్పులు తేవడమే గొప్పగా చెప్పుకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. ఇప్పటికిప్పుడు ఈ సంప్రదాయం ఆరంభం కాకపోయినా గత రెండు, మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్నా రానురాను పెరిగిపోతున్నది. నిర్మాణాత్మకమైన అభివృద్ధికి అప్పులు అవసరమే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. అవి ఎలాతీర్చాలో నిర్దిష్టమైన ప్రణాళిక, పథకాలు ఉండాలి. వేలాది రూపాయలు ఏటా వడ్డీ రూపేణా ఇప్పటికే చెల్లిస్తున్నారు. ప్రభుత్వ భూములు అమ్ముకొంటున్నారు. ఇటు పన్నులు రూపేణా ప్రజల ముక్కు పిండి వసూల్ చేస్తున్న డబ్బు, అటు అప్పులు తెస్తున్న వేలాది కోట్ల రూపాయలు అవినీతి, అక్రమార్కుల పాలుకాకుండా చూడాల్సిన గురుతర బాధ్యత పాలకులపైఉంది. ఇకఅప్పులు పెరిగి ఆదాయం తగ్గితే పరిస్థితి ఎలాఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పొరుగునున్న శ్రీలంకనుచూశాం. ఇప్పటికీ ఆ దేశం కోలుకోలేకపోతున్నది. అభివృద్ధి, అవినీతి రెండూ కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు నడుస్తుంటే అవినీతి తూట్లు పొడుస్తూ వెనక్కి గుంజుతుంటుంది. రానురాను మృగ్యమైపోతున్న మానవతా విలువల పట్లనిజాయితీ అధికారుల ఆవేదన మౌనరోదనగా మిగిలిపోతున్నది. అంతో ఇంతో నిజాయితీతో జీవనం సాగిస్తున్న అధికారులను అసమర్థులుగా పరిగణించే పరిస్థితులు దాపురించాయి. ఎలుకలను చూసి పిల్లి తప్పుకున్నట్లుగా అవినీతి పరుల ముందు నీతివంతులు తలవంచుకునే నికృష్టపు రోజులు వచ్చాయి. మరొకపక్క రాష్ట్రాల పరిధుల్లో ఎసిబి కానీ, కేంద్రస్థాయిలో సిబిఐ విజిలెన్స్ కొత్తగా ఏర్పడ్డ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర విభాగాలు రాజకీయ ఒత్తిడిల నుంచి బయటపడలేకపోతున్నాయి. అన్నింటి కంటే మించి రాజకీయ అవినీతి శృతిమించిపోతున్నది. ఆవు చేలోమేస్తే దూడగట్టుపైమేస్తుందా అన్నట్లు కొందరు రాజకీయనాయకుల అవినీతి అధికారులకు మార్గాన్ని చూపెడు తున్నది. అధికారుల్లో ఉన్న అవినీతి

ఒక ఎత్తైతే కీలక పదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరి కొందరు రాజకీయ నాయకులు, దళారులవల్లనే పరిస్థితి అదుపుతప్పుతున్నదేమో ననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారంధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులుసైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు భారత్ ఎన్నిలక్షల కోట్ల రూపాయలు కోల్పోయిందో అంచనాలకే అందదు. అవినీతిని అంతం చేయాల్సిన కీలకపదవుల్లో ఉన్న కొందరు రాజకీయ నాయకులే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయటపడ్డాయి. పశ్చిమబెంగాల్‌లో మాజీ

## ఒక్క మాట

మంత్రి ఒకరు ఉపాధ్యాయ నియామకం కుంభకోణంలో కోట్లాది రూపాయలు దిగమింగి తన ఆప్తమిత్రురాలి ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా దాచిన వైనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్ట రేట్ రట్టు చేసింది. ఆ మధ్య కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రే తన చావుకు కారణమని తనను ఏ రకంగా డబ్బు కొరకు వేధించారో వివరిస్తూ ఒక యువ గుత్తేదారు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో విధిలేని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇక సబ్బుల తయారీకి అవసరమైన ముడిసరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికి లంచం ముట్టచెప్పాల్సిందేనని గుత్తేదారుకు ఆ ప్రాంత శాసనసభ్యుడు తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగా నలభైలక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఇక సాక్షాత్తు ఒక హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్లకట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగం కల్పించిన రక్షణ వల్ల ఆయనపై ఎఫ్ఐఆర్ కూడా వెంటనే నమోదు చేయలేని నిస్సహాయక పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?ఎందుకోసం ఎవరు ఇచ్చారు? తదితర ప్రశ్నలకు జవాబులేకుండా పోయింది. ఇటీవలఒడిశాలో సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టు బడ్డాడు. ఆయన ఇంట్లో సోదా చేసి నలభైలక్షలకుపైగా నగదును అధికారులు కనుగొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది ఉన్నతాధికారులపై గతంలోనూ, ఇప్పుడు కూడా అవినీతి ఆరోపణలు తరచుగా వినిపిస్తూనే ఉన్నాయి. ఎసిబి దర్యాప్తుచేసి చర్యలకు సిద్ధమైనా ప్రభుత్వం అనుమతించక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. ఇప్పుడేకాదు గతం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉన్నది. రానురానూ ఆ విషసంస్కృతి పెరిగిపోతున్నది. లక్షలాది రూపాయలు లంచం తీసుకొంటూ పట్టుబడడమేకాదు కోట్లాది రూపాయలు ఆదాయానికి మించిన ఆస్తులు బయటపడిన కేసుల్లో కూడా కనీసం ఆ లంచావతారులపై ప్రాసిక్యూషన్ చేయడానికి సంబంధిత ఉన్నతాధికారుల నుండి అనుమతి రాకపోవడం, మరికొన్ని కేసుల్లో తామే శాఖాపరమైన చర్యలుతీసుకోనున్నట్లు తప్పని పరిస్థితుల్లో ఆయా విభాగాల నుండి లేఖలు రావడంతో కేసులు మూత పడుతున్నాయి. అందుకే ఏసిబి అధికారులంటే గతంలో ఉన్న భయభక్తులు నేడు కానరావడంలేదు. ఇలా పట్టుబడి, అరెస్టు అయ్యి జైలుకు వెళ్లి తిరిగొచ్చిన వారు తిరిగి ఉద్యోగాల్లో చేరిపోతున్నారు. తామెంత కష్టపడి ఒకవ్యూహం ప్రకారం వలపన్ని రెడ్‌హాండెడ్‌గా పట్టుకొని, కోట్లాదిరూపాయలు సీజ్‌చేసి పెద్దఎత్తున ప్రచార మాధ్యమాల్లో ప్రచారం జరిగిన తరువాత ప్రాసిక్యూషన్‌కు అనుమతి రాకపోవడంతో కేసులు ఫైల్స్‌కే పరిమితమై క్రమేణా మూతపడిపోవడం దర్యాప్తు అధికారుల్లో నిరుత్సాం కల్గిస్తున్నది. ఎన్నో వందలాది కేసులు అనుమతికోసం పెండింగ్‌లో పడి మూతపడుతున్నాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్‌కమిషనర్ రాంచంద్రన్ సమాల్‌పై ఏకంగా విలేకరుల సమావేశం పెట్టి వెల్లడించిన విషయాలు అందుకు అద్దంపడుతున్నాయి. అప్పుడే కాదు నేటికీ కొందరు సీనియర్ రాజకీయ నాయకులు, మరికొందరు ఉన్నతాధికారులు అవినీతి ఆరోపణల్లో మునిగి తేలుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు, మరికొందరు అవినీతి అధికారులకు రక్షకులుగా నిలబడుతున్నారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతి రాకపోవడం, వచ్చినా ఏళ్లతరబడి జాప్యం జరగడం, విచారణపై కూడా ప్రభావంచూపుతున్నది. అసలు ఎన్ని కేసుల్లో శిక్షలుపడుతున్నాయి? అనుమతులు రాకపోవడం వెనుక ఉన్న కారణాలు పరిశీలిస్తే విస్తుపోయే విషయాలు వెలుగుచూస్తాయి. ఎసిబి కేసుల నుంచి బయటపడడమేకాదు కొందరు దర్జాగా ప్రమోషన్లుపొందుతున్నారు. ఈ దాడులు కానీ, చట్టాలు కానీ ఏమీ చేయలేవని అవినీతి అధికారుల్లో విశ్వాసం పెరుగుతున్నది. ఇదే అవినీతి విస్తరించడానికి ప్రధాన కారణమవుతున్నది. దీనికి రాజకీయఅవినీతి తోడవుతున్నది. ఉన్నతస్థాయిలో అవినీతిని నియంత్రించకుండా కిందిస్థాయిలో దాడులు చేయడంవల్ల పెద్దప్రయోజనాలు కన్పించడంలేదు. గతంలో రాజకీయ అవినీతిని నిరోధించేందుకు వెనుకాడబోమమనే సంకేతాలు ఇచ్చేందుకు ఒకముఖ్యమంత్రి తన కేబినెట్‌లోని ఒక మంత్రికే లంచం ఇప్పించి, పట్టించి ఇంటికిపంపారు. అప్పట్లో అది సంచలనం సృష్టించింది. ఏదిఏమైనా అవినీతిని నియంత్రించకుండా ఆశించిమేరకు అభివృద్ధి సాధించడం అసాధ్యం. కానీ అవినీతిని కూకటివేళ్లతో పెకలించి వేయడం అంతసులభంకాదు. దానికి ఎంతోధైర్యం, త్రికరణశుద్ధి వీటన్నిటిని మించి రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోగలిగిన గుండె కావాలి. ●

# పిల్లలకు ఆస్తులు కాదు అవకాశాలు ఇవ్వాలి!



డా. జె. పూర్ణచంద్రరావు

ఐపిఎస్ (రిటైర్డ్)

యువత బాగుపడాలన్నా, దేశం బాగుపడాలన్నా వారసత్వ సంపద, అధికార వ్యామోహం తగ్గాలి. భారతదేశంలో తల్లిదండ్రులుతమ పిల్లల కోసం ఎంత సంపాదించాలి? పిల్లలకు చదువు చెప్పించి, ఉద్యోగాలు సంపాదించుకునే స్థాయికి తీసుకువచ్చి, వివాహాలు చేసి, జీవితంలో స్థిరపడేలా చేసిన తరువాత కూడా వారి కోసం ఆస్తులు కూడబెట్టాలా? మనవళ్లకు, మునిమనవళ్లకు సరిపడా సంపదను సమకూర్చడమే జీవిత లక్ష్యంగా భావించాలా? భారతీయ సమాజం తీవ్రంగా ఆలోచించాల్సిన ప్రశ్నలివి. యువత బాగుపడాలన్నా, దేశం బాగుపడాలన్నా తల్లి దండ్రులు పిల్లలకు ఆస్తులు, అధికారాలు సంపాదించి పెట్టాలనే ఆలోచనను విడనాడాలి. మన దేశంలో కొందరు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు తమ జీవితకాల అవసరాలకు ఎన్నో రెట్లు మించిన సం పదను కూడబెడుతున్నారు. తరతరాల వారసులకుఆస్తులు, వ్యాపార సామ్రాజ్యాలు, రాజకీయ అధికారాన్ని అందించాలనే ఆకాంక్ష ఇందుకు ఒక కారణం కావచ్చు. అవినీతికి ఇదొక్కటే కారణం కాకపోయినా, వారసత్వ సంపదపై మితిమీరిన వ్యామోహం అక్రమ సంపాదనను ప్రోత్సహించే అవకాశం ఉంది. మరోవైపు, తల్లిదండ్రుల ఆస్తులు తమకు తప్పకుండా సంక్రమిస్తాయనే భావన కొందరు యువతలో స్వతంత్రంగా ఎదగాలనే పట్టుదలను బలహీన పరుస్తుంది. కష్టపడకుండా సంపద, రాజకీయ పదవులు, వ్యాపారసంస్థలు వారసత్వంగా లభిస్తే ప్రతిభ, శ్రమ, సృజనాత్మకతకు ప్రాధాన్యం తగ్గుతుంది. పాశ్చాత్య దేశాల్లో అనేక కుటుంబాలు పిల్లల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం ఇస్తాయి. మన దేశంలోనూ ఆ సంస్కృతి పెరగాలి. అయితే ఆర్థిక స్వాతంత్ర్యం అంటే తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం కాదు. కుటుంబ ప్రేమ, పరస్పర సహకా రం కొనసాగుతూనే పిల్లలు తమ కాళ్లపై తాము నిలబడా లి. తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాల్సిన గొప్ప వారసత్వం ఆస్తులు కాదు. విద్య, నైపుణ్యం, విలువలు, ఆత్మవిశ్వాసం. అలాగే పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రు లకు తమ సంపాదనను స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు ఉండాలి. వృద్ధాప్య భద్రత, ఆరోగ్యం, వ్యక్తిగత అవసరాలకు తగినంత ఉంచుకున్న తరువాత మిగిలిన సంపదను సమాజ సంక్షేమానికి కేటాయించే సంస్కృతి పెరగాలి. ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, పేద విద్యార్థుల ఉన్నత విద్య, యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, ఉపాధి శిక్షణ, పరిశోధన సంస్థల అభివృద్ధికి సంపన్నులు తమ మిగులు ఆస్తులను స్వచ్ఛందంగా వినియోగించాలి. ఒక ధనవంతుడు తన కుమారుడికి మరో వంద ఎకరాలు కొనివ్వడం కంటే వందమంది పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తే సమాజానికి ఎంత ప్రయోజనం! ఒక రాజకీయ నాయ కుడు తన వారసుడికి పదవి ఇప్పించడం కంటే వంద మంది ప్రతి భావంతులైన యువకులకు నాయకత్వ అవకా శాలు కల్పిస్తే ప్రజాస్వామ్యం ఎంత బలపడుతుంది! వార సత్వ సంపద, అధికారం కొన్ని కుటుంబాల్లోనే కేంద్రీకృత మైతే సామాజిక అసమానతలు తరతరాలకు కొనసాగు తాయి. ముఖ్యంగా ఆస్తులు లేని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనా రిటీ, ఇతర పేద కుటుంబాల యువతకు సమాన అవకా శాలు లభించడం కష్టమవుతుంది. అందుకే ఆస్తుల వార సత్వం కంటే అవకాశాల సమానత్వానికి, అధికార వార సత్వం కంటే ప్రజాస్వామ్య నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇది పిల్లల ఆస్తి హక్కులను నిరాకరించే ప్రతి పాదన కాదు. చట్టబద్ధమైన వారసత్వ హక్కులను గౌర విస్తూనే, స్వయంగా సంపాదించిన మిగులు ఆస్తులను సమాజానికి అందించాలనే స్వచ్ఛంద దాతృత్వ సంస్కృతిని ప్రోత్సహించాలన్నదేఉద్దేశం. మన దేశానికి కావల సింది తరతరాల ధనవంతుల కుటుం బాలు మాత్రమే కాదు, ప్రతి తరంలో స్వశక్తితో ఎదిగే లక్షలాది యువత. పిల్లలకోసం సంపదను కూడబెట్టడం కంటే, పిల్లలతోకలిసి సమాజానికి సంపదను సృష్టిద్దాం. వారసులకు ఆస్తులు మిగల్చడం కంటే దేశానికి అవకాశాలు మిగులుద్దాం. అప్పుడే యువతలో స్వావలంబన పెరుగుతుంది. అవినీతికి ఒక

# ఐక్యరాజ్య సమితిలో సమూల ప్రక్షాళన జరగాలి

సుంకవల్లి సత్తిరాజు

ప్రపంచంలో నెలకొల్పబడే వివిధ రకాల సంస్థల వలన, యంత్రాంగాల వలన ప్రజల సమస్యలు, జీవన స్థితిగతులు మెరుగుపడితే ఆసంస్థల మనుగడ సాధ్యపడుతుంది. వాటి స్థాపనకు సార్థకత చేకూరుతుంది. కార్యాచరణలో విఫలమైతే ఆ సంస్థల విలువ శూన్యమై, అంతరించక తప్పదు. మొదటి ప్రపంచ యుద్ధం వలన ప్రజల్లో తీవ్రమైన భయాందోళనలు, అశాంతి ఏర్పడ్డాయి. 1914-18 సంవత్సరాల మధ్య జరిగిన ఈ యుద్ధంలో సుమారు 2 కోట్ల మంది ప్రజలు మరణించారు. ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా, ప్రపంచ యుద్ధాలుసంభవించకుండా శాంతి స్థాపన కోసం 1920 జనవరి 10వ తేదీన స్విట్జర్లాండ్ రాజధాని జెనీవాప్రధాన కేంద్రంగా 'లీగ్ ఆఫ్‌నేషన్స్' ఏర్పడింది. అయినా ఈ అంతర్జాతీయ సంస్థ యుద్ధాలను నిలువరించలేకపోయింది. రెండవ ప్రపంచ యుద్ధంలో సుమారు 8కోట్ల మంది మరణించారు. లీగ్ ఆఫ్ నేషన్స్ వైఫల్యం వలన దాని స్థానంలో 1945, అక్టోబర్ 24వ తేదీన అమెరికాలోని న్యూయార్క్ కేంద్రంగా ఐక్యరాజ్య సమితి ఆవిర్భవించింది. గత 80 సంవత్సరాలుగా ఈ సంస్థ తన అస్థిత్వాన్ని కొనసాగిస్తున్నది. ఐక్యరాజ్య సమితిలో ఆరు ప్రధానాంగాలు వివిధ లక్ష్యాల సాధన కోసం ఏర్పడ్డాయి. సర్వ ప్రతినిధుల సభ, భద్రతా మండలి, ఆర్థిక సామాజిక మండలి, అంతర్జాతీయ న్యాయస్థానం, సచివాలయం, ధర్మకర్తృత్వ మండలి ఐ.రా.స ప్రధానాంగాలు. ఇవి కాకుండా వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం, విశ్వ జనావళి శ్రేయస్సు కోసం ఐ.రా.స ఆధ్వర్యంలో 15ప్రత్యేక ఏజెన్సీలు ఏర్పడ్డాయి. ప్రపంచ శాంతిని నెలకొల్పి, ప్రజలు స్వేచ్ఛగా జీవించేభద్రతను కల్పించడమే 'యునైటెడ్ నేషన్స్' ప్రధాన ఆశయం. అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాల ఫలితంగా ఈ సంస్థ తన అస్థిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. పశ్చిమాసియా భగ్గుమంటున్నది. ప్రపంచంలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. అగ్రరాజ్యాల దురహంకారాన్ని ప్రశ్నించడంలోను, యుద్ధాలను నివారించడంలోను విఫలమవుతున్న ఐక్యరాజ్య సమితి పట్ల ప్రపంచదేశాలు తమ నమ్మకాన్నికోల్పోతున్నాయి. ఐక్యరాజ్య సమితి ఎంత విస్తృతమైనా, భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేకపోవడం విడ్డూరం. వీటో దేశాలు యుద్ధోన్మాదంతో విరుచుకుపడడం, పాక్ లాంటి బాధ్యత లేని దేశాలు తమ వద్ద గల అణ్వస్త్రాలు బూచిని చూపి బెదిరించడం ప్రపంచ ఎదుర్కోబోతున్న తీవ్రమైన పరిస్థితులకు దర్పణం పడుతున్నది. పాక్, బంగ్లాదేశ్ లాంటి ఉన్మాద దేశాలతో అమెరికా, చైనాలు అంటకాగడం సిగ్గుచేటు. ఒక వైపు ఇరాన్ యుద్ధం, మరొక వైపు సౌదీపై హౌతీల దాడు





లు, ఇంకో వైపు సంవత్సరాల తరబడి రష్యా ఉక్రెయిన్ల మధ్య సాగుతున్న యుద్ధం ప్రపంచ దేశాలను ఆర్థికంగా దివాళా తీసాయి. ఇజ్రాయిల్ హమాస్‌ల మధ్య జరిగిన రక్తపాతం, గాజాలో నెలకొన్న పరిస్థితులను మరవక ముందే అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై యుద్ధం ప్రకటించి ప్రపంచంలో చమురు కొరత సృష్టించాయి. ఇంధన సంక్షోభంతో పలు దేశాలు అతలాకుతలమైపోతున్నాయి. 51 సభ్య దేశాల చేరికతో ఏర్పడిన ఐక్యరాజ్య సమితి ఇంతింతై వటుడింతై...అన్నట్టుగా నేడు 193 సభ్య దేశాలకు పెరిగింది. అయినా ఐరాస అన్ని దేశాలకు సమన్యాయం చేయలేకపోతున్నది. వివిధదేశాల మధ్య జరుగుతున్న ఉద్రిక్తతలను నివారించడంలో ప్రపంచ దేశాల మధ్యతలెత్తే సంఘర్షలను నిలువరించడంలో అలక్ష్యం ప్రదర్శిస్తే సమీప భవిష్యత్తులో అణు యుద్ధాలు జరిగే అవకాశాలను తోసిపుచ్చలేం. 1939-45 సంవత్సరాల మధ్య ఆరు సంవత్సరాలపాటు అగ్ర రాజ్యాలు, మిత్రరాజ్యాల మధ్య సుదీర్ఘంగా కొనసాగిన రెండవ మహాప్రపంచ సంగ్రామం చరిత్రలో భయంకరమైన మారణహోమానికీ సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఈ మహా యుద్ధ ప్రళయాన్ని నిలువరించడంలో అప్పటి నానా జాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్)ఘోరమైన వైఫల్యాన్ని మూట గట్టుకుంది. లీగ్ఆఫ్ నేషన్స్‌కు ప్రత్యామ్నాయ అంతర్జాతీయ వేదికగా ఐక్యరాజ్య సమితి ఆవిర్భవించినా వర్తమాన ప్రపం చం అనేక యుద్ధసంక్షోభాలతో అతలాకుతలం కావడం జరుగుతున్నది. ఐరాస కూడా లీగ్ ఆఫ్‌నేషన్స్ దారిలోనే పయనిస్తూ, తన మనుగడను కోల్పోయి, అదృశ్యమయ్యే ప్రమాదం పొంచిఉంది. ప్రపంచ జనాభా 8.4బిలియన్లకుచేరింది. కొన్నిదేశాల జనాభా సమస్యతో తీవ్రఇబ్బందులుపడుతుంటే, మరికొన్ని దేశాల్లో జన సంఖ్యతగ్గి, యువతరం లేక అనేక ఇబ్బందులు పడుతున్నాయి. కొన్నిదేశాలు ఆర్థిక మందగమనంతో ప్రజావసరాలు తీర్చలేక సతమతమవుతున్నాయి. కోవిడ్ సంక్షోభంవలన ఆర్థికంగా అనేక దేశాలు అస్తవ్యస్త పరిస్థితులను చవిచూసాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంఎప్పటికి ముగుస్తుందో తెలియదు. గతంలోట్రంప్, పుతిన్‌ల మధ్య జరిగిన శాంతి చర్చలు అసంపూర్తిగా ముగిసాయి. చమురు సదుపాయాలపై రష్యా ఉక్రెయిన్లు తమ దాడులను కొనసాగిస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో శాంతి చర్చలు సాధ్యమా? ఏదిఏమైనప్పటికీ అగ్రరాజ్యాలు తమ దురహంకారాన్ని విడనాడాలి. ఐక్యరాజ్య సమితి యుద్ధాలను నివారించడంలో వైఫల్యం చెందిందని డోనాల్డ్ ట్రంప్ స్వయంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలోనే తీవ్రమైన విమర్శ చేయడం విశేషం. వర్తమాన ప్రపంచ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్య సమితిని పునర్వ్యవస్థీకరించాలి. సెక్యూరిటీ కౌన్సిల్‌లో వీటోపేరుతో సాగే అగ్రరాజ్యాల పెత్తనం పోవాలి. భారత్ వంటి దేశాల ప్రాధాన్యం పెరగాలి. సర్వప్రతినిధుల సభలో మెజారిటీ దేశాల తీర్మానం ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలి. 80 సం॥ క్రితం ఏర్పడిన

24-10Pg5:24-10Pg5.qxd 10/23/2026 11:20 PM Page 1



# కర్బన ఉద్గారాల్లో ఐరోపాదే పెద్దవాటా

### - కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ చురకలు - భారత్ నుంచి 3 శాతం మాత్రమే అయినా ఆంక్షలు భారీగా విధిస్తున్నారని ఆరోపణ



**ప్యారిస్, అక్టోబరు 23:** వాతావరణ మార్పులు, కార్బన్ ఉద్గారాల బాధ్యత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ యూరప్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ జనాభాలో భారత్ వాటా సుమారు 17 శాతం ఉన్నప్పటికీ, ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో దేశం వాటా 3 శాతం కంటే తక్కువగా ఉందని పేర్కొన్నారు. పర్యావరణ సమస్యలకు చారిత్రకంగా ఎక్కువగా కారణమైన దేశాలు, ఇప్పుడు భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై నిబంధనల భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. యూరప్ ప్రతినిధులతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పర్యావరణ సమస్యల పరిష్కారంలో అన్ని దేశాల బాధ్యత ఒకేలా ఉండదని, గతంలో ఎక్కువ ఉద్గారాలకు కారణమైన దేశాలు తమ బాధ్యతను గుర్తించాలని హితబోధ చేశారు. ప్రపంచ జనాభాలో భారత్ వాటా సుమారు 17 శాతం అని, అయినప్పటికీ ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో దేశం వాటా 3 శాతం కంటే తక్కువగా ఉందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. యూరప్ జనాభా ప్రపంచ జనాభాలో సుమారు 3 నుంచి 4 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, కార్బన్ ఉద్గారాలు, పర్యావరణ ప్రభావంలో దాని చారిత్రక పాత్ర గణనీయంగా ఉందని వ్యాఖ్యానించారు. భారత్‌లో వ్యక్తికి సంబంధించిన కార్బన్ ఉద్గారాలు యూరప్‌తో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. తన వాదన ప్రకారం, యూరప్‌లో వ్యక్తికి సంబంధించిన కార్బన్ ఉద్గారాలు, పర్యావరణ ప్రభావం భారత్‌తో పోలిస్తే ఏడు నుంచి ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉండవచ్చని తెలిపారు. పర్యావరణ సమస్యల మూలాలపై కూడా గోయల్ ప్రశ్నలు లేవనెత్తారు. ఓజోన్ పొర దెబ్బతినడానికి కారణమైన చర్యలు, వాతావరణంలోకి భారీగా కార్బన్‌ను విడుదల చేసిన చారిత్రక పారిశ్రామిక కార్యకలాపాల బాధ్యతను ఎవరు స్వీకరించాలన్నది ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి చెందిన దేశాలు గతంలో పారిశ్రామికీకరణ ద్వారా పెద్ద మొత్తంలో ఉద్గారాలను విడుదల చేశాయని, ఇప్పుడు వాతావరణ పరిరక్షణ పేరుతో అభివృద్ధి చెందుతున్న దేశాలపై అద నపు భారాన్ని మోపకూ డదని అభిప్రాయ పడ్డారు. ఓజోన్ పొర క్షీణత, వాతావరణ మార్పులు వేర్వేరు పర్యావరణ సమస్యలు. ఓజోన్ పొర క్షీణతకు ప్రధానంగా క్లోరోఫ్లోరో కార్బన్లు వంటి ఓజోన్‌ను దెబ్బతీసే రసాయనాలు కారణమవుతాయి. గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణం కార్బన్ డైఆక్సైడ్ వంటి గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదల. భారత్ కేవలం ఉద్గారాలను తగ్గించడం గురించే ఆలోచించలేదని, దేశంలోని సుమారు 140 కోట్ల మంది ప్రజల అవసరాలను కూడా తీర్చాల్సి ఉంటుందని గోయల్ పేర్కొన్నారు. ప్రజలకు విద్యుత్, ఆహారం అందించడం, దేశ భద్రతను కాపాడటం వంటి బాధ్యతలు ప్రభుత్వంపై ఉన్నాయని వివరించారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, ప్రపంచంలో వేగంగా విస్తరిస్తున్న స్వచ్ఛ ఇంధన కార్యక్రమాల్లో భారత్ ఒకటిగా ఉందని చెప్పారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, స్వచ్ఛ ఇంధన రంగంలో పెట్టుబడులు వంటి చర్యల ద్వారా దేశం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోందని ఆయన వాదన. యూరోపియన్ యూనియన్ అమలు చేస్తున్న పర్యావరణ సంబంధిత నిబంధనలు భారత ఎగుమతిదారులకు అదనపు ఖర్చులను కలిగిస్తున్నాయన్న ఆందోళనలు ఉన్నాయి. ముఖ్యంగా కార్బన్ ఉద్గారాలకు సంబంధించిన సీబీఎఎం వంటి చర్యలు కొన్ని పరిశ్రమలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇలాంటి నిబంధనలను పాటించేందుకు ఉత్పత్తి ప్రక్రియల్లో ఉద్గారాలను కొలవడం, నివేదికలు సమర్పించడం, అవసరమైన ధ్రువీకరణ పొందడం వంటి పనులు చేయాల్సి రావచ్చు. ఇవి చిన్న, మధ్య తరహా సంస్థలకు ఆర్థిక భారంగా మారవచ్చని భారత ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ పేరుతో వాణిజ్య పరిమితులు విధించేటప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక పరిస్థితులు, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యంతో మొజ్తబా ఖమేనీ

### - ఇరాన్ దౌత్యవేత్త అబ్దుల్ మజీద్ హాకీమ్

**టెహ్రాన్,అక్టోబరు 23:** ఆరు నెలలుగా ప్రజల మధ్యకు రాకుండా అజ్ఞాతంలో ఉన్న ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఆరోగ్యంపై నెలకొన్న వదంతుల పట్ల ఆ దేశం వివరణ ఇచ్చింది. ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని, దేశ పాలనా వ్యవహారాలను చురుగ్గా పర్యవేక్షిస్తున్నారని ఇరాన్ సీనియర్ దౌత్యవేత్త అబ్దుల్ మజీద్ హాకీమ్ ఎలాహి స్పష్టం చేశారు. గడిచిన వారంలోనే దేశాధ్యక్షుడితో మొజ్తబా ఏకంగా ఏడు గంటల పాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించారని ప్రత్యేక మీడియా ఇంటర్వ్యూలో వెల్లడించారు. దాదాపు ఎనిమిది నెలల క్రితం ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ దాడిలోనే ఫిబ్రవరి 28న అప్పటి సుప్రీం లీడర్, మొజ్తబా తండ్రి అయిన అయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. ఈ దాడిలో మొజ్తబా కూడా గాయపడినట్లు వార్తలు వచ్చాయి. తండ్రి మరణానంతరం అత్యున్నత నేతగా బాధ్యతలు చేపట్టినప్పటికీ, ఆయన ఒక్కసారి కూడా బహిరంగంగా కనిపించలేదు. కేవలం రాతపూర్వక ప్రకటనల ద్వారానే సందేశాలు ఇస్తున్నారు. జులైలో జరిగిన తండ్రి అంత్యక్రియలకు కూడా ఆయన గైర్హాజరు కావడం, ఆయన ఆరోగ్యంపై తీవ్ర ఆందోళనలకు, భద్రతాపరమైన భయాలకు దారితీసింది. ఈ నేపథ్యంలో అబ్దుల్ మజీద్ ఎలాహి వివరణ ఇస్తూ సుప్రీం లీడర్ మొజ్తబా ఖొమేనీ చాలా మంచి ఆరోగ్యంతో ఉన్నారు. తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. గతనెలలో అధ్యక్షుడితో 7 గంటల పాటు భేటీ అయ్యారు. రేపు మా పార్లమెంట్ స్పీకర్ కూడా ఆయన్ను కలవనున్నారు. నేను కలిసిన నా స్నేహితులు కూడా ఆయన చాలా ఆరోగ్యంగా ఉన్నారని, పనులన్నీ చక్కగా చేసుకుంటున్నారని నాతో చెప్పారని తెలిపారు. తండ్రి అంత్యక్రియలకు మొజ్తబా రాలేదన్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆయన మీడియా ముందుకు రావడం లేదు. అందుకే ఎవరూ ఆయన్ను చూడలేదు. కానీ, ఆయన తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో నేను ఇరాన్‌లోనే ఉన్నాను. ఆయన సోదరులిద్దరినీ కలిశాను. మొజ్తబా కూడా అక్కడే ఉన్నారు. కొన్నిసార్లు ఆయన రాత్రిపూట వీధుల్లోకి కూడా వస్తారు. ప్రజల ప్రదర్శనల్లో పాల్గొంటారని ఎలాహి వివరించారు.

# అత్యంత బలహీన దేశంగా మిగులుతున్న అమెరికా!

### ఇరాన్ సుప్రీంలీడర్ ప్రతినిధి హాకీమ్ ఇలాహీ

**టెహ్రాన్, అక్టోబరు 23:** ఇరాన్‌తో జరుగుతున్న పోరాటంలో అమెరికా తన లక్ష్యాలను సాధించడంలో ఘోరంగా విఫలమైందని, ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన దేశంగా అమెరికా నిలిచిందని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మజీద్ హాకీమ్ ఇలాహీ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన సమయంలో అమెరికాకు మూడు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయని, అయితే వాటిలో దేనినీ ఆ దేశం సాధించలేకపోయిందని ఆయన విమర్శించారు. "మొదటిగా, వారు ఇరాన్‌లో అధికార మార్పును కోరుకున్నారు. రెండోది, ఇరాన్‌ను ఐదు దేశాలుగా ముక్కలు చేయాలని కుట్ర పన్నారు. మూడోది, ఇరాన్ చమురు నిల్వలపై ఆధిపత్యం సాధించాలని భావించారు. కానీ, ఈ ప్రయత్నాలన్నీ దారుణంగా విఫలమయ్యాయి. వారు ఏమీ సాధించలేకపోయారు" అని ఆయన వివరించారు. కేవలం మూడు రోజుల్లోనే తమ లక్ష్యాలను చేరుకుంటామని అమెరికా పలు దేశాలతో ధీమా వ్యక్తం చేసిందని, కానీ అది సాధ్యం కాలేదని ఆయన ఎద్దేవా చేశారు. ప్రపంచమంతా అమెరికాను అత్యంత శక్తివంతమైన దేశంగా భావించినప్పటికీ, వారు ఇరాన్‌ను కనీసం ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. టెహ్రాన్ సామర్థ్యాలు అప్పటివరకు వెల్లడి కాలేదని, కానీ ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ ఇరాన్‌ను గౌరవిస్తున్నాయని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరుపై కూడా ఇలాహీ విమర్శ.

# నాపై మెటా స్మార్ట్ గ్లాసెస్‌తో స్టింగ్ ఆపరేషన్: డికె శివకుమార్ వెల్లడి



**బెంగళూరు, అక్టోబరు 23:** కర్ణాటక రాజకీయాల్లో స్టింగ్ ఆపరేషన్ వివాదాలు సంచలనంగా మారాయి ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇప్పుడు సంచలన ఆరోపణలు చేశారు. మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించిన ఒక పారిశ్రామికవేత్త తనను, కేరళ సీఎం వీడి సతీషన్‌ను రహస్యంగా రికార్డ్ చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. కన్నడ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం సంచలనంగా మారింది. తనను కలిసిన పారిశ్రామికవేత్త ధరించిన కళ్లద్దాలపై అనుమానం రావడంతో అతడి నేపథ్యం, ఇతర రాజకీయ నాయకులతో ఆయన సమావేశాల గురించి వివరాలు సేకరించాలని అధికారుల్ని ఆదేశించానని డీకే తెలిపారు. తనను కలిసేందుకు అధికారుల వద్ద నుంచి సదరు పారిశ్రామికవేత్త అపాయింట్‌మెంట్ తీసుకున్నట్లు డీకే శివకుమార్ తెలిపారు. ముందుగా వ్యాపార విషయాల గురించి మాటాడిన వ్యక్తి, ఆ తర్వాత రాజకీయాల గురించి మాట్లాడటంతో అనుమానం వచ్చిందని సీఎం చెప్పారు. బూత్ స్థాయి వ్యూహాలు, రాజకీయ పరిణామాల గురించి చర్చించడంతో అనుమానం కలిగిందన్నారు. ఇదే వ్యక్తి కేరళ సీఎం వీడీ సతీషన్‌తో కూడా ఇదే విధంగా మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించి సమావేశమయ్యారని డీకే పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్రమంత్రితో సమావేశమైనప్పుడు మాత్రం ఈ కళ్లద్దాలు ధరించలేదని ఆరోపించారు. తనను తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అనుమానాల నేపథ్యంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారని డీకే శివకుమార్ తెలిపారు. ఈ చర్యల గురించి చెప్పబోమన్నారు. కేబినెట్ మంత్రులు, వారి పీఏలు, ఫోన్ కాల్స్ లేదా ఇతర మార్గాల ద్వారా జరిగే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు చెప్పారు. కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్యకు సంబంధించిందిగా చెబుతున్న స్టింగ్ ఆపరేషన్ కర్ణాటక రాజకీయాల్లో సంచలనంగా మారింది.

# కేంద్ర ఎన్నికల సంఘంలో లుకలుకలు నిజమే!




**న్యూఢిల్లీ,అక్టోబరు 23:** భారత ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి.. ఆ సంఘంలోని సీనియర్ అధికారి మనీష్ గార్గ్‌పై కేంద్ర కేబినెట్ కార్యదర్శికి వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. 2026 జులై 29న రాసిన ఈ లేఖలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద విడుదల చేసిన పత్రాలు బయటపెట్టాయి. ఎన్నికల సంఘంలోని సీనియర్ డిప్యూటీ కమిషనర్ మనీష్ గార్గ్ ఉన్నతాధికారుల మధ్య విధుల కేటాయింపును మార్చుతూ జులై 28న ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సంధు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘంతో గానీ, సంబంధిత అధికారులతో గానీ ముందుగా చర్చించకుండా ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. తనకు, తనకంటే సీనియర్ లేదా సమాన స్థాయి అధికారులకు కేటాయించిన పనుల్లోనూ మార్పులు చేశారని పేర్కొన్నారు. ఫైలు ఇవ్వలేదన్న మరో కమిషనర్ వివేక్ జోషి కూడా ఇదే అంశంపై ఫిర్యాదు చేశారు. విధుల కేటాయింపులో మార్పులు చేసే ముందు ఎన్నికల సంఘంతో చర్చించలేదని ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫైలును అడిగినా పరిపాలనా విభాగం తనకు అందించలేదని లేఖలో పేర్కొన్నారు. గతంలోనూ ఇలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఇద్దరు కమిషనర్లు గుర్తుచేశారు. ఈ చర్యలు 2023 నాటి చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని ఆరోపిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ లేఖలపై కేబినెట్ సెక్రటేరియట్ అధికారులు అంతర్గతంగా చర్చించారు. ఇద్దరు కమిషనర్లు వ్యక్తిగత హోదాలో లేఖలు రాసినందున, వాటిని ఎన్నికల సంఘం అధికారిక ఫిర్యాదుగా పరిగణించలేమని ఫైలు నోట్‌లో పేర్కొన్నారు. ఈ దశలో జోక్యం చేసుకుంటే రాజ్యాంగబద్ధ సంస్థ స్వతంత్ర పనితీరులో జోక్యం చేసుకున్నట్లవుతుందని అభిప్రాయపడ్డారు. ఆగస్టు 5న కేబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ ఇద్దరు కమిషనర్ల లేఖలు అందినట్లు ధ్రువీకరించారు. సంబంధిత అధికారులకు వాటి ప్రతులను పంపించారు. అయితే ఈ ఫిర్యాదులపై తదుపరి విచారణ జరిగిందా ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే విషయాలు ఆర్టీఐ ద్వారా వెల్లడైన పత్రాల్లో స్పష్టంగా లేవు. సెప్టెంబరు 24న మాజీ నౌకాదళ అధికారి కమోడోర్ లోకేశ్ కె.బాత్రా దాఖలు చేసిన ఆర్టీఐ దరఖాస్తుతో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి.

# రాహుల్ ప్రియాంకల మధ్య కోల్డ్‌వార్!

# చిచ్చురేపిన బిజెపి



**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. నో ఐడియా ఈజ్ ఫైనల్త్ పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.



# బాణాసంచా తయారీ భవనంలో పేలుడు..

### 8 మంది మృతి - మరికొందరికి తీవ్రగాయాలు

**సివాన్(బీహార్), అక్టోబరు 23:** బాణసంచా తయారీ కేంద్రంలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 8 మంది మరణించినట్లు సమాచారం. పేలుడు తీవ్రతకు బాణసంచా ఉన్న ఇల్లు పూర్తిగా దెబ్బతింది. మరోవైపు, ప్రమాదస్థలిలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బిహార్‌లోని సివాన్ జిల్లా, బర్హరియా బ్లాక్‌లోని అలంపుర్ గ్రామంలో జరిగిన ఈఘటనతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాణసంచా తయారు చేస్తున్న మహమ్మద్ ఆలంఘీర్ మియాన్ ఇంట్లో తొలుత భారీ అగ్నిప్రమాదం జరిగింది. అది కాస్త పెద్ద ఎత్తున పేలుళ్లకు దారితీసింది. ప్రమాద సమయంలో ఇంట్లో పెద్దఎత్తున బాణసంచాను నిల్వ ఉండటం వల్ల ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మరణించిన వారిలో ఆలంఘీర్ మియాన్ కూడా ఉన్నారు. బాధితుల్లో ఎక్కువమంది ఆయన కుటుంబ సభ్యులేనని సమాచారం. దాదాపు రెండు గంటల పాటు అడపాదడపాగా పేలుళ్లు కొనసాగాయి. పేలుడు తీవ్రతకు ఇంటి ముందు భాగం పూర్తిగా ధ్వంసమై, శిథిలాలు రోడ్డుపై చాలా దూరం వరకు చెల్లాచెదురుగా పడిపోయాయి. తీవ్ర భయాందోళనకు గురైన సమీప ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ఘటనా ప్రాంతంలో నిరంతరం జరుగుతున్న పేలుళ్ల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఐదుగురు మరణించినట్లు జిల్లా ఎస్పీ ధ్రువీకరించారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిన తర్వాతే మృతులు, గాయపడిన వారి కచ్చితమైన సంఖ్య స్పష్టంగా తెలుస్తుంది.

# బంగ్లా జైళ్లలో 407 మంది విదేశీ ఖైదీలు

### సగానికిపైగా భారతీయులే.. శిక్షాకాలం పూర్తయినా విడుదలకాని వైనం

**ఢాకా, అక్టోబరు 23:** బంగ్లాదేశ్‌లోని వివిధ జైళ్లలో డ్రగ్స్, మానవ అక్రమ రవాణా, బంగారం స్మగ్లింగ్ వంటి తీవ్రమైన నేరారోపణలపై 407 మంది విదేశీయులు శిక్ష అనుభవిస్తున్నారు. వీరిలో సగానికి పైగా భారతీయులే ఉండటం గమనార్హం. శిక్షాకాలం పూర్తయినప్పటికీ, గణనీయమైన సంఖ్యలో భారతీయులు ఇంకా జైళ్లలోనే మగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ది డైలీ స్టార్ కథనం ప్రకారం, ఆ దేశంలోని వివిధ జైళ్లలో మొత్తం 238 మంది భారతీయ ఖైదీలు ఉన్నారు. వీరిలో 168 మంది ఇప్పటికే తమ శిక్షాకాలాన్ని పూర్తి చేసుకున్నప్పటికీ, స్వదేశానికి పంపే ప్రక్రియలో జాప్యం కారణంగా వారు ఇంకా నిర్బంధంలోనే కొనసాగుతున్నారు. ఈ గణాంకాలపై ఢాకాలోని భారత హైకమిషన్ భిన్నమైన వివరణ ఇచ్చింది. శిక్షాకాలం ముగిసి, స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ధ్రువీకరించబడిన భారతీయుల సంఖ్య కేవలం 25 మాత్రమేనని హైకమిషన్‌లోని కాన్సులర్ వింగ్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ మొత్తం 121 మంది ఖైదీల జాబితాను పంపినప్పటికీ, అందులోని పలువురి వ్యక్తిగత వివరాలు అసంపూర్ణంగా ఉండటంతో జాతీయతను నిర్ధారించడం సవాలుగా మారిందని ఆయన పేర్కొన్నారు. సదరు ఖైదీలను కలిసేందుకు అనుమతి కోరామని, బంగ్లా విదేశాంగ శాఖ స్పందన కోసం వేచి చూస్తున్నామని ఆయన వివరించారు. భారతీయుల తర్వాత మయన్మార్‌కు చెందిన వారు 133 మందితో రెండో స్థానంలో ఉన్నారు. వీరితో పాటు నైజీరియాకు చెందిన ఆరుగురు, పాకిస్థాన్, మలేషియా దేశాలకు చెందిన వారు ముగ్గురు చొప్పున బంగ్లా జైళ్లలో ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా విదేశీ ఖైదీలను ప్రత్యేక సెల్‌లలో ఉంచి, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. శిక్ష పూర్తయినప్పటికీ ఖైదీలు విడుదల కాకపోవడతో నిర్వహణాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇది ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని జైలు అధికారులు చెబుతున్నారు.

# ఎఐ సాయం చేసినా.. ట్రిగ్గర్ నొక్కింది మనిషేగా!

# ఇరాన్ పాఠశాల దాడిపై అమెరికా మాజీ అధికారి

**వాషింగ్టన్, అక్టోబరు 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఆ బాంబు దాడిలో 123 విద్యార్థులు సహా 156 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై అమెరికా సిఐఎ మాజీ డైరెక్టర్ డేవిడ్ పెట్రాయస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో లక్ష్యాలను గుర్తించేందుకు కృత్రిమ మేధ సహాయం తీసుకున్నప్పటికీ.. చివరిగా ట్రిగ్గర్ నొక్కింది మాత్రం మనిషేగా అన్నారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన వరల్‌న సమ్మిట్‌లో పాల్గొన్నారు. 'అది ఒక మనిషి తీసుకున్న నిర్ణయం. అందులో మెషీన్ పాత్ర ఏమీ లేదు. ఎఐని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. దాని సహాయం తీసుకున్నారు. ఈ క్రమంలో తప్పులు జరిగాయి. పశ్చిమాసియా ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధంలో ఇలాంటివి మీరు చూసుంటారు. ట్రిగ్గర్ లాగడమా, బటన్ నొక్కడమా.. ఇలా ఏదైనా అంతిమంగా దాడి చేయాలా? వద్దా? అని నిర్ణయించుకునేది మనిషే' అని సిఐఎ మాజీ చీఫ్ పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధానికి ముందు మిలటరీ లక్ష్యాలను ఎంపిక చేయడానికి ఎఐ కిల్‌చైన్‌పై అమెరికా సెంట్రల్ కమాండ్ ఆధారపడిందని, ఆ టూల్‌తో సేకరించిన సమాచారంతోనే పొరపాటున ఆ పాఠశాలను టార్గెట్‌గా గుర్తించారని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరిలో అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా గాయపడిన మొజ్తాబా ఖమేనీ.. ఆ తర్వాత నుంచి బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. దీనిపై దౌత్యవేత్త మాట్లాడారు. 'ఆయన ఆరోగ్యం బాగుంది. చురుగ్గా పనిచేస్తున్నారు. గత వారం అధ్యక్షుడితో ఏడు గంటలపాటు సమావేశమయ్యారు. మీడియా ముందుకు రాకపోవడంతో ఆయన ఎవరికీ కనిపించలేదు. కానీ ఆయన తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



# మీ సైనికుల మృతదేహాలకు మేమే అంత్యక్రియలు చేశాం

### పాకిస్థాన్‌కు భారత్ చురకలు

**న్యూయార్క్, అక్టోబరు 23:** అంతర్జాతీయ వేదిక మీద భారత్‌పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్ప లేదు. ఐక్యరాజ్య సమితి సమావేశంలో జమ్మూ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన దాయాదికి భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. ఐరాస సమావేశంలో పాకిస్థాన్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి భావికా మంగళానందన్ ఖండించారు. జమ్మూకశ్మీర్ భారత్ అంతర్గత విషయమని.. దాని గురించి మాట్లాడే నైతిక హక్కు పాక్‌కు లేదని స్పష్టం చేశారు. కశ్మీర్‌పై పెట్టే శ్రద్ధ.. తన ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని మైనారిటీలపై పెట్టాలని సూచించారు. అనేక మంది మైనారిటీలు కనుమరుగవుతున్నారని.. నిరంతరం వారి హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. మొదట ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. 'అసాధారణ పరిస్థితుల్లో అంత్యక్రియల హక్కులు : మత విశ్వాసాలు' అనే అంశంపై చర్చలో మంగళానందన్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. '1999లో కార్గిల్‌లో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని ఒక దేశం.. విశ్వాసం, మత స్వేచ్ఛ, ఖననాల గురించి మాట్లాడటం విడ్డూరం. నేను వారికి ఒక విషయం గుర్తు చేయాలనుకుంటున్నాను. వారు తమ సైనికుల మృతదేహాలను దయనీయ పరిస్థితుల్లో వది లేసిన సమయంలో .. వాటికి భారత సైన్యమే సైనిక లాంఛనాలతో, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించింది. ఒక ఉగ్రవాది అమాయక ప్రజలను చంపడమే కాకుండా.. ఒక దేశ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాడు.

# సంక్షిప్త వార్తలు

## డయాబెటిస్‌ను కట్టడి చేసుకున్న హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న 62వ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆరోగ్య ప్రస్థానానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్నేళ్లుగా తన జీవనశైలిలో మార్పులు చేసుకుని, 20 కిలోలకు పైగా బరువు తగ్గడమే కాకుండా, డయాబెటిస్‌ను కూడా నియంత్రణలో ఉంచుకున్నారు. ఆయన అనుభవాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయి. 2020 మేలో తన జీవనశైలిని మార్చుకోవడం ప్రారంభించినట్లు అమిత్ షా గతంలోనే తెలిపారు. ఈ మార్పుల ఫలితంగా ఆయన ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడింది.

## టిబెట్ భూకంపంలో 16 మంది మృతి - 32మందికి గాయాలు



**లాసా,అక్టోబరు 23:** టిబెట్‌లో భారీ భూకంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ఈ ప్రకృతి విపత్తులో కనీసం 16 మంది మృతి చెందగా, మరో 32 మంది గాయపడ్డారు. వీరిలో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

## సూసైడ్లను నిరోధించే ఫ్యాన్లు!



**గాంధీనగర్, అక్టోబరు 23:** గుజరాత్‌లోని వీర్ నర్మద్ సౌత్ గుజరాత్ యూనివర్సిటీ తమ హాస్టల్ గదుల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఒక కొత్త భద్రతా చర్యను చేపట్టింది. హాస్టళ్లలో ఉరివేసుకొని బలవన్మరణాలకు పాల్పడే ఘటనలను అరికట్టడానికి విశ్వవిద్యాలయ యాజమాన్యం మొత్తం 354 ప్రత్యేక యాంటీ సూసైడ్ ఫ్యాన్లను అమర్చింది. రూ.1,500 వ్యయంతో రూపొందించిన ఈ ఫ్యాన్లలో ప్రత్యేక స్ప్రింగ్ మెకానిజమ్ ఉంటుంది. ఫ్యాన్‌పై సుమారు 10 కిలోల కంటే ఎక్కువ బరువు లేదా ఒత్తిడి పడిన వెంటనే, అందులోని స్ప్రింగ్ ఊడిపోయి ఫ్యాన్ కిందకు దిగుతుంది అంతే కాకుండా దానికి ఉండే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

## సిజెపికి మద్దతిచ్చే ప్రశ్నేలేదు: అన్నామలై

**చెన్నై,అక్టోబరు 23:** కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలపై కేంద్ర ప్రభుత్వ చర్యలను విమర్శించిన మాజీ తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె. అన్నామలై కీలక వ్యాఖ్యలు చేశారు. సీజెపికి తాను మద్దతు ఇచ్చినట్లు భావించొద్దని అన్నారు. మేం ఎప్పటికీ కాక్రోచ్ జనతా పార్టీకి మద్దతు ఇవ్వం, వారి అజెండా వేరు మా అజెండా వేరుఅని అన్నామలై స్పష్టం చేశారు. వీ ద లీడర్స్ ఉద్యమం నిర్వహించిన కార్యక్రమంలో అన్నామలై మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సీజేపీ పద్ధతులతో ఏకీభవించకపోయినా, నిరసన తెలిపే హక్కును సమర్థిస్తున్నట్లు చెప్పారు.

## అమెరికా కాలేజీల్లో తగ్గిన భారతీయ విద్యార్థులు

**వాషింగ్టన్, అక్టోబరు 23:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. గతేడాదితో పోలిస్తే ఆగస్టులో స్టూడెంట్ వీసాలపై భారతదేశం నుంచి యుఎస్‌కు వెళ్లిన విద్యార్థుల సంఖ్య 39 శాతం తగ్గింది. సాధారణంగా ఫాల్ సెమిస్టర్‌కు ముందు విదేశీ విద్యార్థుల చేరిక అత్యధికంగా ఉండే ఈ నెలలో.. వరుసగా వార్షిక క్షీణత నమోదు కావడం గమనార్హం.

24-10Pg6exHMNWJQE:24-10Pg6exHMNWJQE.qxd 10/23/2026 11:21 PM Page 1





# పిడుగు పడి వ్యక్తి మృతి

**రొంపిచర్ల, అక్టోబర్ 23,ప్రభాతవార్త :** పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన సంటన మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం జరిగింది.గ్రామానికి చెందిన పమ్మి గోవిందరెడ్డి (46) సుబ్బారెడ్డి కాలనీలో దగ్గర ఉన్న తన పొలమునకు వెళ్ళుతున్నారు.ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగా, అక్కడ సమీపంలో ఉన్న చెట్టు కింద వెళ్ళారు.ఆ సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు చెట్టు కింద కూర్చుని ఉన్న గోవింద రెడ్డి మీద పడటంతో సృహ కోల్పోయి పడపోయారు.సమీపంలో ఉన్న పొలాల్లో పను లు చేస్తున్న రైతులు, కూలీలు అక్కడికి వచ్చి పిడుగు పడిన ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తీసుకుకెళ్ళుతుండగా మార్గ మధ్యలో మృతి చెందారు.కాగా మృతికి భార్య,ఒక కుమార్తె ఉన్నారు.ఈ సంటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# 26న ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రూబీ జూబ్లీ వేడుకలు

- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ • హాజరుకానున్న గవర్నర్, సిఎం చంద్రబాబు • వర్సిటీ విసి డాక్టర్ పి. చంద్రశేఖర్ వెల్లడి

**విజయవాడ, అక్టోబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోనే తొలి వైద్య విశ్వవిద్యాలయంగా ఏర్పా టైన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రూ బీ జూబ్లీ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిం చనున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స లర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ వెల్లడించారు.నవంబర్ 1, 2026కి యూనివర్సిటీ ఏర్పాటై 40 వసంతాలు పూ ర్తి అయిన సందర్భంగా అక్టోబరు 26 సోమవారం విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలను నిర్వ హిం చనున్నట్లు తెలిపారు.విజయవాడలోని డాక్టర్ ఎన్టీ ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సిల్వర్ జూబ్లీ హాల్ లో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమా వేశంలో రిజిస్ట్రార్ సాయి సుధీర్‌తో కలిసి వైస్ ఛాన్స లర్ వేడుకల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు దూరదృష్టితో 1986లో స్థాపించిన ఈ విశ్వ విద్యాలయం వైద్య విద్యారంగంలో దేశానికే ఆద ర్శంగా నిలిచిందన్నారు. ఎన్టీఆర్‌తో ప్రా రంభమైన ఈ విద్యా సంస్థ నాలుగు దశాబ్దాలు గా వైద్య, ఆరోగ్య విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తూ, అంచెలంచెలుగా విస్తరించిందని పేర్కొ న్నారు.

**ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరు:** అక్టోబరు 26 న ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే రూబీ జూబ్లీ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వైస్ ఛాన్స లర్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీ ర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. నేషన ల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె. రమేశ్ ప్రత్యేక ఆహ్వానితుడిగా హా జరవుతారని వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమ లులో ఉన్న నేపథ్యంలో, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తరఫున గృహ



నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఉపరాష్ట్రపతికి విమానాశ్రయంలో స్వాగతం పలికి వేడుకలకు తీసుకువస్తారని వివరిం చారు.

**580కి పైగా కళాశాలలకు అనుబంధ విశ్వ విద్యాలయం:** ప్రారంభంలో కొద్ది కళాశాలలతో ప్రా రంభమైన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవి ద్యా లయం నేడు 580కి పైగా కళాశాలలకు అనుబం ధంగా కొనసాగుతూ విశేష అభివృద్ధి సాధించిందని డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. విశ్వవిద్యా లయం పరిధిలో 18 ప్రభుత్వ, 20 ప్రైవేట్ వైద్య కళాశాలలు కలిపి మొత్తం 38 మెడికల్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా రెండు ప్రభుత్వ, 15 ప్రైవేట్ డెంటల్ కళాశాలలు, 280కి పైగా నర్సింగ్ కళాశాలలు, సుమారు 95 ఫిజియోథెరపీ కళాశాలలు అనుబంధంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆయుష్ విభాగంలో ఆయుర్వేద, యునానీ, హోమి యోపతి, నేచురోపతి కళాశాలలు కూడా వైద్య విద్యను అందిస్తున్నాయని తెలిపారు.

**40 యేళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్:** విశ్వ విద్యాలయం నాలుగు దశాబ్దాల ప్రస్థానం, సాధించిన విజయాలు, వైద్య విద్యారంగానికి అందించిన సేవలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించనున్నట్లు వైస్ ఛా న్సలర్ వెల్లడించారు. ఈ చారిత్రక వేడుకలకు అనుబంధ కళాశాలల నుంచి వెయ్యి మందికి పైగా వైద్య విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. వేడుకలను విజయ వంతంగా నిర్వహించేందుకు రిసెప్షన్, సావనీర్, ప్రోటోకాల్ తదితర విభాగాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పరిశోధన మరియు అభివృద్ధి విభాగం డైరెక్టర్ (ఇ ది)డా. సూర్య ప్రభ, ప్రచురణల విభాగం డైరెక్టర్ డా. కె. సుధ పాల్గొన్నారు.



# పోక్సో హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**పీలేరు, అక్టోబరు 23 ప్రభాతవార్త:** కె.వి.పల్లి మండలం ఎం.వి.పల్లి పంచాయతీ పరిధిలోని ఎగువ మేకలవారిపల్లికి చెందిన నందకుమార్ రెడ్డి (20)కి పోక్సో హత్య కేసులో చిత్తూరు జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించింది. క్రైమ్ నంబర్ 299/21గా నమోదైన ఈ కేసులో జిల్లా జడ్జి అరుణకుమారి సాగరి తీర్పు వెలువరించారు. ఈ కేసులో న్యాయస్థానం శిక్ష ఖరారు చేయడంతో సంబంధిత ప్రాంతంలో ఈ విషయం చర్చనీయాంశమైంది. ఈ కేసు దర్యాప్తులో అప్పట్లో ఎస్ఐగా పనిచేసిన బాలకృష్ణ కీలకంగా వ్యవహరించారు. కేసుకు సంబంధించిన దర్యాప్తు ప్రక్రియలో ఆయన అందించిన సేవలు ముఖ్యమైనవిగా నిలిచాయి. ప్రస్తుతం కె.వి.పల్లి ఎస్ఐగా పనిచేస్తున్న బి. వెంకట శివకుమార్ కూడా కేసుకు సంబంధించిన పోలీసు ప్రక్రియలో కీలకంగా వ్యవహరించారు. కేసు విచారణ పూర్తయి న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదు విధించిన నేపథ్యంలో, దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను కలకడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న అభినందించారు.

**న్యాయస్థానం తీర్పు:** క్రైమ్ నంబర్ 299/21 పోక్సో హత్య కేసులో చిత్తూరు జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పు ఈ వార్తలో ప్రధానాంశంగా నిలిచింది. న్యాయస్థానం వెలువరించిన తీర్పు మేరకు నందకుమార్ రెడ్డికి జీవిత ఖైదు విధించబడింది. కేసు దర్యాప్తులో భాగస్వాములైన పోలీసు అధికారులను సిఐ లక్ష్మన్న అభినందించారు.

# తుళ్లూరు పిహెచ్‌సిలో ఎసిబి దాడి

- రూ.25 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైద్యాధికారి

తుళ్లూరు, అక్టోబర్23, ప్రభాతవార్త: తుళ్లూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. శుక్రవారం పీహెచ్‌సీ ప్రాంగణంలోనే ఈ దాడి జరిగింది.

**రూ.25 వేలు లంచం డిమాండ్:** అదే ఆసుపత్రిలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు అనే ఉద్యోగి నెల రోజుల పాటు సెలవులో ఉన్నారు. ఈ క్రమంలో ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఆ నోటీసులను క్లియర్ చేసి, సమస్యను పరిష్కరించడానికి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తనకు ఒక నెల జీతం లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ:** వైద్యాధికారి వేధింపులు తట్టుకోలేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ టి.వి.వి. ప్రతాప్ కుమార్, సీఐ కుమ్మరి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం తుళ్లూరు పీహెచ్‌సీలో నిఘా పెట్టింది. బాధితుడి నుంచి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ రూ. 25,000 లంచం తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి రసాయన పరీక్షల అనంతరం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వైద్యాధికారిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని కోరారు

# జోగి మేఘన ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్పందన

**విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** జోగి మేఘన ఘటనపై మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ స్పందించారు. కారు ప్రమాద ఘటనపై జోగి మేఘన మహిళా కమిష న్ ఛైర్‌పర్సన్‌ను సంప్రదించారు. కాగా ఈ ఘట నపై ఇబ్రహీంపట్నం పోలీసులతో శైలజ మాట్లా డారు. జోగి మేఘన, కుటుంబసభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రమాద ఘటనపై విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలని సూచిం చారు. వైఎస్సార్సీపి నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబం తాజాగా ఆయన కోడలు మేఘన అభియోగం చేసింది. ఇటీవల ఆయన కోడలు జోగి మేఘన ప్రయాణిస్తున్న కారు ప్రవ మాదానికి గురికావడం వెనుక కుట్ర దాగి ఉందం టూ ఆమె తండ్రి కృష్ణ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం సంచలనంగా మా రింది. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 15న జోగి మేఘన తన తండ్రి కృష్ణతో కలిసి విజయ వాడ నుంచి తెలంగాణలోని కోదాడ వైపు కారు లో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు తీవ్రంగా దెబ్బతింది. అయితే ఈ ప్రమాదం వెనుక మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రమేయం ఉండవచ్చని మేఘన తండ్రి కృష్ణ అనుమానం వ్యక్తం చేశారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొంటూ ఆయన 16వ తేదీన పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు.గతంలోనే గృహహింస కేసు: ఈ వివా దానికి బల మైన కారణం ఉంది. కేవలం మూడు నెలల క్రిత మే మేఘన తన మామ జోగి రమే శ్, భర్త రాజీ వ్, ఇతర కుటుంబ సభ్యులపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేశారు. అద నపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని, తనను చం పేందుకు కూడా ప్రయత్నించారని ఆమె ఆ ఫిర్యా దులో తీవ్ర ఆరోపణలు చేశారు. తన ప్రా ణాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఆ వివాదం నడు స్తుండగానే ఇప్పుడు కారు ప్రమాదం జరగడంతో, ఇది ఉద్దేశపూర్వకంగా చేయించిన ప్రమాదమేనని మేఘన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీని పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తు న్నారు. అయితే ప్రాథమిక పరిశీలన ప్రకారం ఇది కేవలం ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటన మా త్రమేనని, దీని వెనుక ఎలాంటి ఉద్దేశపూర్వక కు ట్ర లేదని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో అన్ని కోణాల్లోనూ పూర్తిస్థాయి విచారణ జరుపుతామని పోలీసులు తెలిపారు.

## ఆంధ్ర సారస్వత పరిషత్తు

# బాలల కథల పోటీల ఫలితాలు

**అమరావతి, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు భాషా సాహిత్యాలపై బాలల్లో ఆసక్తిని పెంపొందించడం, వారి సృజనాత్మకతను ప్రోత్స హించడమే ధ్యేయంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు, 4వ ప్రపంచ తెలుగు మహాసభలు - బాలలు - 2026 సందర్భంగా నిర్వహించిన బాలల కథల పోటీలకు విశేష స్పందన లభించిందని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకున్న బాలలందరికీ, వారికి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. 6-10 సంవ త్సరాల మొదటి విభాగం విజేతలుగా ప్రధాన బ హుమతుల విజేతలు ప్రథమ బహుమతి రూ. 3,116/, ఎన్.దీప్మిత చిత్తూరు, ద్వితీయ బహు మతి రూ.2,116/ ఈ.వి. రోహిత్ ముతుకూరు, నెల్లూరు, తృతీయ బహుమతి రూ. 1,116/ భవి త పాల్వంచ, ప్రోత్సాహక బహుమతుల విజే త లు స్వాతి అల్మాస్ గూడ, రంగారెడ్డి జిల్లా, డి.వి. సంజన పాల్వంచ, దుర్గా శరణ్య భీమలాపురం, బి. రేణుకా శ్రీ చిత్తూరు,నిహారిక మధురవాడ. 11-16 సంవత్సరాలు రెండవ విభాగంలో పధాన బహుమతుల విజేతలు ప్రథమ బహుమతి రూ.3, 116/, జి.లక్షి నం బూరు, గుంటూరు జిల్లా, ద్వితీయ బహుమతి రూ.2,116/ బి.శర్మ నందు ఒంగోలు. తృతీయ బహుమతి రూ.1,116/ కె. సంధ్య పాతర్లపాడు, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా, ప్రోత్సాహక బహుమతుల విజేతలు రూ.516/ చొప్పున టి.లీలా కాకినాడ. జి.గంగోత్రి దౌల్తాబాద్, సిద్దిపేట జిల్లా, తెలంగాణ, ఎ.గుప్తా హైదరా బాద్.

గీతా లహరి నిజామాబాద్ జిల్లా, తెలంగాణ. టి.భవ్య శ్రీ మంగళగిరి, గుంటూరు. అర్జు న్‌రెడ్డి మొయినాబాద్, రంగారెడ్డి జిల్లా, తెలంగా ణ, కార్తీక ఖమ్మం. లిఖిత ఏ.ఏంజెల్ అక్షిత కాకి నాడ. ఇష్వాని నంబూరు, గుంటూరు జిల్లా విజే తలకు డిసెంబరులో ఒంగోలులో జరుగబోయే బాలల ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై బహుమతి ప్రదానం ఉంటుందని బాలల కథల సమన్వయకర్త మాధవి ధూళిపాళ్ల తెలిపారు.



# నవంబరు 8న దీపావళి ఆస్థానం

**తిరుమల, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** కార్తీకమాసంలో ప్రధానంగా జరుపుకునే దీపాల పండుగ దీపావళి నవంబరు 8వ తేదీ శుక్రవారం తిరుమల ఆలయంలో ఆస్థానం నిర్వహించనున్నారు. ఆ రోజు ఆలయంలోపల బంగారు వాకిలిలో దీపావళి ఆస్థానం వైభవంగా చేపడతారు. మూల విరాట్టుకు కొత్త పట్టు వస్త్రాలు ధరింపజేస్తారు. అనంతరం పెద్ద జీయంగార్, చిన్న జీయంగార్, ఆలయ అర్చకులు, టిటిడి అధికారులు కలిసి ఆలయం లోపల ఉన్న విమాన ప్రాకారం చుట్టూ ఊరేగింపు నిర్వహిస్తారు. బంగారు వాకిలి లోపల గరుడాళ్వార్‌కు ఎదురుగా ఒక ప్రత్యేక పల్లకిలో ఆశీనులైన మలయప్ప స్వామి ఊరేగింపు విగ్రహానికి ఇరువైపులా ఆయన ఇద్దరు దేవేరులను కొలువుదీర్చుతారు. వెంకటేశ్వర స్వామి సేనాధిపతి విశ్వక్సేనులను స్వామివారికి ఎడమ వైపున ఉన్న మరొక ఆసనంపై ఆశీనులను చేస్తారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలను పఠిస్తుండగా, శ్రీవారికి,ఉత్సవమూర్తులకు నూతన పట్టు వస్త్రాలను ధరింపజేసి రూపాయి నాణెం హారతి, ప్రత్యేక హారతితో సహా ప్రత్యేక పూజలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా 8వ తేదీ శుక్రవారం ఆలయంలో జరిగే ఆర్జితసేవ లు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ్, ఆర్జిత బ్రహ్మోత్సవం టిటిడి రద్దు చేసింది. అలాగే టిటిడి అనుబంధ ఆలయాల్లో దీపావళి ఆస్థానం నిర్వహిస్తారు.

# నవంబరు 12న నాగుల చవితి



**తిరుమల, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో దీపావళి ఆస్థానం ముగిసిన నాల్గవరోజు నాగుల చవితి పర్వదినం జరుపుకుంటారు. మంగళవారం సాయంత్రం మలయప్ప స్వామి తన ఇద్దరు దేవేరులతో కలిసి ఏడు పడగల బంగారు సర్ప వాహనమైన పెద్దశేష వాహనంపై నా లుగు మాడ వీధుల్లో విహరిస్తారు. పురాణాల ప్రకారం ఆదిశేషుడు మహా విష్ణుమూర్తి యొక్క గొప్ప భక్తులలో శిష్య సేవకులలో ఒకరిగా పరిగణిం చబడతాడు. భగవంతునికి సర్పరాజుకు మధ్య ఉన్న అనుబంధాన్ని, బం ధాన్ని తెలియజేసే సుమారు ఎనిమిది శాసనాలు కూడా ఉన్నాయి. త్రేతా యుగంలో లక్ష్మణుడు, ద్వాపరయుగంలో బలరాముడు అవతారాలను ఆదిశేషుడు ధరించాడని కూడా నమ్ముతారు.ఆదిశేషుడు వివిధ సందర్భాలలో తన దేవునికి పడకగా, ఆభరణంగా, గొడుగుగా మొదలైన రూపాల్లో సేవ చేస్తాడు. ప్రతి సంవత్సరం తొమ్మిది రోజుల బాటు జరిగే బ్రహ్మోత్సవాల మహోత్సవంలో కూడా స్వామి మొదటి రోజు తొలివాహనంగా పెద్దశేష వాహనాన్ని అధిరోహిస్తాడు. 12వ తేదీ మంగళవారం రాత్రి పెద్దశేషునిపై మలయప్ప భక్తులను కటాక్షించనున్నారు.

# ఆర్టీసి జెఎండితో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల భేటీ

**అమరావతి, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసి జెఎండితో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల భేటీ అయ్యారు. విద్యుత్ బస్సులు ఆర్టీసినే నిర్వహించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. మూసివేసిన 4 డిపోలు తెరిచి 15 వేల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విద్యుత్ బస్సుల పేరిట ఆర్టీసిని ప్రైవేటుపరం చేయవద్దని ఆర్టీసి ఐకాస కోరిన కోరింది. విద్యుత్ బస్సుల టెండర్లు రద్దు చేయాలని ఈనెల 15న ఐకాస నోటీసు ఇచ్చింది.

# రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థకు పలు బాధ్యతలు

**విజయవాడ, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి చట్టం, 2014 (2014 చట్టం నెం. 11) సెక్షన్ 4 ప్రకారం ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థకు ('అధికార సంస్థ లేదా 'ఎపిసిఆర్‌డిఏ)పలు వ్యాపార, ఇతర సంస్థల బాధ్యతలు అప్పగించింది. ఈ పరిధిలో క్రడాకు గుత్తేదారుల ఎంపిక బాధ్యత వర్తిస్తుందని సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు వెంట వ్యాపార సంస్థల కోసం (క్వాంటమ్ వ్యాలీ టవర్లతో సహా) ప్రారంభ కూలింగ్ డిమాండ్ సామర్థ్యం 12,000 టిఆర్ (టన్నేజ్ ఆఫ్ రెఫ్రిజిరేషన్)తో (స్టేజ్ 1 ప్రాజెక్ట్) ఆర్ఇపి / డ్రాఫ్ట్ కన్సెషన్ అగ్రిమెంట్ ప్రకారం గరిష్టంగా 30,000 టిఆర్ సామర్థ్యంతో (భవిష్యత్ స్టేజ్ ప్రాజెక్ట్) డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ అభివృద్ధి బాధ్యతను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పగించింది. కన్సెషన్ అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం చిల్డ్ వాటర్ (చల్లటి నీటి) సరఫరాను పిపిపి ప్రాతిపదికన ప్రాజెక్ట్‌లో పేర్కొన్న అన్ని పనులు, సేవలు దీనికి వర్తిస్తాయి. డిస్ట్రిక్ట్ కూలింగ్ ప్లాంట్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ (రింగ్ మెయిన్) ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్‌తో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ అనేది ఒక డిసిపి, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఇటిపి పరికరాలు, మీటరింగ్ మొదలైనవి). ఇది క్వాంటమ్ వ్యాలీ సీడ్ యాక్సెస్ రోడ్డు వెంట ఉన్న వ్యాపార సంస్థలలో నివాస భవనాలు, వాణిజ్య భవనాలు, సంస్థలు పరిశ్రమల స్పేస్ కూలింగ్ పారిశ్రామిక అవసరాల కోసం ఇన్సులేటెడ్ పైపుల ద్వారా కొంత దూరం వరకు చిల్డ్ వాటర్‌ను పంపిణీ చేస్తుంది. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ లేదా డిసిఎస్ అనేది అనేక వ్యక్తిగత ఎయిర్ కండిషనర్ల స్థానంలో ఒకే కేంద్ర కూలింగ్ ఏర్పాటు చేయడం ద్వారా మెరుగైన ప్రయోజనాలను అందిస్తుంది. మెరుగైన గాలి నాణ్యతకు, విద్యుత్ వినియోగ తగ్గుదల వంటి



ప్రయోజనాలు కలిగిస్తుంది. ఇటిఎస్‌లో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్ కింద భవిష్యత్ ప్రాజెక్ట్‌లను పరిగణలోకి తీసుకుంటూ క్వాంటమ్ టవర్ 1, క్వాంటమ్ టవర్ 2, సీడ్ యాక్సెస్ రోడ్డు వెంట ఉన్న ఇతర వ్యాపార సంస్థలైన బ్యాంకులు, హోటళ్లు, ఆర్థిక సంస్థలు, జిఐఐ సంస్థలు మొదలైనవి డిస్ట్రిక్ట్ కూలింగ్ డిమాండ్‌లో భాగం. ఎపిసిఆర్‌డిఏ చట్టం, 2014 సెక్షన్ 10 దాని సవరణలు (ఏవైనా ఉంటే) కల్పించిన అధికారాల మేరకు, అమరావతి, ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) ప్రాతిపదికన సీడ్ యాక్సెస్ రోడ్డు వెంట ఉన్న వ్యాపార సంస్థల కోసం డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ అభివృద్ధి చేయడానికి బిడ్డర్‌ను ఎంపిక చేసే బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహించాలని ఎపిసిఆర్‌డిఏ నిర్ణయించింది..1.1.2..క్లాజ్ లో నిర్వచించినట్లుగా ఎంపిక చేయబడిన బిడ్డర్, కంపెనీల చట్టం, 2013 లేదా దాని ప్రత్యామ్నాయం కింద నమోదు చేయబడిన కంపెనీ అయి ఉండాలి లేదా కన్సెషన్ అగ్రిమెంట్‌పై సంతకం చేయడానికి ముందే అలా నమోదు చేయించుకోవడానికి అంగీకరించాలి (దీనిని 'కన్సెషనేర్ష్ అంటారు). ఈ కన్సెషనేర్ అధికార సంస్థ మధ్య కుదుర్చుకునే కన్సెషన్ అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం ప్రాజెక్ట్ పనుల రూపకల్పన ఫైనాన్సింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణం, ఆపరేషన్ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తారు. 1.1.3.పని యొక్క పరిధిలో సర్వేలు పరిశోధనలు, డిజైన్, ఇంజనీరింగ్, అనుమతులు, ఫైనాన్సింగ్, ప్రొక్యూర్‌మెంట్, ప్రాజెక్ట్ పనుల నిర్మాణం, క్లాజ్ 1.4లో వివరంగా పేర్కొన్న విధంగా కన్సెషన్ మొత్తం కాలవ్యవధికి ప్రాజెక్ట్ యాజమాన్యం, ఆపరేషన్ నిర్వహణ విస్తరించి ఉంటాయి. 1.1.4. ప్రాజెక్ట్ అభివృద్ధి ఖర్చుల అంచనాను బిడ్డర్లే స్వయంగా వేసుకోవాల్సి ఉంటుంది. 1.1.5 కన్సెషనేర్‌కు కన్సెషన్ మంజూరు చేయడానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు షరతులను కన్సెషన్ అగ్రిమెంట్ నిర్దేశిస్తుంది. ఇందులో కన్సెషనేర్ సేవలు బాధ్యతల పరిధి ('కన్సెషన్') కూడా ఉంటుంది. 1.1.6 ఈ ఆర్ఎఫ్‌పిలోని ప్రకటనలు, వివరణలు బిడ్డర్లకు ఈ ఆర్ఎఫ్‌పిలో విషయాల గురించి మెరుగైన అవగాహన కల్పించడానికి ఉద్దేశించబడ్డాయి. వీటిని కన్సెషన్ అగ్రిమెంట్‌లో పేర్కొన్న కన్సెషనేర్ సేవలు బాధ్యతల పరిధికి అనుగుణంగా లేదా ఇక్కడ ఉన్న నిబంధనలకు అనుగుణంగా పని పరిధిని సవరించడానికి, మార్చడానికి, భర్తీ చేయడానికి లేదా స్పష్టం చేయడానికి అధికార సంస్థకు ఉన్న హక్కులను ఏ విధంగానూ పరిమితం చేసేలా అర్థం చేసుకోకూడదు. ఈ ఆర్ఎఫ్‌పితో సహా బిడ్డింగ్ డాక్యుమెంట్‌లలో ఏవైనా లోపాలు, వైరుధ్యాలు లేదా వ్యత్యాసాలను ఈ ఉద్దేశానికి అనుగుణంగా సరిగ్గా అర్థం చేసుకొని వర్తింపజేయాలి. ఆ కారణంగా ఎటువంటి క్లెయిమ్‌లు అధికార సంస్థ ద్వారా స్వీకరించబడవు. 1.1.7 ఈ ఆర్ఎఫ్‌పి అధికార సంస్థ అందించే ఇతర పత్రాల (సమిష్టిగా 'బిడ్డింగ్ డాక్యుమెంట్‌ల్లు) నిబంధనలకు అనుగుణంగా వాటి ప్రకారం అధికార సంస్థ బిడ్లను స్వీకరిస్తుంది. అన్ని బిడ్లు క్లాజ్ 1.3 లో పేర్కొన్న బిడ్ సమర్పణ తేదీన లేదా అంతకంటే ముందు అటువంటి నిబంధనలకు అనుగుణంగా తయారు చేసి సమర్పించి ఉండాలి.

# స్థానిక ఎన్నికల కోడ్ ఎఫెక్ట్! పూర్తిగా సిఫార్సులేఖలు రద్దు

- గణనీయంగా తగ్గిన విఐపిలు

**తిరుమల, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాల్లో విఐపిల సిఫార్సులేఖలు రద్దుతో గణనీయంగా విఐపిలు రావడం తగ్గింది. ఈ రెండు మూడుగంటల బ్రేక్ సమయం పూర్తిగా సామాన్యభక్తులకే కేటాయిస్తుండటంతో ఉదయం వేళ భక్తులు ఇష్టదైవాన్ని దర్శించుకుని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతిరోజూ దేశవిదేశాల నుండి లక్షమంది వరకు భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. వీరిలో రెండువేల మంది నుండి 3వేల మంది వరకు భక్తులు పూర్తిగా విఐపి బ్రేక్ దర్శనాల సమయంలోనే ఆలయం లోపలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకోవడం విదితమే. గత రెండురోజులుగా ఈ విధానం రద్దుచేయడంతో సాఫీగా సామాన్యభక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల 2వ విడత ఎన్నికలు మొదలైన నేపథ్యంలో కోడ్ అమలులో ఉంది. ఈ కారణంగా రాష్ట్రంలోని తిరుమల ఆలయంతోబాటు అన్ని ప్రధాన ఆలయాల్లోనూ విఐపిల సిఫార్సు లేఖలకు చెక్ పెట్టారు. ప్రజాప్రతినిధుల నుండి ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్, ఇతరత్రా ప్రభుత్వ కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులు, న్యాయవిభాగం నుండి సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదు. కేవలం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే వారి కుటుంబసభ్యులకు శ్రీవారి విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తారు. అసలే స్థానిక ఎన్నికల నియమావళి, ఆపై ఎన్నికల విధుల్లో నిమగ్నమవడంతో అధికారులు కూడా తిరుమలకు చేరుకునే పరిస్థితి లేదు. ఇదే నేపథ్యంలో టిటిడి బోర్డు సభ్యులు సిఫార్సులేఖలు కూడా స్వీకరించడంలేదు. రద్దుచేయడంతో బాగా బ్రేక్ దర్శనాలు తగ్గిపోయాయి. డిసెంబరు 4వ తేదీ వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి. గత రెండురోజులుగా తిరుమలకు కూడా పదుల సంఖ్యలోపే విఐపిలు రావడం విశేషం. అంతేగాక సామాన్యభక్తుల రద్దీ కూడా పెరిగింది. 22వ తేదీ గురువారం అర్ధరాత్రి వరకు 65,113మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా వారిలో నలుగురు మాత్రమే విఐపిలు స్వయంగా వచ్చారు. శుక్రవారం సాయంత్రం వరకు భక్తులు 41వేల మంది మహాలఘులో ఏడుకొండల స్వామిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం కూడా రూ.3.82 కోట్లు చేకూరింది. శుక్రవారం ఉదయానికి 26కంపార్టుమెంట్లలో సామాన్యభక్తులు వేచి ఉండగా సాయంత్రానికి ఈ రద్దీ ఇంచుమించు ఇలాగే ఉందని ఆలయ వర్గాలు సమాచారం ఇచ్చాయి. ఇటీవల ముగిసిన గోవిందుని నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలోనూ దాదాపు భక్తులు వేచివుండే సమయం తగ్గుముఖం పట్టింది. కొన్ని రోజులు నేరుగా ఆలయంలోనికి క్యూలైన్లలో అనుమతించారు.

# కరుణించిన వరుణుడు!



- భారీ వర్షాలకు తిరుమలలో జలాశయాలకు 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ

**తిరుమల, అక్టోబరు 23 ప్రభాతవార్త ప్రతి నిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి రెం డు బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత వరుణదేవుడు కరుణించాడు. గత నాలు గురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయా ల్లో వరదనీరు చేరింది. శుక్రవారం ఉదయానికి అన్ని జలాశయాల్లో 61.68 లక్ష ల గ్యాలన్ల నీటిమట్టం పెరిగింది. ప్రధా నంగా పాపవినాశనం, గోగర్భమ్, ఆకాశ గంగ, కుమారధార, పసుపుధార జలాశ యాలు నీటి వనరులు. శుక్రవారం ఉద యానికి ఈ ఐదు జలాశయాల్లో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగిం చగా, 40.08 లక్షల గ్యాలన్ల నీరు అద నంగా నిల్వ ఉంది.

**-జలాశయాల వారీగా నీటి నిల్వలు:** ఐదు ప్రధాన జలాశయాలు ఉన్నా గోగర్భమ్ డ్యామ్ నుండి తిరుమల పూర్తిగా తాగునీటి అవసరాలకు నీటి సరఫరా జరుగుతుంది. పాపవినాశనం డ్యామ్

**నిల్వ సామర్థ్యం:** 5,240 లక్షల గ్యాలన్లు కగా గత రోజు నిల్వ 2,667.39 లక్షల గ్యాలన్లు. ప్రస్తుత నిల్వ 2,688.35 లక్షల గ్యాలన్లుగా చేరింది.14.10 లక్షల గ్యాలన్లు మిగులు నీరు ఉంది. ఇక గోగ ర్భం డ్యామ్ నిల్వ సామర్థ్యం 2,833.10 లక్షల గ్యాలన్లు కాగా ప్రస్తుత నిల్వ 508.31 లక్షల గ్యాలన్లునీరు ఉంది.

**మిగులు నీరు:** 1.75 లక్షల గ్యాలన్లు నీరు మాత్రమే ఉంది. **ఆకాశగంగ డ్యామ్** నిల్వ సామర్థ్యం 685 లక్షల గ్యాలన్లు కాగా ప్రస్తుత నిల్వ 30.40 లక్షల గ్యాలన్లు నీరు ఉంది. మిగులు నీరు 6.33 లక్షల గ్యాలన్లుఉంది. **కుమారధార డ్యామ్** నిల్వ సామర్థ్యం 4,259.01 లక్షల గ్యాలన్లు కాగా ప్రస్తుత నిల్వ 363.98 లక్షల గ్యాలన్లు నీరు చేరింది. ఈ డ్యామ్‌లో 25.14 లక్ష్లల గ్యాలన్లునీరు మిగిలి ఉంది. **పసుపుధార డ్యామ్** నిల్వ సామర్థ్యం 1,287.54 లక్షల గ్యాలన్లు కాగా ప్రస్తుత నిల్వ 24.38 లక్షల గ్యాలన్లు నీరు. మొత్తం ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీరు పెరిగింది. 21.60 లక్షల గ్యాలన్ల నీరు వినియోగమైంది. ప్రస్తుతం 40.08 లక్షల గ్యాలన్ల నీరు మిగులుగా ఉందని టిటిడి వాటర్‌వర్క్సు విభాగం గణాంకాలు.

**ఆకాశగంగ డ్యామ్** పరిధిలో 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సమయంలో 7.02 లక్షల గ్యాలన్లు, నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో 148.48 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరింది. అక్టోబరు 23 వ తేదీ వరకు మొత్తం 244.46 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరింది. ఇంకా బంగాళాఖాతంలో అల్పపీడనం, తుఫాన్ ప్రభావాలతో శేషాచలంలో పుష్కలంగా వరదనీరు చేరితే జలాశయాలు పూర్తిగా నిండే అవకాశం ఉందని టిటిడి వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు ఎసి బోగీలో మంటలు ఆపివేసిన కో పైలట్

**బాలాయపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త:** తిరుపతి నుండి సికింద్రాబాద్ వెళ్లే కృష్ణ ఎక్స్‌ప్రెస్ బోగీలో పొగలు రావడంతో నిడిగల్లు స్టేషన్ ప్రాంతంలో పైలట్ ఆపేశారు. బి1 ఎసి కోచ్‌లో బ్రేక్ రబ్బరు కాలి మంటలు, పొగ వచ్చినట్లు ప్రయాణికులు గుర్తించి చైను లాగి ఆపివేశారు. లోకో పైలట్ అప్రమత్తమై కొంతసేపు రైలు ఆపారు. దాదాపు గంటసేపు రైలును ఆపి పరిశీలించి మంటలను అదుపు చేసి వెళ్లారు. ఎలాంటి ప్రమాదం లేదని తెలుసుకున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ రైలు నుంచి దిగి పరుగులు తీశారు. ప్రమాదాన్ని ముందుగా గుర్తించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు. వర్షాలు పడ్డ మంటలు రావడం ఆశ్చర్యంగా ఉందని ప్రయాణికులు తెలిపారు.



24-10Pg7exHMNWJQE:24-10Pg7exHMNWJQE.qxd 10/24/2026 12:23 AM Page 1



# ఇంద్రకీలాద్రిపై తగ్గిన భవానీల రద్దీ



**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా కొనసాగుతున్న రద్దీ శుక్రవారం మధ్యాహ్నానికి తగ్గటంతో మధ్యాహ్నం నుండి యథావిధిగా ఆలయ కార్యకలాపాలు కొనసాగాయి. విజయదశమి అనంతరం గత రెండు రోజులుగా పోటెత్తిన భవానీ దీక్షాధారుల రద్దీ ఉదయం వరకు కొనసాగింది. వేలాదిగా విచ్చేసిన భవానీలు ఇరు ముడులు సమర్పించి, అమ్మవారిని దర్శించుకుని తమ దీక్షలను శాస్త్రోక్తంగా విరమించారు. మధ్యాహ్నా సమయానికి భవానీల రద్దీ క్రమంగా తగ్గడంతో సాధారణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం టికెట్లు, లడ్డూ ప్రసాదం, పూజా టికెట్లు, విరాళాల కౌంటర్లు తదితర అన్ని సేవా కౌంటర్లను మధ్యాహ్నం నుండే పూర్తిస్థాయి లో తెరిచి భక్తులకు అందుబాటులో ఉంచాలని ఇఓ అధికారులను ఆదేశించారు. నిత్య అన్నప్ర సాద వితరణ, ఆర్జిత సేవలు, అంతరాలయ దర్శ నాలు నిబంధనల ప్రకారం సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

**- శ్రీ కనకదుర్గ అమ్మవారిసేవలో విఐపిలు:** దుర్గమ్మవారిని శుక్రవారం కేంద్ర అదనపు కార్యదర్శి పంకజ్ కుమార్ బన్సల్, ఎండోమెంట్ కమీషనర్ కె.రామచంద్ర మోహన్ దర్శించుకున్నారు. వారికి ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ శ్రీ అమ్మవారి శేషవస్త్రం,ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేసారు. వేద పండితులు వారికి వేదోక్తంగా ఆశీర్వచనం చేశారు.

# రవి కార్తీక్ బుడిగినకు జగన్ అభినందనలు

**విజయవాడ.అక్టోబరు 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆసియా పారా గేమ్స్‌లో 3 పతకాలు సాధించిన రవి కార్తీక్ బుడిగినను వైఎస్సార్‌సీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. రవికార్తీక్ అద్భు తమైన ప్రతిభతో దేశానికి గర్వకారణంగా నిలిచాడు. పట్టు దల, కఠోర శ్రమ, పోరాట స్ఫూర్తితో యువతకు ఆదర్శంగా నిలిచాడని ప్రశంసించారు. రవి కార్తీక్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని రాష్ట్ర, దేశ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రవికార్తీక్ జపాన్‌లో జరుగుతున్న పారాగేమ్స్‌లో స్విమ్మింగ్ విభాగంలో 2రజతాలు, ఒక కాంస్యం సాధించి సత్తా చాటారు.

# భద్రత ఉంటేనే అభివృద్ధి

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

## అమీన్‌పూర్‌లో ఘనంగా ఎస్‌పిఎఫ్ రైజింగ్ డే వేడుకలు

**హైదరాబాద్, (అమీన్‌పూర్) అక్టోబరు 23, ప్రభాతవార్త:** పటిష్టమైన భద్రత ఉన్నచోటే అభివృద్ధి వుంటుందని డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క అన్నారు. భద్రతా సిబ్బంది ప్రజల్లో భయాన్ని కాకుండా భరోసాను కల్పిస్తూ, ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పటాన్‌చెరులోని అమీన్‌పూర్‌లో గల ఎస్‌పిఎఫ్ అకాడమిలో శుక్రవారం జరిగిన 36వ రైజింగ్ డే వేడుకల్లో బట్టి విక్రమార్క ము ఖ్య అతిథిగా పాల్గొని సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 67 సంస్థలకు రెండు వేల మందికి పైగా ఎస్‌పి ఎఫ్ సిబ్బంది భద్రతా ఇస్తుండడం అభినంద నీయమన్నారు. ప్రభుత్వ సంస్థలు, ప్రజల ఆస్తులు, కీలక వ్యవస్థలకు రక్షణ కల్పించడంలో ఈ విభాగం సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ రాష్ట్ర భద్రతకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఎస్‌పిఎఫ్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. గత 35 ఏళ్లలో భద్రతా రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భద్రతా వ్యవస్థలను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ భద్ర తా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చి దిద్దాలని ఆయన సూచించారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో కీల కంగా వ్యవహరించాలని ఎస్‌పిఎఫ్ సిబ్బందికి బట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పోలీసు సిబ్బంది కుటుంబాల త్యాగాలు మరువలేనివని, ప్రభు త్వ విభాగాలకు నిరంతరం రక్షణ కల్పిస్తూ విధులు నిర్వహిస్తున్న ఎస్‌పిఎఫ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని భట్టి అన్నారు. విధి నిర్వహణలో సిబ్బం ది ఎదుర్కొనే సవాళ్లను అర్థం చేసుకుంటూ, వారికి అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యుల మనోధైర్యం, త్యాగాలను మరువలేమని పేర్కొన్నారు. అంతకు ముందు ఎస్‌పిఎఫ్ సిబ్బంది కవా తుతో పాటు ఆపత్కాలంలో ఎలా వ్యవహరించాలనే దానిపై ప్రదర్శించినిన వి న్యాసాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖాగోయల్, ఎస్‌పిఎఫ్ డిజి స్వాతి లక్రా తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌పిఎఫ్ రైజింగ్ డే వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క నుంచి జ్ఞాపికను అందుకుంటున్న ఎస్‌పిఎఫ్ డిజి స్వాతి లక్రా

# ఎల్‌నినో పరిణామాలపై ప్రజలను చైతన్యపరచాలి

## అన్ని గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

## సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం : సిఎస్ సంజయ్‌జాజు




అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 23, ప్రభాతవార్త :** పసిఫిక్ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలలో చోటుచేసుకున్న మార్పులతో ఏర్పడ్డ ఎల్‌నినో ప్రభావాలు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపైచూపే విపరీత ప్రభావం, తద్వారా తలెత్తే పరిణామాలపై ప్రజలను చైతన్యపరచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు అన్నారు. వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు, తాగునీటి సమస్యలవంటి అంశాలపై ఎల్‌నినో చూపే ప్రభావాలపట్ల ప్రజలకు అవగాహన కల్పించడమేకాక ముందస్తు జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఎల్‌నినో ప్రభావాలు- తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశం పై జిల్లా పౌరసంబంధాల అధికారులు, సాంస్కృతిక సారధి కళాకారులకు నిర్వహించిన ఒక్కరోజు అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా సంజయ్ జాజు హాజరై ప్రసంగించారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థి తులను ఎంతగానో ప్రభావితం చేస్తోందని, వాటిని ఎదుర్కొనేందు ప్రజలకు సమయానుకూలంగా సరైన సమాచారం అందించి అప్రమత్తం చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 20శాతానికిపైగా వర్షపాతం తక్కువగా నమోదై దాదాపు 20శాతం పంట విస్తీర్ణం తగ్గడంతోపాటు సరిపడా ధాన్యం, పశుగ్రాసం తగ్గిందని తెలిపారు.

రిజర్వాయర్లలో నీటినిల్వలు గణనీయంగా తగ్గి కేవలం 30-40శాతం మాత్రమే ఉన్నాయని, రానున్న జూలై మాసం వరకు తాగునీటికి అత్యంత ప్రాధాన్యనిస్తున్నామని విశదీకరించారు. గత 3నెలలుగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం అధికమవుతూ 20వేల మెగావాట్ల వినియోగానికి దారితీసిందన్నారు. ఎల్‌నినో పరిస్థితులపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సమీక్షిస్తూనే ఉన్నారని సంజయ్‌జాజు పేర్కొన్నారు. సమాచార పౌరసంబంధాల, సాంస్కృతిక శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతస్థాయిలో ప్రజా అవగాహన ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలందరికీ ఎల్‌నినో ప్రభావాలు, వాటిని ఎదుర్కొనే ముందస్తు జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు.

ముఖ్యంగా ప్రజలకు నీటిని, విద్యుత్తును అత్యంత పొదుపుగా వాడడం, ఎండల సమయంలో తగినందన నీళ్లుతాగడం, మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా ఉండడం, చిన్నారులు, వృద్ధులు, ఇతర సున్నితవర్గాల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించడంపై ప్రజలకు తెలపాలని చెప్పారు. నీటికొరతను ఎదుర్కొనేందుకు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టడం ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సూచనలు, హెచ్చరికలు నిరంతరం చేరేలా వ్యవసాయ విద్యుత్ పశుసంవర్ధక రెవిన్యూ డిజాస్టర్ మేనేజ్మెంట్ సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచిస్తూ ఎల్‌నినో ప్రభావాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలతోపాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా. జి.ముకుందరెడ్డి, అదనపు సంచాలకుడు డి.ఎస్.జగన్, సంయుక్త సంచాలకుడు కె.వెంకటరమణ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తదితర ప్రభుత్వశాఖ అధికారులు పాల్గొన్నారు.

# మధురవాడ వైపు జాతీయ రహదారిపై యువకుడు అనుమానాస్పద మృతి..

**విశాఖ (క్రైమ్), అక్టోబరు 23 ప్రభాతవార్త:** విశాఖ వ్యాలీ స్కూల్-జూ పార్క్ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మధురవాడ వైపు వెళ్లే మార్గంలో నీలం రంగు ప్లాస్టిక్ గోనె సంచిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి చేతులు, కాళ్లపై గ్రీజు, ఆయిల్ మరకలు ఉండటంతో అతను లారీ క్లీనర్‌గా పనిచేస్తుండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నా రు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడి తలపై తీవ్ర గా యాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే తల ఇరువైపులా, కుడి భుజంపై టైరు గుర్తులు ఉన్నట్లు ప్రాథమిక పరిశీలనలో వెల్లడైంది. రాత్రి సమయంలో దుమ్ము, ధూళి, దోమల నుంచి రక్షణ కోసం ప్లాస్టిక్ సంచిలో కప్పుకుని నిద్రిస్తున్న సమయంలో, తెల్లవారుజామున ఓ ట్రక్కు డ్రైవర్ వాహనాన్ని ముందుకు లేదా వెనక్కి కదిలించే క్రమంలో ప్రమాదవశాత్తు టైరు తలపైకి ఎక్కి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమై, అధిక రక్తస్రావంతో మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.అయితే, మృతికి గల అసలు కారణాలు ఇంకా నిర్ధారణ కాలేదు. గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) ఇచ్చిన నివేదిక ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం పరీక్ష నివేదికతో పాటు ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఆర్ఎఫ్ఎస్ఎల్) నివేదికలను పరిశీలించిన అనంతరం తదుపరి దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.

# రాష్ట్రంలో లంపీ స్కిన్?

## పశువులకు వింత వ్యాధి

**హైదరాబాద్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పశువులకు వింత వ్యాధి వ్యాపిస్తోంది. దీంతో వాటి యజమానులు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా కేంద్రంలో సంచరిస్తున్న ఆవులు, గేదెలు వింత వ్యాధి బారిన పడుతున్నాయి. కొన్ని పశువులకు సోకిన అనారోగ్య సమస్య తీవ్రరూపం దాల్చుతుండటంతో వాటి యజమానులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వింత వ్యాధి సోకిన మూగజీవాలు తీవ్ర నరకం అనుభవిస్తున్నాయి. పశువుల శరీరాలపై పెద్ద పెద్ద బొబ్బలు, పుండ్లు ఏర్పడుతుండటంతో అవి సరిగ్గా మేత మేయలేకపోతున్నాయి. అంతేకాకుండా, నడవడానికి కూడా తీవ్ర ఇబ్బంది పడుతూ రోడ్లపైనే కుదేలవుతున్నాయి. లక్షణాలను బట్టి చూస్తే ఇది ప్రాణాంతకమైన లంపీ స్కిన్ వ్యాధి అయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. జీవాలకు ఈ వ్యాధి సోకడంతో ఇతర ఆరోగ్యకరమైన పశువులకు కూడా ఇది వేగంగా సోకే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వైరస్ మరింత వ్యాప్తి చెందక ముందే అప్రమత్తం కావాలని ప్రజలు కోరుతున్నారు. వెంటనే జిల్లా యంత్రాంగం, వెటర్నరీ బృందాలు స్పందించి వ్యాధిగ్రస్తులైన పశువులకు తక్షణమే ప్రత్యేక వైద్య చికిత్స అందించాలని, నివారణ చర్యలు చేపట్టి మూగజీవాల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# కరవు నివారణకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో సమగ్ర కార్యాచరణ

## నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 23,ప్రభాతవార్త:** కరువును ఎదుర్కొనేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో సమగ్ర కార్యాచరణ అవసరం ఉందని రాష్ట్ర నీటి పారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో కరవు, ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్ సబ్‌కమిటీ తొలి సమావేశం శుక్రవారం జరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు. స్థానిక పరిస్థితులకు అను గుణంగా జిల్లాలవారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలనీ ఆదేశించారు. అత్యవసర చర్యల కోసం కలెక్టర్లకు తగిన నిధులు అందుబాటులో ఉంచాలనీ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. విధానపరమైన ప్రక్రియలతో సహాయక చర్యల్లో జాప్యం జరగకూడదనీ సలహా ఇచ్చారు.నీటిపారుదల, గ్రామీణ తాగునీటి సరఫరా, వ్యవసాయ శాఖల సమన్వయం కీలకమనీ అన్నారు. తాగునీటి సరఫరాను కాపాడుతూ సాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.సమస్యాత్మక ప్రాంతాలు, తలెత్తే నీటి కొరతను ముందుగానే గుర్తించాలని కోరారు, పంటల రక్షణకు సకాలంలో ముందస్తు చర్యలు చేపట్టాలనీ వివరించారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల ప్రజలకు సకాలంలో ఉపశమనం అందాలనీ, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలనీ కోరారు.క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి, సకాలంలో నివా రణ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలో సమస్యా త్మక ప్రాంతాలు, తలెత్తే నీటి కొరత, వ్యవసాయ అవసరాలను అంచనా వేసి, వాటిని ఎదుర్కొ నేందుకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాల న్నారు. కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు నిరంతర సమన్వయంతో పనిచేయాలని పేర్కొ న్నారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు తక్షణమే స్పందించేందుకు అవసరమైన నిధులు వారి వద్ద అందుబాటులో ఉండాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. విధానపరమైన ప్రక్రియల కారణంగా సహాయక చర్యల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నీటిపారుదల, గ్రామీణ తాగునీటి సరఫరా, వ్యవసాయ శాఖలతోపాటు స్థానిక యంత్రాంగం సమన్వయంతో పనిచేసి, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# మద్దతు మించి సోయా ధరలు

## ఎమ్మెస్పీ రూ.5,708 కొనుగోలు రూ.6,800 కల్లాల వద్దకే వ్యాపారులు

**హైదరాబాద్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** తెలంగాణలో సోయా సాగు చేసిన రైతులకు ఈ ఏడాది మార్కెట్‌లో అనుకూల పరిస్థితులు కనిపిస్తు న్నాయి. సోయా రైతులకు ఈ ఏడాది ధరలు పెద్ద ఊరటనిస్తున్నాయి. గతంలో పంట చేతికొచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూడాల్సి వచ్చేది. కేంద్రాలు సరిపడా లేకపోవడంతో రోజుల తరబడి పంటను రోడ్లపై ఆరబోస్తూ, విక్రయాల కోసం రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు నేరుగా రైతుల కల్లాల వద్దకే వచ్చి సోయాను కొనుగోలు చేస్తు న్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే అధికంగా చెల్లిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం క్వింటాకు రూ.5,708 మద్దతు ధర ప్రకటించగా, మహారాష్ట్ర వ్యాపారులు రూ.6,700 నుంచి రూ.6,800 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కల్లాల వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేయడంతో రవాణా, నిల్వ ఖర్చులు తగ్గుతున్నాయి. గతంలో కొనుగోలు కేంద్రాల కోసం వారాల తరబడి ఎదురుచూసిన రైతులకు ప్రస్తుతం త్వరగా విక్రయించే అవకాశం లభిస్తోంది. ఈ ఖరీఫ్ సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 3,72, 424 ఎకరాల్లో సోయా పంట సాగు చేశారు. ప్రధానంగా రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో విస్తరించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 1.80 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంజీరా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సుమారు 70 వేల ఎకరాల్లో, సంగారెడ్డి జిల్లాలో 45 వేల ఎకరాల్లో రైతులు సోయా పండిస్తున్నారు. సాధారణంగా రైతులు ఎకరాకు దాదాపు రూ.15 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. వాతావరణ పరిస్థితులు, పంట నిర్వహణను బట్టి ఎకరాకు సగటున 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.

# రూ.20 కోట్లతో పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధి

## ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 23,ప్రభాతవార్త:** పానగల్‌లోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షణీయమని ఆయన అన్నారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఛాయా సోమేశ్వరా లయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయిలో ఎక్కడ లేని విధంగా వందల ఏళ్ల క్రితమే శిల్పులు కాంతి, నీడ, నిర్మాణ శాస్త్రాన్ని సమన్వయం చేసి శివలింగంపై నిరంతరఛాయ కనిపించేలా నిర్మించిన ఛాయ సోమేశ్వరాలయం తెలంగాణ శిల్ప కళావైభవానికి ప్రాచీన నిర్మాణ విజ్ఞానానికి అద్భుత నిదర్శనమన్నారు.ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు మరింత పర్యాటక ప్రాధాన్యత తీసుకురావ డమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొ

# ఫేక్ పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

## లేకుంటే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను అడ్డుకొంటాం

## రాజధాని రణభేరి సభలో టిఆర్ఎస్ చీఫ్ కవిత

**హైదరాబాద్ (మియాపూర్), అక్టోబరు 23, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఫేక్ అవగాహన ఒప్పందాలతో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలని, డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ముందే వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. లేనిపక్షంలో ఆ సమ్మిట్‌ను అడ్డుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ రాజధాని రణభేరి సభలో ఆమె మాట్లాడారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ సహా మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

తాము కాలక్షేపం కోసం పార్టీ పెట్టలేదని, ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చామని కవిత స్పష్టం చేశారు. అడవిలో ఎన్ని పులులు ఉన్నా వేటాడే పులి ఒక్కటేనని వ్యాఖ్యానిస్తూ, ప్రజా సమస్యలపై పోరాడే శక్తి తమ పార్టీకి ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ వంటిదని, సుమారు నాలుగు వందల ఏళ్ల చరిత్ర కలిగిన నగరాన్ని కాపాడుకోవడంతోపాటు భవిష్యత్తు తరాలకు మరింత మెరుగైన నగరంగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలన్న ప్రతిపాదనలను అంగీకరించలేదని గుర్తుచేశారు. రాష్ట్ర జనాభాలో గణనీయమైన భాగం హైదరాబాద్‌లోనే నివసిస్తున్నం దున, వారి సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

### తాగునీరు, రోడ్లు, డ్రైనేజీపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం

ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం ప్రజలకు కనీస తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేకపోతోందని కవిత విమర్శించారు. పాతబస్తీలో కొన్ని ప్రాంతాల్లో మురికినీరు వస్తోందని, అనేక చోట్ల డ్రైనేజీ నీరు తాగునీటిలో కలుస్తోందని ఆరోపించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించలేని పాలకులు హైదరాబాద్‌ను న్యూయార్క్, లండన్ స్థాయికి తీసుకెళ్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.11 వేల కోట్ల బడ్జెట్ ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేదని మండిపడ్డారు.

గుంతల రోడ్లపై ప్రయాణించే వృద్ధులు, గర్భిణులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ఒకప్పుడు బిర్యానీ, ఇరానీ చాయ్, ముత్యాలకు ప్రసిద్ధి చెందిన హైదరా బాద్ నేడు దోమలు, వీధికుక్కల సమస్యలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. జవహర్‌నగర్ డంప్‌యార్డు పరిసరాల్లో చెత్త నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కాలుష్య సమస్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు. చెత్త సేకరణ వాహనాలతో జీవనోపాధి పొందుతున్న సుమారు 50 వేల మంది కార్మికుల ఉపాధిని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమన్నారు. రామ్‌కీ సంస్థకు సంబంధించిన చెత్త నిర్వహణ కాంట్రాక్టు విషయంలో కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వారి సమస్యలను పరిష్కరించకపోతే ముఖ్యమంత్రి నివాసం ఎదుట చెత్తను పారబోసి నిరసన తెలుపుతామని అన్నారు.

### మూడు కార్పొరేషన్లలో విజయం సాధించడమే లక్ష్యం

త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ సహా మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో టీఆర్ఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యమని కవిత స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించగలమనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని అన్నారు. పార్టీ కొత్తగా ఏర్పడిన నేపథ్యంలో ఇతర పార్టీలతో పోలిస్తే మరింత కష్టపడి పనిచేయాలని, ప్రతి గల్లీలో పార్టీ విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూడా సిద్ధం కావాలని పిలుపునిచ్చిన కవిత, తమ పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీకాంత్ గౌడ్‌కు నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం, నగరాభివృద్ధి, యువతకు ఉపాధి, మహిళల సాధికారత లక్ష్యంగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు



రాజధాని రణభేరి సభలో పాల్గొన్న టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

# వన్డేల్లో భారీ రన్ ఛేజ్‌స్

**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్‌లో అరుదైన భారీ రన్ ఛేజస్ నమోదవుతున్నాయి. వన్డేల్లో 400కు పైగా పరుగులు చేయడం అంటే మమూలు విషయం కాదు. అలాంటిది ప్రత్యర్థి జట్టు అంతకంటే ఎక్కువ లక్ష్యాన్ని ఛేదించి గెలిస్తే అది చరిత్రలో నిలిచిపోతుంది. ఈ నెల 22న రావల్పిండిలో ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే ట్రై సిరీస్ మ్యాచ్‌లో శ్రీలంక ఇదే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 429 పరుగులు చేసింది. లక్ష్యం 430 పరుగులు కాగా, శ్రీలంక 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 430 పరుగులు సాధించింది. రెండు వికెట్ల తేడాతో గెలిచి వన్డేల్లో రెండో అత్యధిక విజయవంతమైన రన్ ఛేజ్‌ను నమోదు చేసింది. ఇక వన్డే క్రికెట్‌లో ఇప్పటికీ అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా సౌతాఫ్రికా నిలిచింది. 2006 మార్చి 12న ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 435 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. తొలుత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 4 వికెట్లకు 434 పరుగులు చేసింది. సౌతాఫ్రికా 49.5 ఓవర్లలో 9 వికెట్లకు 438 పరుగులు చేసి ఒక్క వికెట్ తేడాతో గెలిచింది. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30న వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో భారత్ 406 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 405/7 స్కోరు సాధించింది. తదుపరి భారత్ కేవలం 43.3 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. అలాగే 2023 జూన్ 26న వెస్టిండీస్, నెదర్లాండ్స్ మధ్య వన్డే కూడా చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది. తొలుత వెస్టిండీస్ 374/6 పరుగులు చేసింది. 375 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నెదర్లాండ్స్ 50 ఓవర్లలో 374/9 స్కోరు చేయడంతో మ్యాచ్ టై అయింది. దీంతో ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించారు. అందులో నెదర్లాండ్స్ అద్భుతంగా ఆడి విజయం సాధించడంతో ఈ ఛేజింగ్ వన్డే చరిత్రలో గుర్తుండిపోయింది. 2016 అక్టోబర్ 5న ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేలో దక్షిణాఫ్రికా మరో భారీ ఛేజింగ్ నమోదు చేసింది. తొలుత ఆస్ట్రేలియా 371/6 పరుగులు చేసింది. 372 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లకు 372 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా నాలుగు వికెట్ల తేడాతో గెలిచి అప్పటి వరకు ఉన్న అత్యధిక రన్ ఛేజ్ రికార్డుల జాబితాలో మరో మైలురాయిని జోడించింది.




## టాప్ సెకండ్‌లో భారత్

# హార్విందర్ సింగ్, విజయ్ జోడీకి స్వర్ణం




## పూజ-భావన ద్వయానికి రజతం

## టేబుల్ టెన్నిస్‌లో మదన్-శుభమ్‌లకు కాంస్యం

**ఒకాజాకి:** పారాలింపిక్ ఛాంపియన్ హార్విందర్ సింగ్-విజయ్ పురుషుల రికర్వ్ డబుల్స్‌లో స్వర్ణం కైవసం చేసుకోగా, మహిళల విభాగంలో పూజ-భావన ద్వయం రజతంతో సరిపెట్టుకున్నారు. శుక్రవారం జరిగిన పురుషుల ఫైనల్‌లో హార్విందర్-విజయ్, చైనాకు చెందిన జావో లిక్సు-యున్ డువోలను 5-1 తేడాతో ఓడించారు. తొలి సెట్‌లో ఇరు జట్లు 35 పాయింట్లు సాధించి పాయింట్లను పంచుకున్నాయి. ఆ తర్వాత రెండో సెట్‌లో చైనా 36 పాయింట్లతో పోలిస్తే భారత్ 37 పాయింట్లు సాధించి 3-1 ఆధిక్యం సంపాదించింది. మూడో సెట్‌లో హార్విందర్, విజయ్ 38 పాయింట్లు సాధించగా, వారి చైనా ప్రత్యర్థులు 36 పాయింట్లు మాత్రమే సాధించగలిగారు. మహిళల రికర్వ్ డబుల్స్ ఫైనల్లో పూజ-భావనలు పోటీలో ఆధిపత్యం చెలాయించిన చైనాకు చెందిన వాంగ్ జుకియాన్-గావో జిహాన్‌ల చేతిలో 0-6 తేడాతో ఓడిపోయి రజతంతో సరిపెట్టుకున్నారు. తొలి సెట్‌లో భారత జోడీ 31 పాయింట్లకు గాను 38 పాయింట్లు సాధించగా, రెండో సెట్‌లో భారత జోడీ 30 పాయింట్లకు గాను 35 పాయింట్లు సాధించింది. మూడో సెట్‌లో 39 పాయింట్లతో వారు విజయాన్ని పూర్తి చేసుకోగా, భారత ఆర్చర్లు 29 పాయింట్లే సాధించగలిగారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్ మరో పతకాన్ని తృటిలో కోల్పోయింది. కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో హార్విందర్-భవానా జోడీ ఇరాన్ చేతిలో ఓడిపోయింది. నాలుగు సెట్ల తర్వాత ఇరు జట్లు 4-4తో సమంగా నిలిచాయి. షూట్‌ఆఫ్‌లో కూడా 18-18తో స్కోరు సమమైంది. లక్ష్యం మధ్య భాగానికి దగ్గరగా బాణాలు సంధించడంతో ఇరాన్ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే పురుషుల డబుల్స్ పారా టేబుల్ టెన్నిస్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన జెహాన్ మదన్-శుభమ్ వాధ్వా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఒక మ్యాచ్ గెలిచి, మూడు ఓడిపోయిన ఈ జోడీ గ్రూప్ ఎలో నాలుగో స్థానంలో నిలిచింది. పోటీ ఫలితాల్లో వీరికి కాంస్య పతకం లభించినట్లు వెల్లడైంది.







### ఆసియా పారా గేమ్స్..

## మోనాకు రెండో స్వర్ణం



**టయోటా:** ఐచి ప్రిఫెక్చు రల్ జనరల్ షూటింగ్ గ్యాలరీలో శుక్రవారం జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో, మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పి భారత పారా షూటర్ మోనా అగర్వాల్ తన రెండవ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో మోనా ప్రపంచ రికార్డు స్థాయిలో 357.5 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, ఆమె సహచరి అవని లేఖర 333.2 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. మోనా 566-17న స్కోరుతో ఆరో స్థానంలో క్వాలిఫై అయి ఫైనల్‌కు ప్రవేశించింది.
మరోవైపు, అవని 580-24న స్కోరుతో క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచి, ఆసియా పారా గేమ్స్ క్వాలిఫికేషన్ రికార్డును నెలకొల్పింది. అర్హత ర్యాంకింగ్‌లో తక్కువ స్థానం పొందినప్పటికీ, మోనా ఫైనల్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఆమె మోకాళ్లపై జరిగిన మొదటి సిరీస్‌లో 101.4, బోర్లా పడుకుని జరిగిన మొదటి సిరీస్‌లో 102.1 స్కోర్ సాధించి, ఆ తర్వాత నిలబడి జరిగిన రౌండ్లలో తన సంయమనాన్ని కాపాడుకుంటూ స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఈవెంట్‌లో మోనా సాధించిన విజయానికి ఈ విజయం తోడైంది. ఆ ఈవెంట్‌లో ఆమె ఇప్పటికే 250 పాయింట్ల ఆసియా పారా గేమ్స్ రికార్డు స్కోరుతో స్వర్ణం గెలుచుకుంది. ఆ ఈవెంట్‌లో అవని 249.6 పాయింట్లతో రజతం సాధించింది.



## నవీన్, నితేష్, హేనీ, సందీప్‌లకు 4 స్వర్ణాలు




## నిత్య, తులసి, నిమిషలకు 3 రజతాలు

**నగోయా:** శుక్రవారం ఐచినగోయాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో భారతానికి చెందిన నవీన్ శివకుమార్, నితేష్ కుమార్ వరుసగా పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3, ఎస్ఎల్4 విభాగాలలో స్వర్ణ పతకాలను గెలుచుకోగా, నిత్యా శ్రీ సుమతి శివన్, తులసి మురుగేశన్ మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో రజత పతకాలను సాధించారు. ఇద్దరు పారా ఒలింపిక్ ఛాంపియన్‌ల మధ్య జరిగిన ఆల్ ఇండియన్ ఫైనల్‌లో నితేష్ తన స్వదేశీయుడైన ప్రమోద్ భగత్‌ను 21-18, 21-16 తేడాతో ఓడించి స్వర్ణం దక్కించుకున్నాడు. అలాగే పురుషుల సింగిల్స్ నవీన్ శివకుమార్, ఇండోనేషియాకు చెందిన ఫ్రెడీ సెటియావాన్‌ను 21-9, 21-17 తేడాతో ఓడించి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. 36 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో, నవీన్ ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించి వరుస గేమ్‌లలో విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ ఎస్‌యు5 ఫైనల్‌లో చైనాకు చెందిన యాంగ్ చేతిలో 18-21, 11-21 తేడాతో ఓడిపోయిన తర్వాత తులసి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల సింగిల్స్ ఎస్‌హెచ్6 ఫైనల్‌లో చైనాకు చెందిన లీ ఫెంగ్‌మే చేతిలో 12-21, 13-21 తేడాతో ఓడిపోయిన నిత్యా శ్రీ సుమతి శివన్ రజత పతకంతో సరిపెట్టుకుంది. హేనీ, సందీప్ వరుసగా పురుషుల జావెలిన్ త్రో ఎఫ్37/38, 400 మీటర్ల టి64 ఈవెంట్లలో రికార్డులు బద్దలుకొట్టి స్వర్ణ పతకాలు సాధించారు. హేనీ 60.49 మీటర్ల త్రోతో జావెలిన్‌లో స్వర్ణం సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పగా, సందీప్ 52.28 సెకన్లలో స్వర్ణం గెలుచుకుని ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఇక మహిళల లాంగ్ జంప్ టి47లో రజత పతకం సాధించడం ద్వారా నిమిష ఈ ఈవెంట్లలో భారతదేశ పతకాల పట్టికను పూర్తి చేసింది. ఆమె 5.37 మీటర్ల అత్యుత్తమ జంప్‌తో 818 రజా పాయింట్లను సంపాదించింది.







### ఆసియా ఛాంపియన్‌షిప్..

## హార్మీత్-యశస్విని జోడీకి పతకం ఖాయం



**తాష్కెంట్:** తాష్కెంట్‌లో జరుగుతున్న ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో భారత జంట హార్మీత్ దేశాయ్-యశస్విని ఘోర్పడే మిక్స్‌డ్ డబుల్స్‌లో కనీసం కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. శుక్రవారం తాష్కెంట్‌లో జరిగిన హోరాహోరీ క్వార్టర్ ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన పార్క్ గ్యాంగ్ హ్యోన్, లీ డేయున్‌లను 3-2 తేడాతో ఓడించి భారత జోడీ ఫైనల్‌కు చేరుకుని పతకాన్ని ఖాయం చేసుకుంది. ఈ విజయం భారత టేబుల్ టెన్నిస్ చరిత్రలో ఒక ప్రధాన మైలురాయి. 72 యేళ్లలో తొలిసారిగా ఖండాంతర ఛాంపియన్‌షిప్‌లలో దేశం మిక్స్‌డ్ డబుల్స్ పతకాన్ని సాధించింది. ఈ ఈవెంట్‌లో భారతదేశానికి చివరి పతకం 1954లో లభించింది. మరో భారత జంట, పయాస్ జైన్ మరియు సింద్రెలా దాస్, మెడల్ రౌండ్‌కు చేరుకోవడంలో విఫలమైన తర్వాత ఈ విజయం లభించింది. వారు తమ క్వార్టర్ ఫైనల్‌లో చైనాకు చెందిన యి చెన్ మరియు హువాంగ్ యుజెంగ్‌ల చేతిలో 0-3 తేడాతో ఓడిపోయారు.

# నాలుగో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



వాణిజ్యం

**ముంబయి, అక్టోబరు 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రమవడం, విదేశీ పెట్టుబడిదారుల నుంచి నిరంతరంగా నిధులు వెనక్కి వెళ్లడం వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 125.56 పాయింట్లు తగ్గి 72,123.83 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50సూచీ 87.65 పాయింట్లు నష్టపోయి 22,600 వద్ద ముగిసింది. నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 3.49 శాతం, నిఫ్టీ 2.36 శాతం చొప్పున పడిపోయాయి. వినియోగ వస్తువులు, మెటల్స్, రియల్టీ, ఎనర్జీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ భారీగా అమ్మకాలు చోటు చేసుకున్నాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 2.10 శాతం తగ్గగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 2.68 శాతం క్షీణించింది. శ్రీరామ్ ఫైనాన్స్ 3.98 శాతం నష్టపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.46 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.18 శాతం తగ్గాయి. ఎన్ఎస్ఈలో 623 షేర్లు లాభాల్లో ముగియగా, 3,011 షేర్లు నష్టాలను చవిచూశాయి. మరో 90 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. స్టెర్లైట్ టెక్నాలజీస్ 2.39 శాతం పెరిగింది. రాలీస్ ఇండియా 5.21 శాతం తగ్గింది. స్విగ్గీ16.75 శాతం భారీగా పతనమైంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధరలు పెరిగాయి. డిసెంబర్ 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 1.23 డాలర్లు లేదా 1.09 శాతం పెరిగి 114.40 డాలర్లకు చేరింది. భారత ప్రభుత్వ పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్ ఈల్డ్ 0.08 శాతం తగ్గి 7.456 శాతానికి చేరింది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇది 7.462 శాతంగా నమోదైంది. విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి విలువ 94.9450 వద్ద కొనసాగింది. గత సెషన్‌లో ఇది 94.8100 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో డిసెంబర్ 4, 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ ధర 0.42 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,42,700 వద్ద నమోదైంది.

# ఇన్ఫోసిస్ నికరలాభం రూ.7823 కోట్లు



**బెంగళూరు, అక్టోబరు 23:** భారతీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థికసంవత్సరం రెండో త్రైమాసిక ఆర్థికఫలితాలను శుక్రవారం ప్రకటించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికం లో కంపెనీ నికర లాభం గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 6 శాతం మేర వృద్ధి చెంది రూ.7823 కోట్లకుచేరింది. గ్లోబల్ మ్యాక్రో ఎకనామిక్ సవాళ్లు ఉన్నప్పటికీ లాభాల్లో స్థిరమైన ప్రదర్శన కనబరిచిన కంపెనీ, రాబోయే త్రైమాసికాల మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వార్షిక రెవెన్యూ అంచనాలను తగ్గించడం గమనార్హం. అలాగే తమ షేర్ హోల్డర్లకు శుభవార్త చెబుతూ మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కంపెనీ ఆదాయం ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన 11 శాతం మేర పెరిగి రూ.49,244 కోట్లకు చేరినట్లు తెలిపింది. గతేడాది రెండో త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే ఈసారి లాభం 6 శాతం మేర పెరిగింది. ఐటీ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల విభాగంలో స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ ఆపరేటింగ్ మార్జిన 2022 శాతం గా ఉన్నట్లు తెలిపింది. ఈత్రైమాసికానికి సంబంధించి ఆదాయం విషయంలో వచ్చిన ఫలితాలు మార్కెట్ అంచనాలకు అనుగుణంగానేఉన్నాయి. అయితే లాభాల వృద్ధి మాత్రం అంచనాల కంటే తక్కువగా నమోదైంది. ఏడు బ్రోకరేజ్ సంస్థల అంచనాల సగటు ప్రకారం ఈ త్రైమాసికంలో ఆదాయం 11 శాతం, నికర లాభం 8 శాతం పెరుగుతాయని భావించారు. ఇక త్రైమాసికాల ప్రాతిపదినక చూసుకుంటే క్యూ1తో పోలిస్తే కంపెనీ నెట్ ప్రాఫిట్ 0.7 శాతం పెరిగింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.7,769 కోట్లుగా ఉంది. ఇక కంపెనీ రెవెన్యూ పరంగా చూస్తే క్యూ1లో రూ.48,211 కోట్లతో పోలిస్తే 2 శాతం మాత్రమే పెరిగింది. క్యూ2 ఫలితాల సందర్భంగా తమ షేర్ హోల్డర్లకు ఇన్ఫోసిస్ మధ్యంతర డివిడెండ్ చెల్లిస్తామని తెలిపింది. ఒక్కో షేరుకు రూ.26 చొప్పున మధ్యంతర డివిడెండ్ నేరుగా షేర్‌హోల్డర్ల ఖాతాల్లో జమచేయనున్నట్లు పేర్కొంది. అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించేందుకు రికార్డ్ తేదీని నవంబర్ 3గా నిర్ణయించినట్లు వెల్లడించింది. ఆ తేదీలోపు షేర్లు కొనుగోలు చేసి డీమ్యాట్ ఖాతాలో కలిగి ఉన్న వారికి అర్హత లభించి షేర్ ధర పెరుగుదలతో సంబంధం లేకుండా ఎన్ని షేర్లు ఉంటే అన్ని రూ.26 చొప్పున నేరుగా బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

# భారత్ కార్పొరేట్ చరిత్రలోనే మెగా ఐపిఒ

### 19.75 కోట్ల షేర్లకు 156.58 కోట్ల బిడ్లు దాఖలు

### జియో ఐపిఓకు దేశవిదేశీ సంస్థల నుంచి భారీ స్పందన




**ముంబయి, అక్టోబరు 23:** భారత కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచిన జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ, సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. కోటికి పైగా దరఖాస్తులు అందుకున్న ప్రపంచంలోనే తొలి ఐపీఓగా ఇది చరిత్ర సృష్టించింది. శుక్రవారం బిడ్డింగ్ గడువు ముగిసే సమయానికి, అన్ని విభాగాల ఇన్వెస్టర్ల నుంచి అపూర్వ స్పందన లభించింది. దేశ చరిత్రలోనే భారీ ఐపీఓగా పేరొందిన ఈ రూ. 30,213 కోట్ల ఇష్యూ కోసం ఇన్వెస్టర్లు పోటెత్తారు. ఈనెల 21న ప్రారంభమైన ఈ ఇష్యూ, కేవలం 100 నిమిషాల్లోనే పూర్తిస్థాయిలో సబ్‌స్క్రయిబ్ కావడం విశేషం. ముగింపు రోజు మధ్యాహ్నానికే దరఖాస్తుల సంఖ్య కోటి మార్కును దాటింది. గతంలో వారీ ఎనర్జీస్ పేరిట ఉన్న సుమారు 97 లక్షల దరఖాస్తుల రికార్డును జియో సునాయాసంగా అధిగమించింది. శుక్రవారం సాయంత్రానికి మొత్తం దరఖాస్తుల సంఖ్య కోటిని మించిపోయింది. మొత్తం 19.75 కోట్లషేర్లను విక్రయానికి ఉంచితే మధ్యాహ్నానికే 156.58 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అందుబాటులో ఉన్న షేర్ల కంటే ఆరు రెట్లకు పైగా డిమాండ్ నమోదైంది. ఈ పబ్లిక్ ఇష్యూ ప్రారంభానికి ముందే, యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ. 8,110 కోట్లు సమీకరించింది. ఈ విభాగానికి ఏకంగా 30 రెట్లకు పైగా డిమాండ్ లభించింది. అంటే, దాదాపు రూ. 2.5 లక్షల కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, బ్లాక్‌రాక్, ఫిడిలిటీ వంటి అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన సంస్థలు ఇందులో పెట్టుబడులు పెట్టాయి. పబ్లిక్ ఇష్యూలో క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ) కోటా 14 నుంచి 20 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 9 నుంచి 14.46 రెట్లు, రిటైల్ విభాగం సుమారు 2.02 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉద్యోగులు, వాటాదారుల కోటాలు కోసం కేటాయించిన కోటాలు కూడా పూర్తిస్థాయిలో భర్తీ అయ్యాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్‌కు చెందిన జియో ప్లాట్‌ఫామ్స్, ఆకాష్ అంబానీ సారథ్యంలో కొనసాగుతోంది. ఇప్పటికే 50 కోట్లకు పైగా మొబైల్ వినియోగదారులతో దేశంలోనే అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా ఉన్న ఈ సంస్థలో గూగుల్, మెటా వంటి దిగ్గజ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులతో కంపెనీ తన కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. షేర్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసి, 28న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### టాటా మోటార్స్‌కు క్యూ2లో భారీ లాభాలు

# రూ.2,138 కోట్ల నికర లాభం!




**ముంబయి, అక్టోబరు 23:** టాటా మోటార్స్‌కు చెందిన కమర్షియల్ వెహికల్స్ విభాగం రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలు సాధించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,021 కోట్ల నికర నష్టాన్ని చవిచూసిన సంస్థ ఈసారి రూ.2,138 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంచనాలకు మించి రూ.1,933 కోట్ల లాభం కంటే ఈ ఫలితం ఎక్కువగా ఉండటం విశేషం. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం గత ఏడాది ఇదే కాలంలోని రూ.16,861 కోట్ల నుంచి 41.9 శాతం పెరిగి రూ.23,930 కోట్లకు చేరుకుంది. నిర్వహణ పరంగా చూస్తే, ఈబీఐటీడీఏ 31.1 శాతం వృద్ధితో రూ.2,077 కోట్ల నుంచి రూ.2,723 కోట్లకు పెరిగింది. ఈబీఐటీడీఏ మార్జిన్ మాత్రం గత ఏడాది 12.3 శాతంగా ఉండగా, ఈసారి 11.4 శాతానికి తగ్గింది. త్రైమాసికంలో టాటా మోటార్స్ దేశీయ, ఎగుమతి వాహన విక్రయాల పరిమాణాలు గత ఏడాదితో పోలిస్తే వరుసగా 30 శాతం, 177 శాతం పెరిగాయి. ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో దేశీయ వాణిజ్య వాహనాల మార్కెట్ వాటా 36.2 శాతానికి చేరినట్లు కంపెనీ వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 110 బేసిస్ పాయింట్ల వృద్ధి. ఈ త్రైమాసికంలో ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల లీజింగ్, ఫైనాన్సింగ్ పరిష్కారాల కోసం డ్రివ్న్ సంస్థతో టాటా మోటార్స్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే, ఉపయోగించిన ఆయిల్‌ను రీసైకిల్ చేసే విస్తరించదగిన నమూనాను ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు పెట్రోనాస్‌తో కలిసి పనిచేయనుంది. వెల్‌స్పన్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి 86 మెగావాట్ల పవనసౌర హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు కూడా భాగస్వామ్యం కుదుర్చుకుంది. త్రైమాసిక ఫలితాలపై టాటా మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గిరీష్ వాఘ్ మాట్లాడుతూ, ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం స్థిరమైన, లాభదాయకమైన త్రైమాసికంగా నిలిచిందన్నారు. హోల్‌సేల్ వాహన విక్రయాలు 42 శాతం పెరిగాయి. వివిధ విభాగాల్లో నమోదైన విస్తృత వృద్ధి మార్కెట్‌లో అంతర్లీన డిమాండ్ బలంగా ఉందని, మా అమలు వ్యూహాలు సమర్థవంతంగా ఉన్నాయని సూచిస్తోందని తెలిపారు.

# ఇండో బ్రిటన్ ఒప్పందంతో

### దేశీయ విస్కీకి విదేశీ బ్రాండ్‌ల షాక్..

### దేశీయ మార్కెట్‌కు వెల్లువలా ఫారిన్ విస్కీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:** ప్రపంచ స్కాచ్ విస్కీ మార్కెట్‌లో భారత్ సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఇప్పటికే పరిమాణం పరంగా అగ్రస్థానంలో ఉన్న మన దేశం, త్వరలోనే విలువ పరంగా కూడా ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుందని స్కాచ్ విస్కీ అసోసియేషన్ అంచనా వేసింది. అగ్రరాజ్యం అమెరికాను కూడా భారత్ అధిగమించనుంది. భారత్‌యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ), దేశంలో ప్రీమియం మద్యం ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్ ఈ మార్పునకు ప్రధాన కారణా లుగా నిలుస్తున్నాయి. భారత్‌యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జులై 15 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా స్కాచ్ విస్కీ దిగుమతులపై ఉన్న 150 శాతం కస్టమ్స్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం ఏకంగా సగానికి, అంటే 75 శాతానికి తగ్గించింది. రాబోయే పదేళ్లలో ఈ సుంకాన్ని దశలవారీగా 40 శాతానికి తగ్గించనున్నారు. కొన్ని బ్రాండ్ల ధరలు 6 నుంచి 15 శాతం వరకు తగ్గినటు తెలుస్తోంది. 2025లో భారత్‌కు స్కాచ్ విస్కీ ఎగుమతుల విలువ 286 మిలియన్ పౌండ్లు అంటే సుమారు రూ.3,614 కోట్లుగా ఉంది. ఇది దాదాపు 220 మిలియన్ బాటిళ్లతో సమానం. ప్రస్తుతం విలువ పరంగా చూస్తే అమెరికా, ఫ్రాన్స్ తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా కొనసాగుతోంది. దిగుమతి సుంకాల తగ్గింపుపై భారత ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీల సమాఖ్య ఆందోళన వ్యక్తం చేస్తోంది. దేశీయ, విదేశీ ఉత్పత్తుల మధ్య సమానమైన పోటీ ఉండేలా పన్నుల విధానంలో సమానత్వం పాటించాలని డిమాండ్ చేస్తోంది. కేవలం దిగుమతి సుంకం తగ్గించినంత మాత్రాన తుది ధర పూర్తిగా తగ్గదని,రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులు, పంపిణీ ఖర్చులు, రిటైలర్ల మార్జిన్‌లు కూడా తుది ధరను నిర్దేశిస్తాయని స్పష్టం చేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

24 -10 Pg9th cheli:24 -10 Pg9th cheli.qxd 10/23/2026 11:31 PM Page 1

వార్త, శనివారం 24, అక్టోబరు 2026

చెలి

ఫ్యాషన్ ఫ్యాషన్

# పట్టే.. పట్టు ! అదిరేట్టు !





. ముచ్చటపడి వేసుకునే సంప్రదాయ దుస్తులేవని ఏ అమ్మాయినైనా అడగండి చీర, పరికిణీ ఓణీలు పేర్లే చెప్పేస్తారు. పట్టువైతే మరీ మరీ ఇష్టంగా వేసుకుంటారు. అమ్మ, బామ్మలనాటి చీరలను ముచ్చటపడి లంగా ఓణీగా కుట్టించుకుని మురిసిపోయేవారూ ఎక్కువే ఎంత ఇష్టమైతేనేం... వేసుకునేది మాత్రం అరుదుగానేగా! ఒకసారి వేషమంటే 'అరెరే మొన్నేగా ఫలానా ఫంక్షన్‌కి వేశా' మని పక్కన పెడతాం.అందుకే ఎన్నేళ్లయినా అలా ఎదురుచూస్తూ బీరువాలో దాగి ఉంటాయవి. అలాంటి వాటికీ మోడరన్ టచ్ ఇస్తున్నారు బహుమతులు, పట్టుని లాంగ్ ఫ్రాస్‌లుగా తీసుకురావడం మనకు తెలిసిన సంప్రదాయ వస్త్రంగా అది కబోర్డులోనే దాగొద్దని కొత్త హంగులు అద్దేస్తున్నారు. లాంగ్‌కోనే రెండు మూడు రకాలుగా వేసుకునేలా చేస్తున్నారు. కోట్, లెహంగా, ఓణీలా మార్చుకునేలా రూపొందిస్తున్నారిలా. సందర్భాన్నిబట్టి డ్రెస్‌ని డిసైడ్ చేసుకోవచ్చన్నమాట. నిన్న, మొన్ననే చేసుకున్నామన్న సాకులూ అడ్డుకావు. చిన్న మాయతో డ్రెస్ రూపం మార్చేస్తూ వేసుకునే ఈ వీలు భలేగుంది కదూ! ఇంకేం మెచ్చిన పట్టును నచ్చిన రీతిలో డిజైన్ చేసుకోండి








# దివ్యకాంతుల దీపావళి

### చీకటి వెలుగుల రంగేళి ఈ జీవితమే ఒక దీపావళి !

నిజంగా నిజం. అందుకేనేమో మన దైన అసలు సిసలు 'దీపావళి'ని రంగవల్లిగా తీర్చిదిద్దేందుకు భారతీయ డిజైనర్ సంగీత భుటిడా రూపకల్పన చేసింది. తనది కాకపోయినా భారతీయ సంస్కృతీ సంరంభాలతో కళాకాంతులు సమకూర్చే 'దీపావళి' పండుగపై దీపకాంతులతో కళాత్మకంగా అలంకరించబడిన డిజైన్‌తో అమెరికన్ పోస్టర్ సర్వీస్ 'దీపావళి ఫర్ ఎవర్' స్టాంప్‌ను గురువారం ఆవిష్కరించింది. దీపాల పండుగను ఘనంగా జరుపుకోండన్న స్ఫూర్తిని కలుగ చేసుకొమ్మను సందేశం కూడా అందులో ఇమిడి ఉంది.

# రాజువయ్యా ! రాజసం నీదేనయ్యా !



పిల్లలు పుట్టగానే గట్టిగా ఏడవడం, చేతులు కాళ్లు కదపడం చూస్తుంటాం. మరికొన్ని రోజులకు కానీ కేరింత లు వినపపడవు . కానీ ఈజిప్టులో పుట్టిన ఒక బుడ్డోడు మాత్రం అందరికీ భిన్నంగా కనిపించాడు. 'అమ్మ కడుపులోంచి బయటపడిప వెంటెనే మన'నానీ' గారేంటో తన రాజసాన్ని అమ్మ, అమ్మమ్మలకు చూపించేసాడంటే నమ్మండి. అది చూసి డాక్టర్ కూడా ముచ్చట పడ్డాడు. తల కింద రెండు చేతులు పెట్టుకొని పెద్దమనిషి తరహాలో రిలాక్స్ అవుతూ పడుకు న్నాడు. అప్పుడే పుట్టిన బిడ్డ ఇలాంటి పోజు ఇవ్వడం చూసి అక్కడున్న నర్సులు, డాక్టర్లు కూడా ఆశ్చర్య పోయారు. ఈ క్యూట్ వీడియోను ఈజిప్టులోని కైరోకు చెందిన ప్రముఖ డాక్టర్ ఇస్లాం ఎల్దే తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. షేర్ చేసిన కొన్ని గంటల్లోనే వీడియో మిలియన్ల వ్యూస్ దాటింది.

# అక్యులారీ ట్యూబర్‌క్యులోసిస్



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**కంటికి వచ్చే క్షయ వ్యాధినే అక్యులార్** ట్యూబరీక్యులోసిస్ అని అంటారు. ఇది 1.4-5.74% మందిలో కన్పించే గ్రాన్యులో మాటస్ ఇన్ఫెక్షన్ ఇండియాలో 0.11.5/ ఆఫ్రికాలో 2.8% అమెరికాలో 0.5%, చైనా 12.4% ఇటలీ 13.8%,ఇరాక్ 11.4 జపాన్‌లో 20%, బోష్టన్ 9.86%, సౌదీలో 17.8% మందిలో అక్యులార్ ట్యూబర్‌క్యులోసిస్ కన్పిస్తుంది. దీని వల్ల కంటి చూపులో తేడా కాకుండా కంటికి డామేజ్ కల్గి శాశ్వత అంధ్యత్వం వస్తుంది. ఇది పల్మోనరీ టి.బి. వున్న వారిలో వస్తుందని చెప్పలేము. రక్తం, గళ్ళతో కలుషితం కావడం వల్ల, లింఫాటిక్స్ ద్వారా వస్తుంది. ఇది హైలర్ గ్రంధికి టి.బి. ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు వస్తుంది. హైలర్ గ్రంధి పగిలినప్పుడు బాసిల్లై రక్తంలో కలిసి కంటికి వచ్చే అవకాశం ఉంది. పెరి బ్రాంఖియల్ గ్రంథులు టి.బి. అప్పర్ లోబ్స్‌లో ఉన్నప్పుడు వస్తుంది. ఇది నయమైన చాలా కాలం తర్వాత కంటికి వచ్చే అవకాశం ఉంది. ట్యూబర్ క్యులస్ ప్రోటీన్ హైపర్ సెన్సివిటీ వల్ల వస్తుంది. **ఇది 4 రకాలుగా వస్తుంది.** ఎ. ఫాలిన్ బాడీ రియాక్షన్: టిస్యూ సెన్సివిటీ తగ్గడం వల్ల వస్తుంది. ఇవి దానంతట అదే తగ్గిపోతుంది. లేదా కొరాయిడ్, ఐరిస్, రెటీనా పై చిన్న మిలియరీ ట్యూబర్‌క్యుల్స్‌లాగా ఉంటుంది. బి. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న, ఇన్ఫెక్షన్స్ వల్ల హైపర్ సెన్సివిటీ ఏర్పడిన వస్తుంది. సి. యుక్త వయస్కుల్లో సిస్టిమిక్ ఇన్ఫెక్షన్ తగ్గిన తర్వాత వస్తుంది. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో క్రానిక్‌గా ఉంటుంది. తరుచుగా వచ్చే ఆస్కారముంది. ఉదా: స్క్లెరో కెరటైటిస్. డి. పెద్దవారిలో వస్తుంది. క్రానిక్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుంది. ఉదా: క్రానిక్ యువైటిస్. చరిత్ర : 1707లో మొదటి అక్యులార్ క్షయ కంటికి రావడం గుర్తించారు ఇది ఎండమిక్ ఏరియాలో ఎక్కువగా వస్తుంది. 1855లో ఎడ్వర్డ్ వాన్ జాగర్, 1867 కోన్హమ్ అనే ఇద్దరు శాస్త్రవేత్తల కృషి ఫలితంగా కోరాయిడల్ ట్యూబర్‌క్యుల్‌కి మొదట రావడంతో ప్రపంచ వ్యాప్తంగా కంటికి క్షయ వస్తుందని అందరికి తెలియ వచ్చింది.

**రకాలు: 2 రకాలుగా ఉంటుంది. ఇంట్రా అక్యులార్ పైప్ :** డైరక్ట్ ఇన్ఫెక్షన్, ఇన్‌డైరక్ట్ ఇన్ఫెక్షన్ ఇది హైపర్ సెన్సివిటీ రెస్పాన్స్ మైకో బాక్టీరియల్ ఆంటిజెన్స్‌ను బట్టి ఉంటుంది. ఇది యుని (ఒక ప్రక్క), బై లెటరల్ రెండు ప్రక్కల వస్తుంది. **సూపర్ ఫిషియల్ టైప్ :** ఇది రెండురకాలుగా ఉంటుంది. ప్రైమరీ ఇన్ఫెక్షన్, . సెకండరీ ఇన్ఫెక్షన్ **ప్రైమరీ ఇన్ఫెక్షన్ :** టి.బి. కాంజెక్టివైటిస్ : బైటి నుంచి ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు వస్తుంది. ఇది శరీరంలో ఎక్కడైనా రావచ్చు. అరుదుగా వస్తుంది. పిల్లలు, యుకనత వయస్కుల్లో వస్తుంది. ఇది క్యుటేనియస్ టి.బి. ల్యూపస్ ఇన్ఫెక్షన్ వల్ల కనురెప్పలు, కంజెక్టివా (కనుగుడ్డు తెల్ల భాగం), కార్నియా ఎఫెక్ట్ అవుతుంది. కార్నియల్ అల్సరేషన్ ఏర్పడుతుంది.

# శనిదేవుడు

జీవితం ఆనందంగా .. సంతోషంగా సాగి పోవాలని అంతా అనుకుంటారు. అయితే శని దోష ప్రభావం వలన జీవితం అతలాకు తలం కావడం జరుగుతూ ఉంటుంది. శని దోష ప్రభావం వలన ఆర్థికపరమైన .. ఆరోగ్య పరమైన ఇబ్బందులు తలెత్తుతూ ఉంటాయి. అవమానాలు ఎదురవుతుంటాయి .. కార్యహాని జరుగుతూ ఉంటుంది. అందువలన శనిదోష నివారణకు ఎవరి స్థాయిలో వాళ్లు ప్రయత్నిస్తుంటారు.శని దేవుడిని శాంతి పజేయ డానికి అనేక మార్గాలు చెప్పబడ్డాయి. ప్రతి శనివారం రోజున ఉపవాస దీక్షను చేపట్టి .. సూర్యాస్తమయం తరువాత హనుమంతుడిని పూజిస్తూ ఉండాలి. నువ్వుల నూనెతో దీపారాధన చేసి .. ఎర్రని పూలతో స్వామిని అర్చించాలి. అంతేకాదు .. ప్రతి శనివారం రోజున కోతులకు అరటిపండ్లు .. బెల్లం కలిపిన శనగలను ఆహారంగా అందించాలి. అలాగే శనగలను చేపలకు ఆహారంగా వేయాలి. నల్లకుక్కకు .. నల్ల ఆవుకు తీపి రొట్టెలను ఆహారంగా అందించాలి. ఈ విధంగా చేయడం వలన శనిదేవుడు శాంతిస్తాడని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. శనిదేవుడు అనుగ్రహించడం వలన .. దోష ప్రభావం తగ్గుతూ వెళుతుంది. దాంతో ఆందోళనలు .. అవాంతరాలు తొలగిపోయి, శుభాలు జరగడం మొదలవుతుంది.

# తెలుసుకో!



మన చేతివేళ్లలో కుడిచేయి మధ్య వేలి గోరు వేగంగా పెరుగు తుందట. అదే ఎడమ చేయి వాటం ఉన్నవారి కైతే ఎడమచేతి మధ్యవేలు వేగంగా పెరుగు తుందట. మనం ఆ చేయిని ఎక్కువగా ఉపయోగించడమే అందుకు కారణం

# 'సలార్ 2' కోసం ప్రభాస్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ రీ యూనియన్

డైనోమైట్ ద్వయం.. వైలెంట్ మ్యాన్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలిసి



సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్‌తో ఇండియన్ సినిమాలోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్లలో ఒకటిని అందించారు. ప్రముఖ హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ హైవోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్, శ్రుతి హాసన్, జగపతి బాబు, బాబీ సింహా, శ్రీయా రెడ్డి కీలక పాత్రల్లో నటించారు.ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ ఫ్రాంచైజీపై అంచనాలను మరింత పెంచుతూ 'సలార్ 2'సీక్వెల్‌ను ప్రకటించారు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న డ్రాగన్ సినిమా పనులు పూర్తయిన తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్ ‘సలార్ 2‘ ప్రీప్రొడక్షన్ పనులు ప్రారంభించనున్నారు. మరోవైపు ప్రభాస్ తన బిజీ షెడ్యూల్ లో వరుసగా పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో ముందుకు సాగుతున్నారు. భారీ స్థాయి యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించడంలో, స్టార్ హీరోలను పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో చూపించడంలో ప్రశాంత్ నీల్ తనదైన ప్రత్యేకస్టయిల్ ఏర్పరచుకున్నారు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ స్టయిల్ ఆయన సినిమాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. 'సలార్'పార్ట్ 1 - సీజ్‌ఫైర్థ్ సాధించిన అద్భుతమైన విజయంతో పాటు ప్రభాస్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌పై ఉన్న క్రేజ్.. సీక్వెల్ పై అంచనాలను మరింత పెంచాయి. ఈ ఇద్దరి కలయికలో మరోసారి పవర్‌ఫుల్ యాక్షన్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ను చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు .'సలార్ 2'కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేయనున్నారు మేకర్స్.

# 'మిస్టర్ దెయ్యం' పూజా కార్యక్రమాలతో ప్రారంభం




శౌర్య ఆర్య సమర్పణలో అన్నే క్రియేషన్స్ బ్యానర్ మీద వెంకట్ నిమ్మలపూడి, సింధు అన్నే నిర్మిస్తున్న నూతన చిత్రం ‘మిస్టర్ దెయ్యం‘ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. విజయ్ శంకర్, సిరి చౌదరి, ఖయ్యూమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి సంజన అన్నే దర్శకత్వం వహించను న్నారు. శుక్రవారం నాడు నిర్వహించిన పూజా కార్యక్రమానికి మంచు మనోజ్, అలీ, విజయ్ కనకమేడల, ఆర్పీ పట్నాయక్, పట్నం మహేందర్ రెడ్డి, రమేష్ పుప్పాల, సమీర్, చింటు, వీర శంకర్, రాజా వన్నెం రెడ్డి, వీఎన్ ఆదిత్య, జ్యోత్స, లేబర్ కమిషనర్ గంగాధర్, కొరియోగ్రాఫర్ విజయ్ పోలకి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి మంచు మనోజ్ క్లాప్ కొట్టగా, అలీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. విజయ్ కనకమేడల ఫస్ట్ షాట్‌కి డైరెక్షన్ చేయగా.. వీఎన్ ఆదిత్య, ఆర్పీ పట్నాయక్ స్క్రిప్ట్ అందజేశారు. ఈ పూజా కార్యక్రమం అనంతరం..సంజన అన్నే మాట్లాడుతూ.. .. మా 'మిస్టర్ దెయ్యం'సినిమా ప్రారంభోత్సవానికి వచ్చిన అతిథులందరికీ థాంక్స్. నా ప్రయాణంలో మీడియా ఎప్పుడూ సపోర్ట్‌గానే ఉంటూ వస్తోంది. నటుడు ఖయ్యూమ్ మాట్లాడుతూ.. .'మిస్టర్ దెయ్యం' టైటిల్ బాగుంది. ఈ చిత్రంలో మంచి పాత్రను పోషించబోతోన్నాను. ఎప్పటిలానే నన్ను, నా ఈ మూవీని ఆదరిస్తారని కోరుకుంటున్నాను అని అన్నారు. ..విజయ్ శంకర్ మాట్లాడుతూ.. 'మిస్టర్ దెయ్యం' కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఇలాంటి అద్భుతమైన సంస్థలో పని చేస్తుండటం ఆనందంగా ఉంది. సిరి చౌదరి మాట్లాడుతూ.. 'మిస్టర్ దెయ్యం'మూవీ ఓపెనింగ్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నవంబర్ మొదటి వారంలో చిత్రీకరణ ప్రారంభం కానుంది. మా సినిమాను ఇలానే సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

తెర

# 'ఒకే ఒక జీవితం' డైరెక్టర్ ప్రాజెక్ట్‌లో రుక్మిణి వసంత్



దక్షి ణాది సినీ పరిశ్రమలో సెన్సేషన్‌గా మారిన రుక్మిణి వసంత్, దర్శకుడు శ్రీ కార్తిక్‌తో చేతులు కలిపారు. వీరిద్దరి కలయికలో తెరకెక్కనున్న ఈ కొత్త సినిమా ఇప్పటికే ట్రేడ్ వర్గాలతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తిని పెంచుతోంది. హై కాన్సెప్ట్ సైన్స్ ఫిక్షన్, టైమ్ ట్రావెల్ కథాంశానికి తల్లీ కొడుకుల మధ్య హత్తుకునే భావోద్వేగాలను జోడించి తెరకెక్కించిన ఒకే ఒక జీవితం (తమి ళంలో కణం) విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకుంది. తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర మైన అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు. ఇందులో రుక్మిణి వసంత్‌ను 'తారా'గా పరిచయం చేశారు. ఈ వీడియోతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు శ్రీ కార్తిక్, నటులు దేవ్ రామనాథ్, వినాయక్ వైద్యనాథన్ కలిసి తారా పాత్రను ఖరారు చేయడానికి సమయం మించిపోతోందని చర్చించుకుంటుండగా, వారికి ఓ నోటిఫికేషన్ వస్తుంది. చిత్రాన్ని సిరుని సినీ కార్పొరేషన్, మ్యాడ్‌బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సాయికృష్ణ గడ్వాల్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నిర్మాత జస్వంత్ నడిపల్లితో అనుబంధం ఉన్న సిరుని సినీ కార్పొరేషన్ గతంలో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన 'చి ల సౌ' చిత్రానికి మద్దతుగా నిలిచింది. దేవ్ రామనాథ్, శ్రీ కార్తిక్ నేతృత్వంలోని మ్యాడ్‌బాయ్స్ ఎంటర్‌టైన్ మెంట్ విభిన్నమైన, ఒరిజినల్ కథలను రూపొందించే క్రియేటర్ ఆధారిత కంటెంట్ స్టూడియోగా గుర్తింపు పొందింది. వీరు రూపొందించిన పాపులర్ తమిళ వెబ్ సిరీస్ 'ఐ హేట్ యు - ఐ లవ్ యు', అవార్డు గెలుచుకున్న షార్ట్ ఫిల్మ్ 'చైల్డ్‌హుడ్ డైరీస్' ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందాయి.ాని క్యారెక్టర్ ఈ కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ కోసం గత ఏడాదిన్నర కాలంగా ఈ సినిమాను రూపొందించడానికి తాము చేసిన ప్రయాణాన్ని ప్రతిబింబించేలా ఇన్‌స్టాగ్రామ్ ప్రత్యేక డాక్యుడ్రామా

# న్యూయార్క్ ఫ్యాషన్ వీక్ 2026లో తెలుగు హీరో రాజ్ దాసిరెడ్డి సందడి!



కలలు, పట్టుదల, భారతీయ స్ఫూర్తికి ప్రతీకగా అంతర్జాతీయ ఫ్యాషన్ వేదికపై తెలుగు మూలాలున్న రాజ్ దాసిరెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 2025లో 97వ ఆస్కార్ వేడుకలకు ఆహ్వానం అందుకుని అంతర్జాతీయ మీడియా, అభిమానుల దృష్టిని ఆకర్షించిన రాజ్ దాసిరెడ్డి.. తాజాగా న్యూయార్క్ ఫ్యాషన్ వీక్ 2026లో హైప్రొఫైల్ ప్రదర్శనతో మరోసారి వార్తల్లో నిలిచారు. తెలుగు నేల నుంచి అంతర్జాతీయ వేదికల వరకు సాగుతున్న ఆయన ప్రయాణం సోషల్ మీడియాలోనూ విశేష చర్చకు దారితీస్తోంది. అమెరికాలో విద్యాభ్యాసం చేయడంతోపాటు... అక్కడే ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ తీసుకుని, మోడలింగ్ నుంచి నటనలోకి ప్రవేశించి, మారుతి దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందిన “భద్రం బీకేర్ ఫుల్ బ్రదరు“ చిత్రంతో హీరోగా పరిచయ మైన రాజ్ దాసిరెడ్డి నటిస్తున్న ఓ బహుభాషా చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

# 'జో జో' టీమ్ కాషన్ 2 వీడియో రిలీజ్



హీరో, హీరోయిన్‌ని ప్రేమిస్తా నంటాడు.. దానికి బదులుగా పడుచు పిల్ల కానోస్తే... ఓ నాలుగు దినాలు వెనక పడి... పని కానిచ్చుకొని... పారిపోయే టైపా? ఇష్టపడిన పిల్లని దాని బాధ్యతలతో సహా పెళ్ళి చేసుకొని దాన్ని జీవితాంతం మోసెంత గుండకాయ ఉన్న మొగోడి టైపా అన్ని ఆ పిల్ల ప్రశ్నిస్తాది .. దానికి హీరో బదులిస్తూ.. సత్య ప్రమాణికంగా చెబుతున్నా ఒకతూరి మాట ఇచ్చినానంటే మడమ తిప్పని వంశం మాది... బాలయ్య బాబు టైపు అని హీరో గడుసుగా సమాధానం ఇస్తాడు. హీరోయిన్ మరి హీరోని ప్రేమిస్తాదా! అని తెలియా లంటే మాత్రం ‘జో జో‘ సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. కృష్ణ కమల్ , మహి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న రూరల్ కామెడీ డ్రామా 'జో జో'. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రముఖ దర్శకుడు దేవకట్టా సమర్పణలో కిరణ్ జయ్ కుమార్ దర్శకుడిగా రూపొందుతోంది. విజయం బ్యానర్‌పై విజయ్ కృష్ణ లింగమనేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన కాషన్ 1కు అమే జింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో మేకర్స్.. గురువారం జో జో సినిమా నుంచి కాషన్ 2 వీడియో విడుదల చేశారు. జొన్నగిరి బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. మనోభావాల బ్యాచ్ దూరంగా ఉండండంటూ విడుదలైన కాషన్ 1కు ఏమాత్రం తీసిపోని రేంజ్‌లో కాసన్ 2 ఉంది. రా రస్టిక్ రొమాంటిక్ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాషన్ వన్ వీడియోతో సినిమాపై మేకర్స్ క్యూరియా సిటీ క్రియేట్ చేశారు. సినిమాకు సంబంధించి మరికొన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు.

# 'రియాలిటీ' నుంచి 'భజ గోవిందం' సాంగ్ రిలీజ్



ప్రామిసింగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో నిత్యజీవితంలోని సహజమైన భావోద్వేగాలను, మన చుట్టూ ఉండే చిన్న చిన్న ఆనందాలను అందంగా ప్రజెంట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. 'క', 'కెరాంప్' చిత్రాల విజయాలతో జోరు మీదున్న ఆయన, ఈ సినిమాకు హీరోగా నటించడం తో పాటు కథ, స్క్రీన్‌ప్లే అందించి దర్శకత్వం కూడా వహిస్తు న్నారు. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మేకర్స్ తాజాగా ఈ సినిమా సంగీత ప్రయాణాన్ని ప్రారంభిస్తూ తొలి పాట‘భజ గోవిందం‘ ఫుల్ వీడియోను విడుదల చేశారు. గతంలో విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించగా, ఈ పాట సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది. 'రియాలిటీ' జీవితానికి ఆంథమ్‌లా నిలిచే ఈ పాట, జీవితంలోని చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే సినిమా ప్రధాన సందేశాన్ని అందంగా ఆవిష్కరిస్తోంది. భీమ్స్ సిసిరోలియో ప్రశాంతమైన, భక్తిభావంతో కూడిన మెలోడీని స్వరపరిచారు. సనారే అందించిన అర్థవంతమైన సాహిత్యం మన దగ్గర ఉన్నదానితో సంతృప్తిగా ఉండటం, మనం చేసే పనిని ప్రేమించడం, స్వయంగా ఎదగడం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. జీవితంలోని బాధ్యతల మధ్య మన కోసం మనం కొంత సమయాన్ని కేటాయించుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ పాట గుర్తుచేస్తోంది.

# బిజెపి విధానాలపై పోరాటాలు ఉధృతం

## సర్ పేరుతో 13 కోట్ల ఓట్ల తొలగింపునకు కుట్ర




సిపిఎం కేంద్ర కార్యాలయంలో పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులుతో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ఎ.విజయరాఘవన్, చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ఎ.విజయరాఘవన్**

**తెలంగాణకు రూ.50 వేల కోట్లతో కరవు ప్యాకేజీ ఇవ్వాలి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**చిక్కడపల్లి అక్టోబర్ 23 ( ప్రభాతవార్త ) :** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ విధానాలను నిర సిస్తూ దేశవ్యాప్తంగా విపక్షాలను ఏకం చేసి, ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ఎ.విజయరాఘవన్ పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక హక్కులను, ప్రజల జీవనోపాధిని పరిరక్షి ంచ దానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్ సిపిఎం కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మైనార్టీలు, దళితులు, బీసీల మద్దతు కోల్పోయి మోడీ ప్రభుత్వం మెజార్టీ కోల్పోయిందని విజయరాఘవన్ గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో తమ రాజ్యాధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది నిజమైన ఓటర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించే కుట్రకు పూనుకుందని విమర్శించారు. ఒక్క ఢిల్లీలోనే 35 శాతం ఓట్లు గల్లంతయ్యాయని, తొలగించిన పేర్లను తిరిగి నమోదు చేసుకోవడానికి నాలుగైదేండ్లు పడుతుందని, ఇది ఓటర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని స్పష్టం చేశారు. ఓట్లు కోల్పోయిన వారు ప్రభుత్వ పథకాలకు కూడా దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్‌లో ఓట్ల తొలగింపు వల్లనే బీజేపీ అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. ధరలు పెరిగి సామాన్యులు అల్లాడుతుంటే జీడీపీ పెరిగిందని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ నిరసన తెలుపు తున్న యువత, విద్యార్థులపై దాడి చేయడం సరి కాదని, అణచివేసేకొద్దీ పోరాటాలు తీవ్రతరమవ ుతాయని హెచ్చరించారు. బివి రాఘవులు వ దేశ సమైక్యత కోసం కృషి చేయాలని దసరా సందర్భంగా ప్ర ధా ని మోడీ పిలు పు నివ్వడం వి డ్డూ రం గా ఉందని విమ ర్శించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ వ్యవహార శైలిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీ ఈసీ జ్ఞా నేష్ కు మార్ ఏక పక్ష నిర్ణ యాలపై మిగతా ఇద్దరు కమిషనర్లు సైతం తీవ్ర అభ్యం తరాలు వ్యక్తం చేశారనే విషయాన్ని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సుమారు 64 లక్షల మంది ఓటర్ల పేర్లను అక్రమంగా తొలగించడం ప్రజాస్వామ్యంపై జరిగిన అత్యంత హేయమైన దాడిగా అభివర్ణించారు. ఈసీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ సహా ప్రాంతీయ పార్టీలన్నీ కలిసి రావాలని, లేదా విడిగానే అయినా ఓటర్ల తొలగింపుపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏపీలో స్థానిక ఎన్నికల నామినేషన్ల అడ్డగింపుపై స్పందిస్తూ నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వ హించడంలో ఈసీ విఫలమైందని విమర్శించారు.

**కరువు నివారణకు రూ.50 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి: జాన్ వెస్లీ**

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో తీవ్ర కరువు ఛాయలు ఏర్పడ్డాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు తక్షణమే రూ.50 వేల కోట్లతో ప్రత్యేక కరువు ప్యాకేజీని ప్రకటించాలి. పంటల గ్యారెంటీ విద్యుత్: ఆరు

# నిజామాబాద్‌లో ఆస్తి కోసం తల్లి, బిడ్డలను హత్య చేసిన దంపతులకు జీవిత ఖైదు

**హైదరాబాద్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లాలో ఆస్తికోసం సొంత మరదలిని, ఆమె రెండేళ్ల కుమారుడిని హత్య చేసిన కేసు లో దంపతులకు జీవిత ఖైదు శిక్షతో పాటు 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి జీవిఎన్ భారత లక్ష్మీ ్మ శుక్రవా రం తీర్పు చెప్పారు. వివరాలు ఇలావున్నాయి. జిల్లాలోని నవీపేట్ మండల కేంద్రంలోని సుభాష్ నగర్‌కు చెందిన దాసరి రాజశేఖర్, దాసరి రా జబాబు అన్నదమ్ములు. వీరికి ఉమ్మడి ఆస్తులు ఉన్నాయి. చిన్నవాడైన రాజబాబుకు భార్య పిల్లలు ఉన్నారు. తమ్ముడికి మతిస్థిమితం లేక పోవ దంతో రాజశేఖర్ మొత్తం ఆస్తిని కాజేయాలని కుట్ర పన్నాడు. ఇందులో భాగంగా 2022 ఆగస్టు రెండవ తేదీన అర్ధరాత్రి సమయంలో రాజశేఖ ర్ తన భార్య నాగలక్ష్మీతో కలిసి తమ్ముడి భార్య లతతో పాటు ఆమె రెండేళ్ల కుమారుడు హార్షవర్ధన్‌ను మెడకు నైలాన్ తాడు బిగించి హత్య చే శారు. అనంతరం వారి శవాలను కారులో మోర్తాడ్ మండలం గాండ్లపేట్ గ్రామ శివారు దగ్గర జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న తుమ్మ చెట్ల లో పడవేశారు. మరుసటి రోజు ఏమీ తెలయనట్లు నటించారు. కాగా ఈ ఘటనపై లత గండయ్య పిర్యాదు మేరకు నవీపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. దీంతో రాజశేఖర్, నాగలక్ష్మి దంపతులను పోలీసులు అరెస్టు చేసి వారిపై కో ర్టు లో ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టులో నాలుగేళ్ల పాటు వాదనలు జరిగాయి. దీనిపై శుక్రవారం నాడు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయ మూర్తి భారత లక్ష్మీ తీర్పు చెబుతూ దంపతులిద్దరికి జీవిత ఖైదు శిక్ష విధించారు. దీంతో పాటు హత్యానంతరం సాక్ష్యాలను తారుమారు చేసిన ందుకు ఇద్దరికి 20 వేల రూపాయల జరిమానాతో పాటు ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. తల్లి, బిడ్డలను హత్య చేసిన దంపతులకు జీవిత ఖైదు శిక్ష పడేలా చేసిన పోలీసులను కమిషనర్ సాయి చైతన్య

# వీసా వస్తుందో లేదోనని యువకుడి ఆత్మహత్య

**అత్తాపూర్ అక్టోబరు 23,ప్రభాతవార్త :** వీసా రాలేదని మనస్థాపానికి గురైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ సీతయ్య వివరాల ప్రకారం...అత్తాపూర్ తేజస్వినగర్‌లో నివాసించే రోహిత్ రెడ్డి (26) ఉన్నత చదువుల కోసం అబ్రాడ్ వెళ్లాలని ఆశతో వీసాకు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో ఒకసారి వీసాకు దరఖాస్తు చేసుకోగా రిజెక్ట్ అయ్యింది. అయితే మరోసారి వీసా కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలోనే విసా వస్తాందో రాదోనని భయంతో ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడాడు. నిత్యం విసా గురించి పలుమార్లు తల్లిదండ్రు లతో చర్చించిస్తూ ఉండేవాడని తల్లిదండ్రులు తెలిపారు. ఆత్మహత్య ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాల సేకరించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# నిమ్స్‌లో జాతీయ స్థాయి గుండె శస్త్రచికిత్స నిపుణుల సదస్సు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** గుండె, ఛాతీ శస్త్రచికిత్సల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై వైద్యులకు అవగాహన కల్పిం చేందుకు నిమ్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వైద్య సదస్సు ప్రారంభమైంది. నిమ్స్ గుండె, ఛాతీ శస్త్రచికిత్స విభాగం, భారత గుండె, ఛాతీ శస్త్రవైద్యుల సంఘం సంయుక్తంగా అక్టోబర్ 23 నుంచి 25 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నాయి. నిమ్స్ శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వైద్యులకు ఆధునిక శస్త్రచికిత్సా పద్ధతులపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. 24, 25 తేదీల్లో జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శాస్త్రీయ సదస్సు జరగనుంది. దేశవ్యాప్తంగా 250 మందికి పైగా వైద్యులు, 25 మందికి పైగా సీనియర్ వైద్య నిపుణులు పాల్గొననున్నారు. సదస్సులో రోబోటిక్ శస్త్రచికిత్సలు, గుండె, ఊపిరితిత్తుల మార్పిడి, బృహద్ధమని శస్త్రచికిత్సలు, పుట్టుకతో వచ్చే గుండె సమస్యల చికిత్సపై చర్చించనున్నారు. వైద్య విద్యార్థులకు పోటీలు, వైద్య పరిశోధనల ప్రదర్శనలు, ఆధునిక వైద్య పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. వైద్యుల నైపుణ్యాలను పెంపొందించడం, ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన కల్పించడం ఈ సదస్సు ప్రధాన లక్ష ్యమని నిర్వాహకులు తెలిపారు.

# తెలుగు వర్సిటీ సాహిత్య పురస్కారాల రచనలకు ఆహ్వానం

## రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హానుమంతరావు

**నాంపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియల్లో వెలువడిన ఉత్తమ రచనలను ప్రోత్సహించేందుకు 2026, 2027 సంవత్సరాలకు అందించే సాహిత్య పురస్కారాల కోసం పాఠకులు, రచయితల నుండి సూచనలు, రచనలు ఆహ్వానిస్తున్నట్లు విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హానుమంతరావు తెలిపారు. 2023 జనవరి నుండి 2026 డిసెంబరుల మధ్య తొలిసారిగా ప్రచురితమైన గ్రంథాలను ఈ పురస్కారాల ఎంపికకు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. వచన కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, గేయ కవిత్వం, నవల, కథానికల సంపుటి, నాటకం/ నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, రచయిత ఉత్తమ గ్రంథం తదితర 11 ప్రక్రియల్లో పురస్కా రాలకు గ్రంథాలను సూచించవచ్చని తెలిపారు. అన్ని ప్రక్రియలకు లేదా తమకు నచ్చిన కొన్ని ప్రక్రియలకు సంబంధించి సూచనలు పంపవచ్చ న్నారు. రచయితలు తమ రచనలను స్వయంగా ప్రతిపాదించవచ్చునని వివరించారు. గ్రంథాన్ని సూచించేటప్పుడు ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణకర్త వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలి. అనువాద సాహిత్య విభాగంలో ఇతర భాషల నుండి అనువదించిన రచనలు, అనుసరణలను కూడా పరిశీలనకు పంపవచ్చు. వచన రచన విభాగంలో సామాజిక, ఆర్థిక, తాత్విక, వైజ్ఞానిక అంశాలతోపాటు సైన్స్, చరిత్ర, సంస్కృతి, కళలకు సంబంధించిన గ్రంథాలను సూచించవచ్చు. అన్ని ప్రక్రియల్లోనూ ప్రామాణికమైన మౌలిక రచనలను సూచించాలని రిజిస్ట్రార్ తెలిపారు. కవితా సంపుటాలు కనీసం 60 పేజీలు, ఇతర ప్రక్రియల్లోని గ్రంథాలు కనీసం 96 పేజీలు ఉండాలని పేర్కొన్నారు. అయితే బాలసాహిత్యం, నాటక ప్రక్రియలకు ఈ పుటల పరిమితి వర్తించదని స్పష్టం చేశారు. పాఠకులు, రచయితలు తమ సూచనలను రిజిస్ట్రార్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, సాయినగర్ రోడ్, బాచుపల్లి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, హైదరాబాద్-500090 చిరునామాకు 2027 జనవరి 31లోగా పంపాలని సూచించారు. పురస్కారాలకు సంబంధించిన పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ తెలుగు యూనివర్సిటీ.ఏసి.ఇన్ లో తెలుసుకోవచ్చని, మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ విస్తరణ సేవావిభాగాన్ని సంప్రద ించాలని రిజిస్ట్రార్ హానుమంతరావు కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి

# గంజాయి, పాపీ స్ట్రాతో పాటు ఆయుధాలు స్వాధీనం

**- రాజేంద్రనగర్‌లో ఒకరి అరెస్ట్..**

**రూ.4 లక్షల విలువైన**

## మాదకద్రవ్యాలు పట్టివేత

**అత్తాపూర్ అక్టోబరు 23,ప్రభాతవార్త :** అక్రమ మాదకద్రవ్యాల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై నిఘా పెంచిన అధికారులు రాజేంద్రనగర్‌లో తనిఖీలు నిర్వహించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.5 కిలోల గంజాయి, 1.13 కిలోల పాపీ స్ట్రాతో పాటు ఒక రివాల్వర్, రెండు పిస్టళ్లు, ఐదు రౌండ్ల తూటాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మాదకద్రవ్యాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అక్టోబర్ 23న రాజేంద్రనగర్ ఎస్‌హెచ్‌ఓ నజీర్ పాషా ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మంగళ్‌హాట్‌కు చెందిన గ్యాంగాజు రాజా సింగ్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. పాపీ స్ట్రాను నాందేడ్ సమీపంలోని ప్రాంతం నుంచి తీసుకొచ్చినట్లు సమాచారం ఉందని, దాని మూలాలపై మరింత విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో రాజేంద్ర నగర్ ఎస్‌హెచ్‌ఓ నజీర్ పాషా, ధూల్‌పేట్ ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ కుమార్, సీఐ విప్లవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసి కార్మికులను ఆదుకుంటాం

## సిఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జి గద్వాల్ విజయలక్ష్మి



ఆర్టీసీ కార్మికులతో చర్చిస్తున్న సిఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల విజయలక్ష్మి

**బేగంపేట అక్టోబరు 23,ప్రభాతవార్త** ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులను ఆదుకుంటామని, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి ్మ అన్నారు. వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులకు తిరిగి విధుల్లోకి తీసుకునే విషయంలో ఆర్టీసీ ఎండీ, సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటామని, ఆర్టీసీ కార్మికులను ఆదుకుంటాం అని గద్వాల్ విజయలక్ష్మి ్మ హామీనిచ్చారు. వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున శుక్రవారం జరిగిన సీఎం ప్రజావాణికి వచ్చి ఆమెను కల్సి తమ సమస్యను వివరించారు. కొంతకాలం క్రితం 317 మంది ఆర్టీసీ కార్మికులకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించామని, మిగతా 180 మందిని కూడా ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని విజయలక్ష్మి ్మ పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన 263వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 103 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి ్మ దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్ మెంట్స్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. రెవెన్యూ శాఖకు 27, బీసీ సంక్షేమ శాఖకు 18, మున్సిపల్ శాఖకు 14, ఇతర శాఖలకు 44 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ కులస్తులను బిసి-ఎ లో చేర్చొద్దు

## తెలంగాణ బిసి-ఎ కులాల హక్కుల పరిరక్షణ సమితి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ భాగయ్య

**సైఫాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** ముదిరాజ్ కులస్తులను బిసి-ఏ జాబితాలో చేర్చే ప్రతిపాద నలను సిఎం రేవంత్‌రెడ్డి విరమించుకోవాలని తెలంగాణ బిసి-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి విజ్ఞప్తి చేసింది. బిసి ఏ జాబితాలో చేర్చుతామన్న అంశం కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మ్యానిఫోస్టోలో చేర్చడం జరిగిందని, దీనిని తిరిగి సిఎం తెరమీదకు తీసుకురావడం ఓటు బ్యాంక్ రాజకీయాల్లో భాగమని పరిరక్షణ సమితి ఆరోపించింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.భాగయ్య, అధ్యక్షుడు గడప శ్రీహరి, ప్రధాన కార్యదర్శులు టి.నారాయణ, కంటే రాంచందర్, కోశాధికారి అంబటి సుధకార్ మాట్లాడుతూ బిసి-ఏ జాబితాలోని అత్యంత వెనుకబడిన కులాలకు ప్రభుత్వం అన్యాయం చేయరాదని, ప్రధానంగా యాచక, సేవా వృత్తులపై ఆధారపడిన కులాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన ఆయా కులాల రిజర్వేషన్ అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ఈ తరుణం కూడా ముదిరాజ్ కులస్తులపై తమకు ఏలాంటి ద్వేషం లేదని, వారికి మేలు చేయాలనుకుంటే ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పోరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. లేని పక్షంలో ఇతర రిజర్వేషన్ వర్గాల్లో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని, అనంతరామన్ కమిషన్ గతంలో కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేసి, ఎబిసిడిలుగా వర్గీకరించడం జరిగిందని, ప్రస్తుతం ఈ ప్రతిపాదనపైన కూడా ప్రభుత్వం అధ్యయనం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీలో బిసి-ఏ కులాలకు చెందిన ప్రతినిధులకు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, సంఘాల నాయకులకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. బిసి-ఏ జాబితాలోని 57 కులాల్లో 38 లక్షల మంది జనాభా ఉందని, ముదిరాజ్‌లను కూడా ఇదే జాబితాలో చేర్చితే విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాల విషయంలో పోటి పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్రీయ అధ్యయనం ఆధారంగా నిర్ణయిం తీసుకోవాలని, ఆ తరువాతే రిజర్వేషన్‌లపై ప్రభుత్వం నిర్ణయిం తీసుకోవాలని కోరారు. ముదిరాజ్‌లను బిసి-ఏ జాబితాలో చేర్చే అంశాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాల కేంద్రాలలో తమ కులాల ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, ప్రదర్శనలు నిర్వహించి జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలను అందించాలని వారు కోరారు.



# బిగ్‌బి నివాసం, దిల్జిత్ కచేరీల్లో ఆత్మాహుతి దాడులు చేస్తాం

## ముంబయి మేయర్‌కు బెదరింపు ఇ మెయిల్

**ముంబయి, అక్టోబరు 23:** బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, ప్రముఖ గాయకుడు, నటుడు దిల్జిత్ దొసాంజ్‌లను లక్ష్యంగా చేసుకుని వచ్చిన ఓ బెదిరింపు ఈమెయిల్ ముంబైలో తీవ్ర కలకలం రేపింది. అమితాబ్ నివాసంపై గ్రెనేడ్ దాడికి, దిల్జిత్ సంగీత కచేరీలో ఆత్మాహుతి దాడికి పాల్పడతామంటూ ఆగంతకులు హెచ్చరించడంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంతో పాటు ముంబై మేయర్ రీతూ తవ్డే కార్యాలయానికి ఈ బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. స్మిత్ జాన్సన్ అనే పేరుతో పంపిన ఈ మెయిల్‌కు ఖలిస్థాన్ అనే పదాన్ని సబ్జెక్టుగా పెట్టారు. ఇందులో జుహూలోని అమితాబ్ బచ్చన్ నివాసం జల్సాపై గ్రెనేడ్లతో దాడి చేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా నవంబర్ 27న మహాలక్ష్మి రేస్‌కోర్స్‌లో జరగనున్న దిల్జిత్ సంగీత కచేరీలో ఆత్మాహుతి దాడికి పాల్పడతామని హెచ్చరించారు. ఈ రెండు ప్రదేశాలతో పాటు కొన్ని పాఠశాలలు, మేయర్ కార్యాలయాన్ని కూడా టార్గెట్ చేస్తామని ఆ మెయిల్‌లో ఉంది. ఈమెయిల్ అందుకున్న వెంటనే అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు అమితాబ్ నివాసం వద్ద, కచేరీ జరగాల్సిన ప్రదేశంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు. అయినప్పటికీ, దీనిని తీవ్రంగా పరిగణించిన పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఇటీవల అక్టోబర్ 30న ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగాల్సిన దిల్జిత్ కచేరికి భద్రతా కారణాల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. ఆ ఘటన జరిగిన కొద్ది రోజులకే ముంబైలో ఇలాంటి బెదిరింపు రావడం ఆందోళన కలిగిస్తోంది.

ఈ ఈమెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది దీని వెనుక ఉన్నది ఎవరు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇది నిజమైన బెదిరింపా లేక ఆకతాయిల చర్యాఅనే విషయాన్ని తేల్చే పనిలో నిమగ్నమయ్యారు.

# తల్లి ఆరోగ్యం కుదుటపడాలని కొడుకు జ్యోతిర్లింగాల పాదయాత్ర!



**పాట్నా,అక్టోబరు 23:** తల్లి కోసం ఓ యువకుడు చేస్తున్న ద్వాదశ జ్యోతిర్లింగాల యాత్ర ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్‌గా మారింది. తల్లి అనారోగ్యం నుంచి కోలు కోవాలని దేవుడిని ప్రార్థించిన యువకుడు, ఇప్పుడు 12 జ్యోతిర్లింగాలను పరిగెత్తు కుంటూ దర్శిస్తున్నాడు. అనారోగ్యం నుంచి తల్లి కోలుకున్న తర్వాత, ఆ మొక్కును తీర్చుకునేందుకు తన యాత్ర ప్రారంభించాడు. బీహార్‌కు చెందిన 19 ఏళ్ల మోను మెటుర్బాలా ఇప్పటివరకు సుమారు 8,000 కిలోమీటర్లు ప్రయాణించి ఆరు జ్యోతిర్లింగాలను దర్శించాడు. మోనూ 2026 మార్చి 15న పాట్నా నుంచి తన యాత్ర ప్రారంభించారు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న అతను రోజుకు సుమారు 50 కిలోమీటర్లు పరిగెత్తాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మిగిలిన 6 జ్యోతిర్లింగాలను దర్శించుకున్న తర్వాతే ఇంటికి వెళ్తానని సంకల్పం తీసుకున్నాడు. మోనూ తల్లి లల్తీ దేవీ గొంతులో చేప ముల్లు ఇరుక్కోవడంతో ఆమె ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు పలు చోట్ల చికిత్స చేయించినప్పటికీ ఆమె ఆరోగ్యం నయం కాలేదు. అలాంటి సమయంలో, కొడుకు మోనూ ఆ పరమశివుడిని ప్రార్థిస్తూ, తల్లి ఆరోగ్యం బాగుపడితే జ్యోతిర్లింగాలు దర్శిస్తానని మొక్కుకున్నాడు. కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేసేందుకు మోనూ పానీపూరీ విక్రయిస్తున్నాడు. అతడి తండ్రి మహేశ్ చౌహాన్, అన్న సోను ఇద్దరూ ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, యాత్రకు బయలుదేరే ముందు కుటుంబం ఎంతోకొంత సాయం చేశారు. మోనూ తన మొక్కులో భాగంగా జార్ఖండ్‌లోని బాబా బైద్యనాథ్ ధామ్ నుంచి తన యాత్ర ప్రారంభించాడు. ఇప్పటి వరకు ఆరు క్షేత్రాలను దర్శించుకున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ యాత్రలో మరో ఇద్దరు యువకులు కూడా అతడితో జతకట్టారు.

# 18 కిలోమీటర్లు కాలినడకన అత్తారింటికి

## సిఎం పుష్కర్‌సింగ్‌ధామికి వధువు విడియో



**డెహ్రాడూన్, అక్టోబరు 23:** ఉత్తరాఖండ్‌లోని ఓ మారుమూల గ్రామానికి చెందిన నవవధువు, తన పెళ్లి రోజునే రోడ్డు సౌకర్యం కోసం ప్రభు త్వానికి విజ్ఞప్తి చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పెళ్లి తర్వాత అత్తారింటికి వెళ్లేందుకు ఏకంగా 18 కిలోమీటర్ల దూరం కాలినడకన ప్రయాణించి, తన కష్టాన్ని వీడియో ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. ఈ ఘటన చక్రాటా ప్రాంతంలో చోటుచేసుకుంది. డెహ్రాడూన్ సమీపంలోని బులహార్ గ్రామానికి చెందిన షర్మిలకు, ఉండవా అనే మారుమూల గ్రామానికి చెందిన యువకుడితో వివాహం జరిగింది. పెళ్లి ఊరేగింపుతో అత్తవారింటికి బయలుదేరిన ఆమె ప్రయాణం, లోఖండి ప్రాంతం వద్ద ఆగిపోయింది. అక్కడి నుంచి ఉండవా గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఆమె తన ప్రయాణాన్ని కాలినడకన కొనసాగించాల్సి వచ్చింది. బరువైన పెళ్లి లెహంగా ధరించి, కఠినమైన, ఎగుడుదిగుడు దారిలో ఆమె నడుస్తున్న దృశ్యాలను గ్రామస్థులు వీడియో తీశారు. అత్తవారింటికి సమయానికి చేరుకోవాలనే ఆత్రుతతో ఆమె వేగంగా నడిచారు. ఈ ప్రయాణం మధ్యలోనే ఆమె, తన ఆవేదనను వీడియో ద్వారా నేరుగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికి విన్నవించుకుంది. నేను లోఖండి నుంచి ఉండవా గ్రామానికి నడిచి వెళుతున్నాను, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు ఎవరికీ రాకుండా దయచేసి మా గ్రామానికి ఒక రోడ్డు నిర్మించండని ఆమె వేడుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మారుమూల గ్రామాల్లోని రహదారుల సమస్య మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ప్రపంచంలోనే తొలి షామోండా వైరస్ కేసు ఫ్రాన్స్‌లో వెలుగులోకి!



**పారిస్, అక్టోబరు 23:** ఫ్రాన్స్‌లో తొలిసారిగా ఒక వ్యక్తికి షామోండా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ అరుదైన ఇన్‌ఫెక్షన్‌తో బాధితుడు మరణించినప్పటికీ, ప్రజలకు ఎలాంటి ప్రమాదం లేదని ఆరోగ్య అధికారులు స్పష్టం చేశారు. ఇది ఒక అసాధారణమైన కేసు అని, దీనివల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. లియోన్ నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మరణించిన వ్యక్తి 60 ఏళ్ల వయసున్న పురుషుడు. ఆయన ఇప్పటికే తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ, రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ వైరస్ కారణంగా ఆయనలో నరాల సంబంధిత సమస్యలు తలెత్తాయని, అవే మరణానికి దారితీసి ఉండవచ్చని భావిస్తున్నారు. తూర్పు ఫ్రాన్స్‌లో ఖిక్యులికాయిడ్స్‌ఖి అనే ఒక రకమైన కీటకం కాటు ద్వారా అతనికి ఈ వైరస్ సోకి ఉంటుందని అనుమానిస్తున్నారు. షామోండా అనేది ఆర్థోబన్యావైరస్ కుటుంబానికి చెందిన వైరస్. ఇది ప్రధానంగా పశువులు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు కీటకాల ద్వారా వ్యాపిస్తుంది. 1960లలో నైజీరియాలో తొలిసారి గుర్తించిన ఈ వైరస్, ఆఫ్రికా, జపాన్‌లలోని జంతువులలో అప్పుడప్పుడు కనిపించింది. 2026లో తొలిసారిగా యూరప్‌లో ప్రవేశించింది. ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్, స్పెయిన్, ఐర్లాండ్ సహా పదుల దేశాల్లోని పశువులలో దీనిని గుర్తించారు. జంతువులలో ఇది జ్వరం, నీరసం, పాలు తగ్గిపోవడం వంటి లక్షణాలను కలిగిస్తుంది. పశువులలో గర్భస్రావాలకు కూడా దారితీస్తుంది. దీనికి ప్రస్తుతానికి ఎలాంటి వ్యాక్సిన్ అందుబాటులో లేదు. ప్రపంచంలో నమోదైన ఏకైక మానవ కేసు ఇదే కావడంతో, మనుషులలో దీని లక్షణాలపై స్పష్టత లేదు. ఇది ఒక వివిక్తమైన కేసు అని, ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. కీటకం కాటు ద్వారా కాకుండా జంతువుల నుంచి మనుషులకు వ్యాపించినట్లు కూడా ఆధారాలు లేవని అధికారులు తేల్చిచెప్పారు. ప్రస్తుతం ఫ్రెంచ్ అధికారులు, యూరోపియన్ సెంటర్ ఫర్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా దీనిపై పరిశోధనలు కొనసాగిస్తున్నాయి.